

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 339

గురువారం 29-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్‌లో బిల్ గేట్స్

టెక్ దిగ్గజం బిల్‌గేట్స్ హైదరాబాద్‌లోని ఐడీసీని సందర్శించారు. - 13లో



తొలి మహిళా క్యూరేటర్

విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో పిచ్ క్యూరేటర్‌గా జసింత ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. - 11లో



అఖిలేశ్‌ను ప్రశ్నించనున్న సీబీఐ

యూపీలో అక్రమ గనుల కేటాయింపుల కేసుల్లో విచారణకు రావాలని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌ను సీబీఐ ఆదేశించింది.

- వివరాలు 6లో



మాతృత్వానికి దూరం.. దూరం!

దక్షిణ కొరియాలో చాలామంది మహిళలు పిల్లల్ని కనడం లేదు. మాతృత్వానికి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంటున్నారు.


- వివరాలు 6లో



అమెరికాలో కార్చిచ్చు..

టెక్సాస్ రాష్ట్రంలో కార్చిచ్చు చెలరేగింది. లక్షల ఎకరాలు ఆహుతయ్యాయి. టెక్సాస్ చరిత్రలో అతిపెద్ద కార్చిచ్చు ఘటనల్లో ఇది ఐదోది.

- వివరాలు 6లో



టార్గెట్ హిమాచల్?

హిమాచల్‌ప్రదేశ్ రాజకీయ పరిణామాలు రసకందాయంలో పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడపై సందేహాలు మొదలయ్యాయి.

- వివరాలు 6లో

మెగా హెచ్‌ఎండీఏ!

ఆర్ఆర్ఆర్ వరకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ విస్తరణ

ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాలను హెచ్‌ఎండీఏ పరిధిలోకి తీసుకురావాలన్న సీఎం

- రెండు రింగ్ రోడ్లను అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు
- ఓఆర్ఆర్‌లోపు ప్రాంతం, ఆర్ఆర్ఆర్ లోపు ప్రాంతం రెండు వేర్వేరు యూనిట్లుగా అభివృద్ధి ప్రణాళికలు
- సిటీతో పాటు శివారు మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- మాస్టర్ ప్లాన్–2050కి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్‌కు రూపకల్పన
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- ఓఆర్ఆర్ టోల్ టెండర్లలో అవకతవకలపై సీబీఐ లేదా తత్సమాన సంస్థతో విచారణ జరిపిస్తామని వెల్లడి
- పురపాలక శాఖ, హెచ్‌ఎండీఏపై ముఖ్యమంత్రి సమీక్ష



హెచ్‌ఎండీఏపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)ను రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) వరకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం ఏడు జిల్లాల్లో ఏడు వేల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న హెచ్‌ఎండీఏ సుమారు పదివేల చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయంలో పురపాలక శాఖ, హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి కొత్తగా రానున్న ఆర్ఆర్ఆర్ మధ్య ఉండే ప్రాంతాలను హెచ్‌ఎండీఏ పరిధిలోకి తీసుకుని రావాలని ఆదేశించారు. రెండు రింగ్ రోడ్లను అనుసంధానించేలా రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ఓఆర్ఆర్ లోపు ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా, ఆర్ఆర్ఆర్ లోపు ఉన్న ప్రాంతాన్ని మరో యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన సిటీతో పాటు కొత్తగా విస్తరిస్తున్న శివారు మునిసిపాలిటీల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. మాస్టర్ ప్లాన్- 2050కి అనుగుణంగా ప్రత్యేక కన్సల్టెన్సీతో సిటీ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని ఆదేశించారు.

ఆమ్రపాలికి 'టోల్ నివేదిక' బాధ్యత

ఓఆర్ఆర్ టోల్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని హెచ్‌ఎండీఏ అధికారులను సీఎం ఆదేశించారు. కనీస రేటు నిర్ణయించకుండా టెండర్లు ఎలా పిలిచారని ప్రశ్నించారు. టెండర్లలో ఏయే సంస్థలు పాల్గొన్నాయి? అవకతవకల్లో ఎవరెవరి ప్రమేయముంది? తదితర అన్ని కోణాల్లో దర్యాప్తు జరపాలని చెప్పారు. టెండర్లకు అనుసరించిన విధానాలు, ఫైళ్లు కదిలిన తీరు, జరిగిన అవకతవకలపై పూర్తి వివరాలను సమర్పించాలని హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలిని ఆదేశించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫైళ్లు ఏవైనా మిస్సయినట్లు గుర్తిస్తే.. వెంటనే సంబంధిత అధికారులు, బాధ్యులైన ఉద్యోగులపై వ్యక్తిగతంగా కేసులు నమోదు చేయాలని

మిగతా 2వ పేజీలో ▶

ఎంపీ టికెట్ ఎవరికో?



ఏఐసీసీ పెద్దల చుట్టూ కాంగ్రెస్ నేతల ప్రదక్షిణలు

- ఇటు ఇతర పార్టీల నేతల కోసం టీపీసీసీ ఎదురుచూపులు
- మూడు, నాలుగు చోట్ల వలస నేతలకు అవకాశం
- మూడు సీట్లు బీసీలకు?
- ప్రస్తుతానికి దీపాదాస్ మున్షీ వద్ద ఆగిన బంతి
- త్వరలోనే ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ భేటీ.. ఆ తర్వాత సీఈసీ సమావేశంలో ఖరారు
- రాష్ట్రం నుంచి రాహుల్ పోటీపై పార్టీలో ఆసక్తికర చర్చ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కోసం అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు అటు ఢిల్లీ చుట్టూ.. ఇటు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర టీపీసీసీ పెద్దల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇతర పార్టీల కంటే ముందే ఎంపిక ప్రక్రియ ప్రారంభించిన అధికార కాంగ్రెస్ పార్టీ టికెట్ల ఖరారు రేసులో మాత్రం కొంత వెనుకబడినట్టు కనిపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీలు చాపకింద నీరులా తమ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముందుకెళుతుంటే కాంగ్రెస్‌లో మాత్రం కొంత డైలమా కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారం దక్కిన నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి పెద్ద చేపలు తమ గాలానికి చిక్కుతాయనే ఆలోచనతో పాటు పార్టీలో అంతర్గతంగా నెలకొన్న పోటీ కూడా ఇందుకు కారణమని తెలుస్తోంది. కాగా, టికెట్ల విషయమై త్వరలోనే ఢిల్లీలో జరిగే స్క్రీనింగ్ కమిటీ భేటీ తర్వాత స్పష్టత వస్తుందనీ, ఆ తర్వాత సీఈసీ సమావేశంలో ఖరారయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ కూడా వచ్చే అవకాశం ఉండటంతో సరైన సమయంలోనే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని అంటున్నారు. కాగా, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ప్రస్తుతం రాష్ట్రంలో లోక్‌సభ సీట్లకు టికెట్ల ఎంపిక, అభ్యర్థిత్వాల పరిశీలనపైనే పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరించినట్టు పార్టీ వర్గాల సమాచారం.

కొత్త నేతలకు అవకాశమిస్తారా?

ఇటీవలే పార్టీలో చేరిన కొందరు నేతలకు లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఇస్తారనే చర్చ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ జాబితాలో బొంతు రామ్మోహన్ (సికింద్రాబాద్), కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి (మల్కాజ్‌గిరి), పట్నం సునీతా మహేందర్‌రెడ్డి (చేవెళ్ల), నీలం మధు ముదిరాజ్ (మెదక్), తాటికొండ రాజయ్య (వరంగల్) పేర్లు వినిపిస్తున్నాయి. సికింద్రాబాద్, చేవెళ్ల విషయంలో అభ్యర్థిత్వాలు దాదాపు ఖరారయ్యాయనే చర్చ కూడా

మిగతా 2వ పేజీలో ▶

నేడు కొత్త డీఎస్సీ నోటిఫికేషన్!

- కొత్తగా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో గతంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు పాఠశాల విద్య కమిషనర్ దేవసేన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త నోటిఫికేషన్ గురువారం వెలువడే అవకాశం ఉందని విద్యా శాఖ వర్గాలు వెల్లడించాయి. - 2లో

దమ్ముంటే 17 ఎంపీ సీట్లు గెలిపించుకోవాలి

- వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాల్లో ఎంపీలను గెలిపించుకుని మగతనం నిరూపించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సీఎం మాట్లాడే తీరు సరిగా లేదని ధ్వజమెత్తారు. - 3లో

పక్కా నిఘా.. పటిష్ట బందోబస్తు

- ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ప్రశాంతంగా జరిగింది. తొలి రోజు ద్వితీయ భాష పేపర్–1 పరీక్ష నిర్వహించారు. 4,88,113 మంది హాజరయ్యారు. 19,641 మంది వివిధ కారణాలతో పరీక్ష రాయలేదు. - 14లో



రాష్ట్రానికి రానున్న మోదీ..

- రెండు రోజుల పర్యటనకు షెడ్యూల్ ఖరారు
- మార్చి 4, 5 తేదీల్లో ఆదిలాబాద్, సంగారెడ్డిలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- అక్కడే బహిరంగ సభల్లో ప్రసంగం
- 4న రాత్రి హైదరాబాద్‌లో బస
- తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శంఖారావం

- వివరాలు 2లో

చందాదారుల ఆస్తులు కొల్లగొడుతున్న గజదొంగ రామోజీ

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ బందిపోటు సంస్థ
- పేదలు, మధ్యతరగతి వర్గాలను వేధిస్తోంది
- కాల్‌మనీ రాకెట్‌లా ఇళ్లపై దాడులు చేస్తోంది
- చిట్టీల ఉచ్చులో బిగించి ఆస్తులు గుంజుకుంటోంది
- రామోజీ అక్రమాలకు వ్యతిరేకంగా సమష్టి పోరు
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం స్పష్టీకరణ
- విజయవాడలో బాధితుల సమావేశం.. పెద్ద ఎత్తున తరలివచ్చిన చందాదారులు

- వివరాలు 14లో

రెండు ప్రమాదాల్లో 8 మంది మృతి

- సూర్యాపేట జిల్లాలో ఆటోను ఢీకొట్టిన బస్సు.. ఐదుగురు మృతి
- సిద్దిపేట జిల్లాలో కారు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురి దుర్మరణం - 5లో

బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు తేడా లేదు

- రెండు పార్టీలూ అవినీతి, కుటుంబ పాలన పార్టీలే
- వారు దోచుకున్నారు.. వీరూ దానికే సిద్ధం
- పాకిస్తాన్‌ను ఏకాకిని చేసింది మోదీనే..
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- వివరాలు 3లో

క్లుప్తంగా...

ఎమ్మెల్సీ కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు రెండు వారాలు వాయిదా వేసింది. ఈడీ సమన్లు రద్దు చేయాలంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్ బుధవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. ఇతర కేసుల విచారణతో కోర్టు సమయం ముగియడంతో కవిత తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్.. పిటిషన్ గురించి ధర్మాసనం ముందు ప్రస్తావించారు. దీంతో, రెండు వారాల తర్వాత విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

మే 1 నుంచి నిరవధిక సమ్మె

ఎన్‌ఎఫ్ఐఆర్ జాతీయ కార్యదర్శి రాఘవయ్య

సాక్షి, న్యూఢిల్లీ: నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలనే డిమాండ్‌తో మే 1 నుంచి నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్ (ఎన్‌ఎఫ్ఐఆర్) జాతీయ కార్యదర్శి మర్రి రాఘవయ్య తెలిపారు. ఈ మేరకు మార్చి 19న అన్ని జోన్లలోని జనరల్ మేనేజర్‌లకు సమ్మె నోటీసులు అందిస్తామని పేర్కొన్నారు.

రిజర్వేషన్ల తొలగింపునకు కేంద్రం కుట్ర

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య



సాక్షి, హైదరాబాద్: దళిత, గిరిజన రిజర్వేషన్ల తొలగింపునకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. జాతీయ ఎస్సీ కమిషన్ ఉన్నప్పటికీ ఎస్సీ వర్గీకరణ అంటూ కేబినెట్ కార్యదర్శుల కమిటీ ఏర్పాటుతోనే బీజేపీ ఆలోచన బహిర్గతమైందన్నారు. ఇందుకు తగిన గుణపాఠాన్ని బీజేపీకి చెప్పాలని, తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కకుండా చేయాలని దళిత, గిరిజనులకు ఆయన పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని సికింద్రాబాద్‌లో ఓడిస్తామని, అవసరమైతే కాంగ్రెస్‌కు మద్దతిస్తామన్నారు.


రాష్ట్ర సహకార బ్యాంక్‌లో మిజోరం బృందం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్‌ను మిజోరం రాష్ట్ర సహకార బ్యాంక్ ఉన్నతాధికారుల బృందం బుధవారం హైదరాబాద్‌లో సందర్శించింది. ఈ సందర్భంగా సహకార వ్యవస్థలో సాధించిన పురోగతిపై చర్చించారు. వ్యాపారాభివృద్ధి, బ్యాంక్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్, డీల్ రూమ్, సీసీటీవీ సర్వైవ్‌లెన్స్ రూమ్‌ను సందర్శించారు. సమావేశంలో మిజోరం రాష్ట్ర సహకార అధికార ప్రతినిధుల బృందం, టెస్కాబ్ ఎండీ మురళీధర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బయో ఆసియా సదస్సులో ఒప్పందాలు

సాక్షి, హైదరాబాద్: బయో ఆసియా సదస్సు 2024లో భాగంగా చివరి రోజు తెలంగాణ సెంటర్ ఫర్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ (సీ4ఐఆర్) నాలుగు కీలక ఎంఓయూలను కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ఆరోగ్యం, సాంకేతికత, నైపుణ్య శిక్షణలో రాష్ట్రాన్ని సహజ గమ్యస్థానంగా తీర్చిదిద్దడంపై సీ4ఐఆర్ కృషి చేస్తుంది. మెరుగైన రోగ నిర్ధారణ, చికిత్సలో ఏఐ సాంకేతికత సమ్మిళితంగా సాగుతున్న ప్రయత్నాల్లో సీ4ఐఆర్ భాగస్వామ్యం వహిస్తుంది. పరిశోధనల్లో భాగంగా క్లినికల్, సెన్సర్ డేటాను ఉపయోగించి సీ4ఐఆర్ అధ్యయనాలు చేస్తుంది. సీ4ఐఆర్‌కు అవసరమైన వేదిక ఏర్పాటుకు ఏఐ సాంకేతిక సాయంతో ఆధునిక ఆరోగ్య పరిష్కారాలను అందజేస్తుంది.

ఇదండీ సంగతి



రాష్ట్రానికి ప్రధాని మోదీ

తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి శంఖారావం

- రెండు రోజుల పర్యటనకు షెడ్యూల్ ఖరారు
- మార్చి 4, 5 తేదీల్లో ఆదిలాబాద్, సంగారెడ్డిలలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 4న రాత్రి హైదరాబాద్‌లో బస



సాక్షి, హైదరాబాద్/సాక్షి, ఆదిలాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన ఖరారైంది. మార్చి 4, 5 తేదీల్లో ఆయన రాష్ట్రంలో పర్యటించనున్నారు. మార్చి రెండో వారంలోగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావొచ్చనే అంచనాల మధ్య ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసే వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఆదిలాబాద్, సంగారెడ్డిలలో నిర్వహించే బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి మోదీ శంఖం పూరించనున్నారు. తమ ప్రభుత్వ అభివృద్ధి నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై మోదీ రాజకీయ విమర్శలు సంధిస్తారని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా అక్టోబర్ 1, 3 తేదీల్లో మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభంతోపాటు సభల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. మళ్లీ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర పర్యటనకు వస్తున్న మోదీ 4వ తేదీన రాత్రి రాజ్‌భవన్‌లో బసచేస్తారు.

ఇదీ మోదీ పర్యటన షెడ్యూల్...

- 4న ఉదయం మహారాష్ట్ర నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టులో ఎంఐ–17 హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10.20కు ఆదిలాబాద్‌కు చేరు కుంటారు.
- 10.30 నుంచి 11 గంటలదాకా ఆదిలాబాద్‌లో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు
- 11.15 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా బహిరంగసభలో పాల్గొంటారు
- 12.15కు ఆదిలాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.10 గంటలకు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి మధ్యాహ్నం 2.45 గంటలకు చెన్నైకి చేరుకుంటారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి రాత్రి 7.45 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 8 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకుని అక్కడే బసచేస్తారు.
- మార్చి 5న ఉదయం 10.15 గంటలకు హెలికాప్టర్‌లో బేగంపేట నుంచి బయలుదేరి 10.40 గంటలకు సంగారెడ్డికి చేరుకుంటారు
- 10.45 నుంచి 11.15 గంటల దాకా వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, పనులకు శంకుస్థాపనలు/ప్రారంభోత్సవాలు చేస్తారు.
- 11.25 గంటలకు సంగారెడ్డికి చేరుకుంటారు. 12.15 వరకు సభలో ప్రసంగిస్తారు.
- 12.30కు హెలికాప్టర్‌లో సంగారెడ్డి నుంచి బయలుదేరి 12.55కు బేగంపేటకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం ఒంటిగంటకు బేగంపేట నుంచి విమానంలో భువనేశ్వర్‌కు బయల్దేరుతారు. దీంతో మోదీ రాష్ట్ర పర్యటన పూర్తవుతుంది.

నేడు కొత్త డీఎస్సీ నోటిఫికేషన్!

- పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసిన పాఠశాల విద్యాశాఖ
- 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: గతంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు పాఠశాల విద్య కమిషనర్ దేవసేన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త నోటిఫికేషన్ గురువారం వెలువడే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది సెప్టెంబర్ 6వ తేదీన 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడింది. ఈ పోస్టులకు దాదాపు 1.75 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే పరీక్షను నిర్వహించాలనుకున్న తేదీల్లోనే అసెంబ్లీ ఎన్నికల తేదీలు రావడంతో డీఎస్సీ పరీక్షను వాయిదా వేశారు. కాగా కొత్త ప్రభుత్వం 11,062 పోస్టుల భర్తీ చేపట్టాలని నిర్ణయించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. గత డీఎస్సీ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని బుధవారం నాటి ప్రకటనలో స్పష్టం చేసింది.

ఐఐటీ హైదరాబాద్‌కు 'గోదావరి' బాధ్యత

- బేసిన్ నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయనున్న సంస్థ
- పలు ప్రాజెక్టులకు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలతో కేంద్ర జలశక్తి శాఖ ఒప్పందం

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి, కృష్ణా నది సహా ఆరు నదుల బేసిన్ నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేసే పనిని కేంద్ర జలశక్తి శాఖ పలు విద్యా సంస్థలకు అప్పగించింది. గోదావరి బేసిన్ నిర్వహణ ప్రణాళిక బాధ్యతను ఐఐటీ హైదరాబాద్, ఎన్‌ఈఈఆర్ఐ నాగ్‌పూర్‌కు అప్పగించింది. కృష్ణా నదీ బేసిన్ నిర్వహణ ప్రణాళిక బాధ్యతను ఎన్ఐటీ వరంగల్, ఎన్ఐటీ సూరత్‌కల్‌కు అప్పగించింది. ఇలా దేశంలోని 6 ప్రధాన నదులు నర్మదా, గోదావరి, కృష్ణా, కావేరి, పెరియార్, మహానది బేసిన్ నిర్వహణ ప్రణాళికను రూపొందించే బాధ్యతను 12 సాంకేతిక సంస్థలు తీసుకోనున్నాయి. ఈ మేరకు బుధవారం 12 విద్యా సంస్థలు, నేషనల్ రివర్ కన్జర్వేషన్ డైరెక్టరేట్, జలశక్తి మంత్రిత్వ శాఖ మధ్య ఒప్పందం కుదిరింది. ఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, శాఖ సహాయ మంత్రులు రాజీవ్ చంద్రశేఖర్, బిశ్వేశ్వర్ తుడులతో పాటు 12 విద్యాసంస్థల డైరెక్టర్లు హాజరయ్యారు. ఇప్పటికే దేశంలోని అతిపెద్ద నది అయిన గంగా బేసిన్ నిర్వహణ ప్రణాళికను ఐఐటీ కాన్పూర్ నేతృత్వంలోని ఏడు ఐఐటీల కన్సార్టియం విజయవంతంగా పూర్తి చేసిందని జలశక్తి శాఖ ప్రకటించింది.

మెగా హెచ్ఎండీఏ!

▶ మొదటి పేజీ తరువాయి



ఆదేశించారు. హెచ్ఎండీఏ నుంచి పూర్తి నివేదిక అందిన తర్వాత కేబినెట్లో చర్చించి, టెండర్ల వ్యవహారంపై సీబీఐ లేదా అదే స్థాయి దర్యాప్తు సంస్థతో విచారణ జరిపిస్తామని సీఎం స్పష్టం చేశారు.

టెండర్ విధానంతో రూ.15 వేల కోట్లకు పైగా నష్టం!

టెండర్లకు ముందు ఓఆర్ఆర్‌పై టోల్ కింద ఏడాదికి రూ.600 కోట్ల ఆదాయం వచ్చేదని అధికారులు సీఎంకు వివరించారు. అలాంటప్పుడు 30 ఏళ్లకు రూ.18 వేల కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని కానీ కేవలం రూ.7,380 కోట్లకు ఐఆర్‌బీ కంపెనీకి ఎలా అప్పగించారని రేవంత్ ప్రశ్నించారు. హెచ్ఎండీఏ అనుసరించిన టెండర్ విధానంతో ప్రభుత్వం రూ.15 వేల కోట్లకు పైగా నష్టపోయిందని సమావేశంలో ప్రాథమికంగా అంచనా వేశారు. హెచ్ఎండీఏ రెండు కంపెనీలతో డీపీఆర్ తయారు చేయించగా, ప్రభుత్వ ఆదాయానికి నష్టం తెచ్చే డీపీఆర్‌ను ఎంచుకున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయిస్తేనే నిజాలు బయటకు వస్తాయని సీఎం పేర్కొన్నారు. టెండర్ దక్కించుకున్న కంపెనీ ప్రభుత్వంతో చేసుకున్న కాంట్రాక్టు అగ్రిమెంట్‌ను చూపించి 49% వాటాను విదేశీ కంపెనీలకు అప్పగించిందని, విదేశీ కంపెనీలతో ఆ సంస్థ చేసుకున్న లావాదేవీలపై కూడా దర్యాప్తు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

చెరువులు, కుంటల్ని పరిరక్షించాలి

హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటలను పరిరక్షించాలని, అలాగే ల్యాండ్ పూలింగ్‌ను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. హెచ్ఎండీఏ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, డిజిటల్, జీపీఎస్ విధానాలతో ఎక్కడ ఎంత స్థలముందో మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ల్యాండ్ పార్శిల్స్, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురి కాకుండా ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. డీఐజీ స్థాయిలో ఒక ఐపీఎస్ అధికారిని నియమించాలని, ఇద్దరు ఎస్పీ ర్యాంకు అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. కాగా హెచ్ఎండీఏ పరిధిలో దాదాపు 8,374 ఎకరాల ల్యాండ్ పార్శిళ్లు ఉంటే.. అందులో 2,031 ఎకరాల పార్శిళ్లు వివిధ స్థాయిల్లో కోర్టు కేసుల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు.

'కమ్యూనిటీ' స్థలాలపై తక్షణ సర్వే

హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్ తదితర పట్టణాల లే అవుట్లలో కమ్యూనిటీ అవసరాలకు ఇచ్చిన స్థలాలు తమ అధీనంలోనే ఉన్నాయా? లేక ఆక్రమణకు గురయ్యాయా? వెంటనే సర్వే చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాఠశాలల ఏర్పాటుకు ముందుకొచ్చే కార్పొరేట్ కంపెనీలు, పేరొందిన పాఠశాలల యాజమాన్యాలకు వీటిని అప్పగించాలని సూచించారు. స్థానికులైన పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు ఉచితంగా కనీసం 25 శాతం అడ్మిషన్లు ఇవ్వాలని చెప్పారు.

ప్రపంచ స్థాయి టూరిస్ట్ ప్లేస్‌గా హుస్సేన్‌సాగర్ పరిసరాలు

హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరమైన, అందమైన జోన్‌గా తీర్చిదిద్దాలని సీఎం అధికారులకు ఆదేశించారు. అంబేడ్కర్ విగ్రహం, ఎన్టీఆర్ పార్కు, తెలంగాణ అమరుల జ్యోతి నుంచి అటు నెక్లెస్ రోడ్డు, ఇందిరా పార్కు, సంజీవయ్య పార్కు వరకు ఉన్న మొత్తం ప్రాంతాన్ని ప్రపంచస్థాయి సందర్శనీయ ప్రాంగణంగా తయారు చేయాలని సూచించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలిగించాలన్నారు. దుబాయ్ తరహాలో స్కై వాక్ వే, ఫుడ్ స్టాళ్లు, చిల్డ్రన్ అమ్యూజ్మెంట్ జోన్, గ్రీనరీ, ల్యాండ్ స్కేప్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. అవసరమైతే ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలను మరో రూట్‌కు మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి కన్సల్టెన్సీలతో ఈ ప్రాజెక్టు నమూనాలు తయారు చేయాలని ఆదేశించారు. సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి సమీక్షలో పాల్గొన్నారు.

క్రిష్ విచారణ ఎప్పుడు?

ముంబైలో ఉన్నారంటున్న పోలీసులు.. రేపు విచారణకు రావొచ్చని అంచనా



గచ్చిబౌలి: రాడిసన్ బ్లూ హోటల్ డ్రగ్ కేసులో అనుమానితునిగా ఉన్న తెలుగు సినీ డైరెక్టర్ జాగర్లమూడి క్రిష్ విచారణ ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. క్రిష్ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉందని, ముంబైలో ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. అయినప్పటికీ క్రిష్ శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. అనుమానితునిగా ఉన్న క్రిష్ పోలీసుల ఎదుట హాజరయ్యేందుకు జాప్యానికి గల కారణాలను అధికారులు వెల్లడించడం లేదు. ఈ కేసులో ఇప్పటివరకు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న రఘు చరణ్, సందీప్, లిషీ, శ్వేత, నీల్ కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. రాడిసన్ హోటల్‌లో గత శనివారం డ్రగ్ పార్టీ నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు గజ్జల వివేకానంద పార్టీ ముగిసే వరకు హోటల్ గదిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. రఘు చరణ్, నీల్‌తో కలిసి వచ్చిన డైరెక్టర్ క్రిష్ నేరుగా వివేకానంద ఉన్న గదిలోకి వెళ్లి 30 నిమిషాల పాటు గడిపినట్లు పోలీసులు గుర్తించారు. కేదార్, లిషీ, నిర్భయ్ కలిసి రాడిసన్ హోటల్‌కు వెళ్లారు. సందీప్, శ్వేత రాడిసన్‌కు వచ్చారు. రాత్రి 8.30 గంటలకు పార్టీ ముగించుకొని వెళ్లగా పోలీసులు రాత్రి 12.30 గంటలకు హోటల్‌కు చేరుకున్నారు. అప్పటికే డ్రగ్ పార్టీ ముగించుకొని అక్కడి నుంచి అందరూ ఉడాయించారు.

సీసీ కెమెరాలపై అనుమానాలెన్నో

స్టార్ హోటల్‌గా గుర్తింపు ఉన్న రాడిసన్ హోటల్‌లో సీసీ కెమెరాల నిర్వహణ అధ్వానంగా ఉండటం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. హోటల్‌లో మొత్తం 209 కెమెరాలు ఉండగా కేవలం 16 సీసీ కెమెరాలు మాత్రమే పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. డ్రగ్ పార్టీ జరిగిన రూమ్ వైపు ఉన్న కెమెరాలు పని చేయకపోవడం గమనార్హం. కావాలనే సీసీ కెమెరాలు పని చేయకుండా చేశారా అనే అనుమానాలు నెలకొన్నాయి.

సాంకేతికతతో చౌక వైద్య సేవలు

గ్రామీణులకు వైద్య పరీక్షలను మరింత చేరువలోకి తేవాలి

- బయో ఆసియా ముగింపు సదస్సులో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



సాక్షి, హైదరాబాద్: సాంకేతిక పరిజ్ఞానంతో పేదలకు తక్కువ ధరకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. గ్రామీణ పేదలకు వైద్య పరీక్షలను మరింత చేరువలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బుధవారం బయో ఆసియా–2024 ముగింపు సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. తాను గవర్నర్‌గా మాత్రమే కాకుండా డాక్టర్‌గా కూడా ఉన్నానన్నారు. ఏ అభివృద్ధి జరిగినా అది పేదలకు ఉపయోగపడాలని చెప్పారు. గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్య అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవడమని అన్నారు. తాను డాక్టర్‌గా పనిచేసిన సమయంలో అల్ట్రాసౌండ్ అందుబాటులో లేకపోవడం వల్ల అనేకమంది ఇబ్బంది పడిన సందర్భాలను చూసినట్లు చెప్పారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు ఎక్కువ ధర ఉండటమే అందుకు కారణమన్నారు. అల్ట్రాసౌండ్‌లో స్టార్టప్ ద్వారా కొత్త రోబోటిక్ అందుబాటులోకి వచ్చినందుకు ఆమె సంతోషం వ్యక్తంచేశారు. సరసమైన ధరలో అల్ట్రాసౌండ్, వ్యాక్సిన్ల వంటి ఆవిష్కరణలను ప్రోత్సహించినందుకు బయో ఆసియాను అభినందించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రారంభమైన తర్వాత రొమ్ము కేన్సర్ మునుపటి కంటే 20 రెట్లు ఎక్కువగా నిర్ధారణ అవుతోందన్నారు. చికిత్సకంటే రోగ నిర్ధారణ చాలా ముఖ్యమైందన్నారు. కానీ చికిత్స విషయానికి వస్తే ఖర్చుతో కూడుకోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని గవర్నర్ పేర్కొన్నారు.

ఐదు స్టార్టప్‌లకు అవార్డులు

ఐదు స్టార్టప్ కంపెనీలకు బయో ఆసియా అవార్డులు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయా కంపెనీల ప్రతినిధులకు గవర్నర్ తమిళిసై అవార్డులు ప్రదానం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి (యూఆర్ అడ్వ థెరప్యూటిక్), విశాల్ గుప్తా (డిజైన్), వైభవ్ భాటియా (లామార్క్), డాక్టర్ కృష్ణ ప్రసాద్ (ప్లెబిక్ ఇన్నోవేషన్స్), రావు కోటుపోలు (జెడ్‌బ్లాక్స్ లాజిటిక్)లు ఈ పురస్కారాలు అందుకున్నారు.

ఎంపీ టికెట్ ఎవరికో?

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతోంది. మల్కాజ్‌గిరి సీటు కోసం దేవేందర్‌గౌడ్ తనయుడు వీరేందర్‌గౌడ్ పేరు కూడా వినిపిస్తోంది. ఆయన త్వరలోనే పార్టీలోకి వస్తున్నారని, ఆయనతో పాటు సినీ నిర్మాత బండ్లగణేశ్, కొందరు ఇతర నాయకుల పేర్లను పరిశీలిస్తారని అంటున్నారు. ఇక, మెదక్ విషయంలో మైనంపల్లి హనుమంతరావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనతో పాటు వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిష కూడా రేసులో ఉండడం గమనార్హం. వరంగల్ విషయానికి వస్తే అక్కడ పోటీ తీవ్రంగా ఉంది. ఇక్కడి నుంచి తాటికొండ రాజయ్యతో పాటు జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, దొమ్మాటి సాంబయ్య, సింగాపురం ఇందిర, అద్దంకి దయాకర్, డాక్టర్. ఆర్. పరమేశ్వర్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే నాగర్‌కర్నూల్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాలను ఏ సామాజిక వర్గానికి ఇస్తారన్న దాన్ని బట్టి వరంగల్‌లో అభ్యర్థి ఖరారయ్యే అవకాశాలున్నాయి. నాగర్‌కర్నూల్ నుంచి టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి పేరు దాదాపు ఖరారైందని తెలుస్తోంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, డాక్టర్ చారగొండ వెంకటేశ్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ, సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేతకాని, పెర్క శ్యాం కుమార్‌లో ఒకరికి అవకాశం దక్కే చాన్సుంది.

రాహుల్ వచ్చేనా?


ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పోటీ చేస్తారనే అంశంపై గాంధీభవన్ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కేరళలోని వాయనాడ్ స్థానంలో ఇండియా కూటమి నుంచి సీపీఐ పోటీ చేస్తుందన్న వార్తల నేపథ్యంలో రాహుల్‌గాంధీ కర్ణాటక లేదా తెలంగాణ నుంచి బరిలో ఉంటారని తెలుస్తోంది. గతంలో కూడా సోనియా, ప్రియాంకాగాంధీ తెలంగాణలో పోటీ చేస్తారని, సోనియాగాంధీని తెలంగాణ నుంచే రాజ్యసభకు ఎంపిక చేస్తారనే వార్తలు వినిపించాయి. ఇప్పుడు తాజాగా రాహుల్ పేరు తెరపైకి రావడం గమనార్హం. ఒకవేళ ఆయన తెలంగాణ నుంచి పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంటే ఖమ్మం లేదా నల్లగొండ లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

ఐదు రిజర్వుడు, మూడు బీసీ, ఒకటి మైనార్టీకి

రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో మూడు ఎస్సీలకు, రెండు ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఇవి పోను మిగిలిన 12 స్థానాల్లో మూడు స్థానాలను బీసీలకు ఇస్తారని, ఒక్క స్థానాన్ని మైనార్టీలకు కేటాయిస్తారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మిగిలిన 8 చోట్ల జనరల్ అభ్యర్థులు పోటీ చేయనున్నట్టు సమాచారం. బీసీలకిచ్చే స్థానాల్లో మెదక్, జహీరాబాద్, సికింద్రాబాద్ ఉంటాయని తెలుస్తోంది. హైదరాబాద్ లోక్‌సభకు మైనార్టీ నేతను పోటీ చేయిస్తారని, హైదరాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు సమీర్‌వలీఉల్లాకు సీటు దక్కే అవకాశం ఉందని సమాచారం. ఈయనతో పాటు ఫిరోజ్‌ఖాన్, అలీ మస్కతి లాంటి సీనియర్ల పేర్లు కూడా మొదటి నుంచీ ప్రచారంలో ఉన్నాయి. మిగిలిన స్థానాల విషయానికి వస్తే వంశీచందర్‌రెడ్డి (మహబూబ్‌నగర్), పటేల్ రమేశ్‌రెడ్డి, జానారెడ్డి (నల్లగొండ), చామల కిరణ్‌రెడ్డి, కుంభం కీర్తిరెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మి, కోమటిరెడ్డి పవన్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాపరెడ్డి, పున్నా కైలాశ్‌నేత, చనగోని దయాకర్ (భువనగిరి), సురేశ్‌షెట్కార్ (జహీరాబాద్), వీహెచ్, జెట్టి కుసుమకుమార్, పొంగులేటి ప్రసాదరెడ్డి, మల్లునందిని, వి.వి.రాజేంద్రప్రసాద్ (ఖమ్మం), పెద్దిరెడ్డి, అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రుద్ర సంతోశ్ (కరీంనగర్), టి.జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి, ఈరవత్రి అనిల్ (నిజామాబాద్), బలరాం నాయక్, బెల్లయ్య నాయక్, డాక్టర్. శంకర్‌నాయక్, విజయాబాయి (మహబూబాబాద్), నరేశ్ జాదవ్, రేఖానాయక్ (ఆదిలాబాద్) పేర్లు వినిపిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాలకూ ఆరోగ్య రక్షణ

జీవశాస్త్ర పరిశోధన, తయారీ రంగాల్లో నైపుణ్య శిక్షణ: మంత్రి శ్రీధర్‌బాబు



బయో ఆసియా సదస్సులో డబ్ల్యూఈఎఫ్ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తున్నా గ్రామీణ ప్రాంతాల ప్రజలు నాణ్యమైన ఆరోగ్య రక్షణకు చేరువ కావడం అతిపెద్ద సవాలుగా మారింది. చాలామంది తమకు అవసరమైన వైద్య సేవలను అందుకోలేకపోతున్నారు. భౌగోళికతతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరికి ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు అందరిపైనా సమష్టి బాధ్యత ఉంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని జీవితాలను ప్రభావితం చేసేలా ఆరోగ్య రక్షణ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో వైద్య సేవల రంగాన్ని విస్తరించాల్సి ఉంది'అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్), తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటైన నాలుగో పారిశ్రామిక విప్లవ కేంద్రం (సీ4ఐఆర్)ను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఆరోగ్యరక్షణ, ఆరోగ్య సాంకేతికతలో సమాజ శ్రేయస్సు లక్ష్యంగా 'సీ4ఐఆర్'ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

మౌలిక వసతులకే పరిమితం కాబోము

'భారతీయ ఫార్మారంగ ఉత్పత్తిలో 40 శాతం తెలంగాణలోనే జరుగుతోంది. ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తుల్లో ఏటా 14 బిలియన్ల డోసులు అనగా.. మూడొంతులు ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నాయి. రాష్ట్రంలో కేవలం మౌలిక వసతుల కల్పనకే పరిమితం కాకుండా ఉపాధి అవకాశాల సృష్టి, నైపుణ్య శిక్షణ, అంతర్జాతీయ నైపుణ్యాన్ని ఆకర్షించడం ద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తాం. సీ4ఐఆర్‌తో భాగస్వామ్యం ద్వారా జీవనోపాధి పెంపుదలకు అవసరమైన నైపుణ్య శిక్షణ, హెల్త్ ప్రొఫైల్ తయారీ, వినూత్న క్లినికల్ అధ్యయనాల ద్వారా శరవేగంగా మార్కెట్‌లోకి చికిత్స విధానాలు తెచ్చే దిశగా పనిచేస్తాం. తద్వారా భారత్‌లో నాణ్యమైన ఆరోగ్య రక్షణను కొత్త శిఖరాలకు చేర్చడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య రక్షణ, సామాజిక పరివర్తన సాధిస్తాం. దీనికోసం పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కోర్సులు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తాం. మానవ వనరుల కోసం వచ్చే ఐదారేళ్లలో 50వేలకు పైగా స్థానిక పట్టభద్రులకు నైపుణ్య శిక్షణ ఇస్తాం. శిక్షణలో భాగంగా వారం రోజుల్లో ప్రయోగాత్మకంగా మెడిసినల్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీలో రెండు ప్రత్యేక కోర్సులు ప్రారంభిస్తాం. పరిశోధన, అభివృద్ధి, తయారీ రంగాలను మినహాయిస్తే ఆరోగ్య సాంకేతిక రంగంలో సీ4ఐఆర్, తెలంగాణ భాగస్వామ్యం.. 10వేలకు పైగా కొత్త ఉద్యోగాల కల్పనకు దోహదం చేస్తుంది. మరో 20 నుంచి 25 ఔత్సాహిక కంపెనీలు, స్టార్టప్‌లకు ఊతమివ్వడంతోపాటు 10 నుంచి 25 వినూత్న ఆలోచనలకు పురుడు పోస్తుంది'అని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బయో ఆసియా సదస్సు 2024 వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జెర్గెన్స్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్

- ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచస్థాయి కంపెనీల ఆసక్తి
- బయో ఆసియా సదస్సులో ఎలి లిల్లీ సీఈవో డేవిడ్ రిక్స్

సాక్షి, హైదరాబాద్: 'లైఫ్‌సైన్సెస్ రంగంలో ఏళ్ల తరబడి సాగుతున్న కృషి ఫలితంగానే కేవలం భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయంగా హైదరాబాద్ 'లైఫ్‌సైన్సెస్ హబ్'గా గుర్తింపు పొందింది. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ప్రగతిశీల విధానాల ద్వారా ప్రపంచంలోనే తయారీ, లైఫ్‌సైన్సెస్ రంగంలో ఉద్యోగాలకు చిరునామాగా నిలిచింది. ప్రపంచ లైఫ్‌సైన్సెస్ రంగంలో తన స్థానాన్ని పదిలపరుచుకునేందుకు 2047 ప్రణాళికతో భారత్ అనేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లోని బలమైన పారిశ్రామిక వాతావరణం, స్థిరమైన ప్రభుత్వం, అనుకూల విధానాలతో ప్రపంచ స్థాయి కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి'అని ఎలి లిల్లీ సీఈవో డేవిడ్ రిక్స్ పేర్కొన్నారు. నగరంలో జరుగుతున్న బయో ఆసియా సదస్సు 2024 చివరి రోజు సమావేశాల్లో భాగంగా రిక్స్ కీలకోపన్యాసం చేశారు.

''దేశీయ ఆవిష్కరణలను ప్రపంచీకరణ చేయడంలో భారతీయ కంపెనీలు ముందుకు రాకపోవడం అతిపెద్ద లోపం. భారత్‌లో ప్రస్తుతం డయాబెటిస్ అతిపెద్ద సమస్య కాగా ఈ విషయంలో త్వరలో చైనాను కూడా అధిగమించబోతోంది. మరోవైపు భారత్‌లో ఆరోగ్య బీమా అనేది ప్రాథమిక స్థాయిలోనే ఉంది. అయితే భారత్‌లో నైపుణ్యానికి కొదవలేదు'అని డేవిడ్ రిక్స్ పేర్కొన్నారు.

కొత్త చికిత్స విధానాలు: జెఫ్ మార్తా

'సాంకేతిక పురోగతి సాధించిన కొద్దీ నూతన చికిత్సా విధానాలకు ద్వారాలు తెరుచుకుంటున్నాయి. దీంతో ఆరోగ్య రక్షణ రంగంలో 'మెడ్‌టెక్'(వైద్య సాంకేతికత)కు ప్రాధాన్యత పెరిగింది. దీంతో చికిత్సలో మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), డీప్ లెర్నింగ్ (డీఎల్) సాంకేతిక ఆధారిత ఉపకరణాల వినియోగం పెరగడంతో పాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ప్రాధాన్యత కూడా పెరుగుతోంది'అని మెడ్‌ట్రానిక్స్ చైర్మన్, సీఈఓ జెఫ్ మార్తా పేర్కొన్నారు. 'డేటా, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, 5జీ, 10జీ రోబోటిక్స్ వంటివి వైద్య ఉపకరణాల తయారీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. సర్జికల్ రోబోటిక్స్ విధానంలో అమెరికాలో 20 శాతం, ప్రపంచ వ్యాప్తంగా 5శాతం సర్జరీలు జరుగుతుండగా, భారత్‌లో మాత్రం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. రోబోటిక్ సర్జరీల కోసం వైద్యులకు అత్యున్నత శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడుతోంది''అని జెఫ్ మార్తా వ్యాఖ్యానించారు.


ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, సీపీఆర్‌వో అయోధ్యరెడ్డి బోరెడ్డి

క్లుప్తంగా...

1న జీతాలేవీ?: హరీశ్



సాక్షి, హైదరాబాద్: ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఆచరణలో మాత్రం మాట తప్పిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గతేడాది డిసెంబర్ నెలకు సంబంధించి 10,632 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి 12,660 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు నేటికీ వేతనాలు అందలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు 3 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని 'ఎక్స్'లో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజనం వంట చార్జీలు, కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని హరీశ్ రావు కోరారు.

బూతు పురాణం.. అబద్ధాలే రేవంత్ శైలి

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: బూతు పురాణం, అబద్ధాలు చెప్పడమే సీఎం రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని, తెలంగాణ అభివృద్ధిపై ఆయన విషం కక్కుతున్నారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో చర్చ.. సచివాలయంలో సమీక్షలు.. మేడారం జాతరలో దర్శనాలు.. సందర్భమేదైనా సీఎం భాష ఒకే విధంగా ఉంటోందని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని రేవంత్ విధ్వంసం వైపు నడిపిస్తున్నారని విమర్శించారు. పార్టీ నేతలు వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, గాంధీ నాయక్‌తో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ పడగొట్టాల్సిన అవసరం లేదని, ఆయన సొంత పార్టీలోనే వంది గుంపులు ఉన్నాయని ఎద్దేవా చేశారు. రైతుబంధు డబ్బులు మంత్రుల ఖాతాల్లోకి వెళ్తున్నాయని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు వెళ్తే ప్రతిపక్ష హోదా కూడా ఆ పార్టీకి దక్కదని ఎద్దేవా చేశారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే బీఆర్‌ఎస్ డ్రామా


టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాటు పాలించిన వారిపై వస్తున్న ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే మేడిగడ్డకు వెళ్తామంటూ బీఆర్‌ఎస్ కొత్త డ్రామా ప్రారంభించిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పక్షాన అన్ని పార్టీల ఎమ్మెల్యేలను తీసుకుని వెళ్లినప్పుడు.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మేడిగడ్డకు ఎందుకు వెళ్లలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం అద్భుత ప్రాజెక్టు అని చెప్పిన హరీశ్‌రావు.. ప్రభుత్వం తీసుకెళ్లినప్పుడు ఎందుకు వెళ్లి ఆ అద్భుతాన్ని ప్రజలకు వివరించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఉచిత సలహాలివ్వడం హరీశ్‌రావుకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. పార్టీలో ఆధిపత్యం కోసం హరీశ్, కేటీఆర్‌లు పోటీ పడి మాట్లాడుతున్నారని నిరంజన్ విమర్శించారు.

మహిళలను కించపరిచేలా రేవంత్‌రెడ్డి భాష

సత్యవతి రాథోడ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడుతున్న భాష మహిళలను కించపరిచేదిగా ఉందని, కేసీఆర్ కుటుంబాన్ని తిట్టడమే ఆయన ఎజెండాగా పెట్టుకున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటూనే మహిళలను అగౌరవ పరుస్తున్నారని, విపక్షాలపై విమర్శలు మానుకుని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. పార్టీ నాయకులు వాసుదేవరెడ్డి, రూప్‌సింగ్‌తో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడారు. పురుషుల పేరిట ఉన్న గ్యాస్ కనెక్షన్లకు కూడా రూ.500 సబ్సిడీ వర్తింప చేయాలని అన్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం అందరినీ జైలుకు పంపాలని అనుకుంటున్నారని సత్యవతి రాథోడ్ ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలాడటమే పనిగా పెట్టుకున్నారని వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒక్కసీటు గెలిచినా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన రేవంత్, తన మాటకు కట్టుబడి ఉండాలని ఆయన సవాల్ చేశారు.

పాలనలో తేడా ఏమీ లేదు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ అవినీతి, కుటుంబ పాలన పార్టీలే
- వారు దోచుకున్నారు.. వీరూ దానికే సిద్ధం
- పాకిస్తాన్‌ను ఏకాకిని చేసింది మోదీనే..
- కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించలేదు, కేసీఆర్‌ను ఓడించారు
- విజయ సంకల్ప యాత్ర సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


జహీరాబాద్ ప్రజా సంకల్ప యాత్ర సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

జహీరాబాద్: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ పాలనకు, పదేళ్లు అధికారం వెలగబెట్టిన బీఆర్‌ఎస్‌కు తేడా ఏమీ లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ రెండు పార్టీలూ అవినీతి, కుటుంబ పాలన పార్టీలేనని విమర్శించారు. ''వారు దోచుకున్నారు.. వీరూ దానికే సిద్ధం''అని వ్యాఖ్యానించారు. బుధవారం రాత్రి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో బీజేపీ నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేతలు పదేళ్ల పాటు అడ్డు అదుపు లేకుండా హైదరాబాద్ చుట్టు పక్కల వందల ఎకరాలను ఆక్రమించేశారనీ, రూ.వేల కోట్లు దోపిడీ చేశారనీ, ఎక్కడ చూసినా మాఫియా రాజ్యమేలిందని ఆరోపించారు. కాళేశ్వరాన్ని గోదావరిలో ముంచారని విమర్శించారు. ఇసుక, లిక్కర్, కాంట్రాక్టర్ మాఫియాను పెంచి పోషించిన కేసీఆర్ కుటుంబం రాష్ట్రానికి అన్ని విధాలుగా అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవలేదని, ప్రజలు కేసీఆర్‌ను ఓడించారు కాబట్టే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ గెలిచిన 95 రోజుల్లోనే దోపిడీ మొదలు పెట్టిందన్నారు. రాహుల్‌గాంధీ ముఠా రాష్ట్రంలో రూ.వందల కోట్లను వసూలు చేస్తోందని ఆరోపించారు.

రాష్ట్రం నుంచి ఢిల్లీకి సూట్ కేసులు..

గతంలో ఇతర రాష్ట్రాలోని నేతలకు ఎన్నికల్లో కేసీఆర్ డబ్బులు ఇచ్చేవారని, నేడు కాంగ్రెస్ కూడా అదే పద్ధతిలో దోపిడీకి పాల్పడుతోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ, కర్ణాటకల్లో అధికారంలో ఉండటంతో వసూళ్లు చేసి పంపాలని కాంగ్రెస్ అధిష్టానవర్గం డిమాండ్ పెట్టినట్టు తెలుస్తోందన్నారు. అందుకే అధికారంలోకి వచ్చి వంద రోజులు కూడా కాకుండానే రాష్ట్రం నుంచి ఢిల్లీకి కాంగ్రెస్ నేతలు సూట్‌కేస్‌లు పంపుతున్నారని ఆరోపించారు.

కేసీఆర్ రాజకీయాల నుంచి తప్పుకున్నా ఆశ్చర్యం లేదు

బీఆర్‌ఎస్ నిన్నటి పార్టీ అని, ఆ పార్టీ అవసరం తెలంగాణలో లేదని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసినా వృథా అవుతుందన్నారు. కేసీఆర్ ఫాంహౌజ్‌లో ఉన్నారని, రేపో మాపో ఆయన రాజకీయాలను విరమించుకున్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ఇక కాంగ్రెస్‌కు ఓటు వేసినా దేశంమొత్తంమీద 20 ఎంపీ స్థానాలు కూడా సాధించే స్థితిలో ఆ పార్టీ లేదన్నారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలను గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో అసదుద్దీన్‌ను ఓడించడం ఖాయమన్నారు. సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు.

రేపు మేడిగడ్డకు వెళ్తున్నాం

- డీజీపీకి రూట్ మ్యాప్ అందజేసిన బీఆర్‌ఎస్
- బందోబస్తు కల్పిస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు సంబంధించి బీఆర్‌ఎస్ నాయకులు డీజీపీ రవిగుప్తాకు తమ రూట్ మ్యాప్‌ను అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న మూడు పియర్స్‌ను స్వయంగా పరిశీలించేందుకు మార్చి 1న వెళ్తున్నట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బుధవారం డీజీపీ రవిగుప్తాకు తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు పలువురు మాజీ మంత్రులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇతర నేతలు సుమారు రెండు వందల మంది ప్రత్యేక బస్సుల్లో బయలుదేరుతున్నట్లు డీజీపీకి అందజేసిన లేఖలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8.30కు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి, ఆలేరు, జనగామ, వరంగల్, పరకాల, భూపాలపల్లి మీదుగా తమ పర్యటన సాగుతుందన్నారు. భూపాలపల్లిలో మధ్యాహ్న భోజనం తర్వాత మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుంటామని వివరించారు. పార్టీ కీలక నేతలు వివిధ ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగానికి ముందస్తు సమాచారం ఇవ్వడం తమ బాధ్యతగా భావించి లేఖ ఇస్తున్నట్లు సత్యవతి రాథోడ్ వెల్లడించారు. కాగా బీఆర్‌ఎస్ బృందం పర్యటనకు తగిన బందోబస్తు కల్పిస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. డీజీపీని కలసిన వారిలో సత్యవతి రాథోడ్‌తో పాటు వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, పార్టీ నేతలు రాజేశ్వర్‌రావు, రాఘవ తదితరులున్నారు.

మేడిగడ్డకు మేమూ వస్తాం

గజ్వేల్ రూరల్: మేము సైతం మేడిగడ్డకు వస్తామని 'మల్లన్నసాగర్'నిర్వాసితులు మాజీమంత్రి కేటీఆర్‌కు విన్నవించారు. మేడిగడ్డ సందర్శనకు రమ్మంటూ కాంగ్రెస్ నాయకులను ఆహ్వానిస్తున్నట్లుగానే.. మాకు కూడా బస్సు సౌకర్యం కల్పిస్తే..అక్కడికి వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన తప్పులు, లొసుగులను వివరిస్తామన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులిచ్చిన కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ చేపట్టిన పనులకు సంబంధించిన లొసుగులను తెలియజేస్తామన్నారు.

బండి కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి

వంగరలో ఉద్రిక్తత
- పోలీసుల సమక్షంలో కోడిగుడ్ల దాడిపై మండిపడ్డ బండి సంజయ్
- మీ భద్రత అవసరం లేదు.. కార్యకర్తలే రక్షణగా ఉంటారని వెల్లడి


వంగరలో పోలీసులను ప్రశ్నిస్తున్న బండి సంజయ్

హన్మకొండ/ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర కాన్వాయ్‌పై కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేశారు. ఉదయం బండి సంజయ్.. భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్ర స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుని యాత్ర ప్రారంభించారు. కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలుపుతారన్న అంచనాతో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. యాత్ర కొత్తకొండ నుంచి గట్ల నర్సింగపూర్, వంగరకు చేరుకున్నాక.. అక్కడ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఇంటిని సందర్శించారు. అనంతరం యాత్ర సాగుతున్న క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు బండి కాన్వాయ్‌పై కోడిగుడ్లతో దాడి చేయగా గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల సమక్షంలో కోడిగుడ్ల దాడి జరగడంపై బండి సంజయ్ మండిపడ్డారు. దాడి జరుగుతోంటే మీరేం చేస్తున్నారని, దాడి చేసిన వారిని ఎందుకు నిలువరించలేదని పోలీసులను ప్రశ్నించారు. ఇలాంటప్పుడు మీ భద్రత తనకు అవసరం లేదని, తన రక్షణను కార్యకర్తలు చూసుకుంటారని చెప్పారు. 'వందరోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేయకుంటే రేపటినుంచి ఎట్లా ఉంటదో నా తడాఖా చూపిస్తా. రాముడి జన్మస్థలాన్ని ప్రశ్నించే వాళ్లను నేను నిలదీస్తే... తల్లిని అడ్డుపెట్టుకుని ఇక్కడున్న మంత్రి రాజకీయం చేయాలనుకుంటున్నారు. కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేసి నన్ను గెలికారు, కేసీఆర్‌కే చుక్కలు చూపినోన్ని.. నాకు కాంగ్రెస్ కొత్తకాదు' అని బండి అన్నారు. యాత్ర రాత్రికి కమలాపూర్‌కు చేరుకుంది. కాగా, దాడిలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్త గజ్జెల సురేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నేడు ఢిల్లీకి బండి సంజయ్

పార్టీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు బండి సంజయ్ గురువారం ఢిల్లీ వెళ్తున్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో గురువారం హుజూరాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్, ఇల్లందకుంట మండలాల్లో కొనసాగాల్సిన ప్రజాహిత యాత్ర శుక్రవారానికి వాయిదా పడినట్లు బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు తెలిపారు.

నిరూపిస్తే సజీవ దహనం చేసుకుంటా..

బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ధ్వజం



వేములవాడ అర్బన్: తాను అనని మాటలు అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శివారులోని నాంపల్లి లక్ష్మీ నరసింహస్వామిని ఆయన బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నేను హిందువును.. నేను భక్తుడిని.. రాముడి జన్మ గురించి నేను అడిగినట్లు నిరూపిస్తే.. సజీవ దహనం చేసుకుంటా'అని ఎంపీ బండి సంజయ్‌నుద్దేశించి అన్నారు. రాముని జన్మభూమి ఎక్కడ? అని తాను అనని మాటలను ప్రచారం చేయడం సరికాదన్నారు. 'నేను అమ్మ పేరుమీద రాజకీయం చేస్తున్నాని అంటావా? అమ్మ పేరు తెచ్చింది ఎవరు? అమ్మను రాజకీయా లకు తెచ్చింది ఎవరు'అని ప్రశ్నించారు.

నేడు బీజేపీ పార్లమెంటరీ బోర్డు భేటీ

8 సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం ఢిల్లీలో గురువారం జరగనుంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో పోటీచేసే అభ్యర్థుల తొలి జాబితాను ఈ కీలకమైన సమావేశంలో ప్రకటించే అవకాశాలున్నాయి. తెలంగాణలోని 17 సీట్లకుగానూ ఎనిమిది లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించవచ్చునని పార్టీ ముఖ్యులు చెబుతున్నారు. సిట్టింగ్ నాలుగు సీట్లకుగాను సికింద్రాబాద్–కిషన్‌రెడ్డి, కరీంనగర్–బండి సంజయ్, నిజామాబాద్– అర్వింద్ ధర్మపురి, ఆదిలాబాద్–సోయం బాపూరావులతో పాటు మల్కాజిగిరి–ఈటల రాజేందర్, మహబూబ్‌నగర్–డీకే అరుణ, చేవెళ్ల– కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భువనగిరి–బూర నర్సయ్యగౌడ్ అభ్యర్థిత్వాలను ఖరారు చేసే అవకాశాలున్నాయని పార్టీవర్గాల సమాచారం. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల్లో పనిచేసుకోవాల్సిందిగా ఆయా అభ్యర్థులకు జాతీయనాయకత్వం సంకేతాలిచ్చినట్టు తెలిసింది. కాగా, పార్లమెంటరీ బోర్డు భేటీలో పాల్గొనే నిమిత్తం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడు ఈటల రాజేందర్, రాష్ట్ర పార్టీ సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ ఢిల్లీ వెళ్లనున్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ పోతుగంటి నేడు బీజేపీలోకి?

ఢిల్లీలో గురువారం బీఆర్‌ఎస్ నాగర్ కర్నూల్ సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములు, ఆయన కుమారుడు భరత్ బీజేపీలో చేరనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

మేడిగడ్డనో... బొందల గడ్డనో తేల్చాలి

ఆ తర్వాతే బీఆర్‌ఎస్ నేతలు అక్కడికి వెళ్లాలి: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అది మేడిగడ్డనో, బొందలగడ్డనో ముందు కేసీఆర్ తేల్చాలని, ఆ తర్వాతే బీఆర్‌ఎస్ నేతలు మేడిగడ్డకు వెళ్లాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు.మేడిగడ్డలో పిల్లర్లు కుంగింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ నేతలు కోట్ల శ్రీనివాస్, చరణ్‌కౌశిక్ యాదవ్‌తో కలిసి జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏం పీకడానికి మేడిగడ్డ వెళుతున్నారంటూ నల్లగొండ సభలో కేసీఆర్ ప్రశ్నించారని గుర్తు చేసిన జగ్గారెడ్డి.. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ చేసిన అవినీతిని పీకడానికి, కట్టిన డబ్బు సంచులు పీకడానికి వెళ్లామని బదులిచ్చారు. బీఆర్‌ఎస్ నేతలు ముందుగా మంచి బుద్ధి తెచ్చుకోవాలని, మీరు ఒకటి అంటే మా కార్యకర్తలు వంద అంటారన్న విషయం మర్చిపోవద్దని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌నుద్దేశించి బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని, ఆయన వెంటనే క్షమాపణలు చెపితే వివాదం ఇంతటితో ముగిసిపోతుందన్నారు.

బాల్కసుమన్ చిన్నపిలగాడు.. కడియం గాలిపటం మాదిరి

బాల్కసుమన్ చిన్నపిలగాడని, పిలగాడు పిలగాడి తీరులోనే ఉండాలని జగ్గారెడ్డి హితవు పలికారు. కడియం శ్రీహరికి రాజకీయ జ్ఞానం లేదని గాలిపటం లాంటి వాడని ఎద్దేవా చేశారు. ఏ పార్టీలో పనిచేసినా ఆ పార్టీ అధినేతల లైన్ ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని, అది కూడా తెలియని కడియం శ్రీహరి తన వద్దకు వస్తే క్లాసులు చెపుతానని వ్యాఖ్యానించారు. తన టైం బాగాలేక సంగారెడ్డిలో ఓడిపోయాయని, ఐదేళ్లు రెస్ట్ ఇచ్చినందుకు సంగారెడ్డి ప్రజలకు కృతజ్ఞతలని చెప్పిన జగ్గారెడ్డి తాను మెదక్ ఎంపీగా పోటీ చేయడం లేదని, ఈ అంశంలోకి మరోమారు తనను లాగవద్దని విజ్ఞప్తి చేశారు.

దమ్ముంటే 17 సీట్లు గెలిపించుకోవాలి



- రేవంత్‌కు కడియం సవాల్
- సీఎం సహనాన్ని కోల్పోయి మాట్లాడుతున్నారు... ఇనాంగానే సీఎం పదవి వచ్చిందని ఎద్దేవా

హన్మకొండ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాల్లో ఎంపీలను గెలిపించుకుని మగతనం నిరూపించుకోవాలని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సీఎం మాట్లాడే తీరు సరిగా లేదని ధ్వజ బుధవారం హనుమకొండలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేశ్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలసి కడియం శ్రీహరి విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకు మగతనానికి సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 'మహిళలు రాజకీయాల్లో రాణిస్తున్నారు.. సోనియా, ప్రియాంక నాయకత్వంలో పనిచేస్తూ, మగతనం గురించి మాట్లాడుతున్నావంటే వారిని అవమానపరిచినట్లే కదా'అని కడియం అన్నారు. రేవంత్ ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే అందులో ఏ ఒక్క నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను గెలిపించుకోలేదన్నారు. 'అంటే నీవు మగాడివి కాదా, మగతనం లేదా'అంటూ రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. 'సీఎం కుర్చీ మాకు అవసరం లేదు, బీఆర్‌ఎస్‌తో రేవంత్‌రెడ్డికి ఆ భయం లేదు. కానీ మీ పార్టీవారి పట్ల జాగ్రత్తగా ఉండాలి, మీ కుర్చీని తీసుకునేందుకు మీ పార్టీ వారే సిద్ధంగా ఉన్నారు'అంటూ చురకలు అంటించారు. చేవెళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు ప్రతిపక్షాన్ని బూచిగా చూపి స్వపక్ష మంత్రులను హెచ్చరించినట్లుగా ఉందన్నారు. వారసత్వ, కుటుంబ రాజకీయాలు కాంగ్రెస్ పార్టీవేనని, పేరుకు జాతీయ పార్టీ అయినా కొనసాగేవి వారసత్వ రాజకీయాలే అన్నారు. ఆ వారసత్వ కుటుంబం ఇచ్చిన ఇనాంగానే సీఎం పదవి వచ్చిందని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక భాష మార్చుకుంటారని అనుకున్నామని. కానీ రోజురోజుకూ సహనాన్ని కోల్పోయి, ప్రతిపక్షంపై దాడి చేస్తున్నారని, గత సీఎంపై పరుష పదజాలం ఉపయోగిస్తున్నారని, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అనే విషయం గ్రహించి భాష మార్చుకోవాలని హితవు చెప్పారు.

తుమ్మితే ఊడిపోయే ముక్కులా కాంగ్రెస్


- లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో అనూహ్య పరిస్థితులు
- మాతో బీఆర్‌ఎస్ ఎంపీలు టచ్‌లో ఉన్నారు: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఉందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో అనూహ్యమైన రాజకీయ మార్పులు చోటుచేసుకోబోతున్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక సీఎం రేవంత్‌రెడ్డి పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందన్నారు. కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌పై సొంత పార్టీ ఎమ్మెల్యేలే తిరగబడ్డారని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం పార్టీ నాయకులు ఎస్.ప్రకాశ్ రెడ్డి, ఎస్.కుమార్‌లతో కలిసి లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు కేసీఆర్, ఆయన కుటుంబం పట్ల, బీఆర్‌ఎస్ నియంతృత్వ పోకడలతో విసుగు చెంది మార్పు కోరుకున్నారని, అందులో భాగంగా బీఆర్‌ఎస్ ఓడి కాంగ్రెస్ లాభపడిందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పరిస్థితి గల్లంతైందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా ఆ పార్టీ గెలిచే అవకాశాలు లేవని లక్ష్మణ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మునిగిన శకమైతే, కాంగ్రెస్ పార్టీలో మునిగిపోయే నావ వంటి పరిస్థితులున్నాయని చెప్పారు. బీఆర్‌ఎస్ ఎంపీలు నిస్సహాయస్థితిలో ఉన్నారని, తమతో చాలా మంది సిట్టింగ్ ఎంపీలు సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. వారిని చేర్చుకునే విషయంలో తాము ఆచితూచి వ్యవహరిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 17 స్థానాలకు ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పారు. అధికారం కోసం అందరికీ ఉచిత పథకాలంటూ మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు తమ పథకాలు కొందరికే అని చెప్పడం దివాళాకోరుతనమని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్నీ కేసీఆరే

- ఆయనే మేడిగడ్డను చూసి క్షమాపణ చెబితే బాగుంటుంది
- మేడిగడ్డపై ఏం చేయాలో ఎన్డీఎస్‌ఏ నిర్ణయిస్తుంది... మీ ఉచిత సలహాల ఆధారంగా మరమ్మతులు చేయం
- నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: 'మీరందరూ పోయి ఏం చేస్తారు.. కాళేశ్వరం ప్రాజెక్టుకు చీఫ్ డిజైనర్, చీఫ్ ప్లానర్, చీఫ్ ఆర్కిటెక్ట్, చీఫ్ ఇంజనీర్ అన్నీ కేసీఆరే. ఆయనే వెళ్లి కూలి పోతున్న మేడిగడ్డను చూసి, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెబితే బాగుంటుంది..'అని నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడాలని పలు దఫాలుగా కేసీఆర్‌ను కోరామని, బ్యారేజీని పరిశీలించడానికి హెలికాప్టర్‌ను సమకూరుస్తామని చెప్పినా రాలేదని అన్నారు. మార్చి 1వ తేదీన చలో మేడిగడ్డ నిర్వహించాలని బీఆర్‌ఎస్ నిర్ణయించిన నేపథ్యంలో బుధవారం జలసౌధలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

సహకరించాలని అధికారులకు చెప్పాం

'మేడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు చూసేందుకు అన్ని విధాలుగా సహకరించాలని అధికారులకు చెప్పాం. ప్రభుత్వం తరఫున వసతులు కల్పించాలని ఆదేశాలు ఇచ్చాం. స్వతంత్ర భారతదేశంలో ఇంత అవినీతి, యాజమాన్య లోపం ఎక్కడా జరగలేదని కాగ్ నివేదిక తేల్చిచెప్పింది. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నివేదిక, విజిలెన్స్ రిపోర్టులో అదే ఉంది. వేల కోట్లు దోచుకొని, 'ఉల్టా చోర్ కొత్వాల్ కు డాంటే' అన్నట్లుగా వ్యవహారం ఉంది..'అని ఉత్తమ్ విమర్శించారు.

కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కకూడదనే కాళేశ్వరం

'ప్రపంచ వ్యాప్తంగా బ్యారేజీలు నీటిని మళ్లించడానికి కడతారు. కాళేశ్వరంలో నీటిని నిల్వ చేయడానికి కట్టడం వల్లే బ్యారేజీలన్నీ దెబ్బతిన్నాయి. కాళేశ్వరం బ్యారేజీలను డ్యామ్‌లుగా వినియోగించడం వల్లే అనర్థాలు చోటుచేసుకున్నాయి. ప్రాణహిత–చేవెళ్ల కింద తుమ్మిడిహెట్టి బ్యారేజీని 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే 1,200 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతాయని మాజీ ఇంజనీర్లు నివేదిక ఇచ్చారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ వద్దని చెప్పారు. అయినా కేసీఆర్ పట్టించుకోలేదు. రూ.38,500 కోట్లతో పూర్తయ్యే ప్రాణహితను పక్కనపెట్టి, కాళేశ్వరం పేరుతో రూ.81 వేల కోట్లకు అంచనాలు పెంచి, ఇప్పటికే రూ.94 వేల కోట్లు ఖర్చు చేశారు. కాళేశ్వరం పూర్తి కావాలంటే ఇప్పుడు రూ.1.47 లక్షల కోట్లు కావాలి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత– చేవెళ్ల పూర్తయితే కాంగ్రెస్‌కు ఎక్కడ ఖ్యాతి వస్తుందోనని, కమీషన్లు తగ్గుతాయేమోనన్న ఉద్దేశంతో కాళేశ్వరం కట్టారు. దీనివల్ల ఏటా రూ.25 వేల కోట్ల ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతుంది..'అని మంత్రి పేర్కొన్నారు.

ఐదేళ్లలో ఎత్తిపోసింది 163 టీఎంసీలే

'కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఏటా 180 టీఎంసీలు ఎత్తిపోయాల్సి ఉండగా.. ఐదేళ్లలో ఎత్తిపోసింది 163 టీఎంసీలే. అందులో మళ్లీ 51 టీఎంసీలు సముద్రంలోకి వదిలిపెట్టారు. మేడిగడ్డతో పాటు అన్నారం బ్యారేజీని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎన్డీఎస్‌ఏని కోరాం. ఏం చేయాలో ఎన్డీఎస్‌ఏ నిర్ణయిస్తుంది. మీ ఉచిత సలహాల ఆధారంగా బ్యారేజీలకు మరమ్మతులు చేయం..'అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

మార్చి 19న డాక్ అదాలత్

తపాలా ఫిర్యాదుల పరిష్కారం కోసం

సాక్షి, హైదరాబాద్: తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి మార్చి 19న డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తపాలాశాఖ పేర్కొంది. ఇది వర్చువల్ పద్ధతిలో మాత్రమే ఉంటుందని వెల్లడించింది. డాక్ అదాలత్ దృష్టికి తమ ఫిర్యాదులను తీసుకెళ్లాలనుకున్నవారు మార్చి 8వ తేదీ నాటికి పంపవచ్చని ఓ ప్రకటనలో సూచించింది. ఫిర్యాదులను అర్థమయ్యే రీతిలో స్పష్టంగా రాసి, దాన్ని ఎన్వలప్ కవర్‌లో ఉంచి, కవర్‌పై డాక్ అదాలత్ అని స్పష్టంగా రాసి.. ఎస్.రంగారావు, అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ (పీజీ), ఆఫీస్ ఆఫ్ ది చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్–500001 చిరునామాకు పంపాలని సూచించింది. అందులో ఫిర్యాదు దారు ఫోన్ నెంబర్, ఈ–మెయిల్, ఇంటి చిరునామా స్పష్టంగా రాయాలని, వర్చువల్ డాక్ అదాలత్ వీడియో లింక్‌ను ఆ చిరునామాకే తెలుపుతామని అందులో పేర్కొంది.

ఆ కుట్రలను తిప్పికొట్టాలి

- కాళేశ్వరంపై బీఆర్‌ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు
- పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసమే బీఆర్‌ఎస్‌ను బద్నాం చేస్తున్నారు
- కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవాలపై కరపత్రం విడుదల


మల్లుపల్లెలో పుట్ట మధుకర్ రూపొందించిన కరపత్రాన్ని చదువుతున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల/ సిరిసిల్లటౌన్: తెలంగాణ సాగుభూములను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లుపల్లెలో బుధవారం పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవాలపై రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చే కుట్ర పన్నుతోందని ఆరోపించారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లకు మరమ్మతులుచేసి ప్రాజెక్టును పునరుద్ధరించాల్సిన ప్రభుత్వం, అసత్య ఆరోపణలతో బీఆర్‌ఎస్‌ను బదనామ్ చేసే కుట్ర పన్నుతోందన్నారు. ప్రపంచంలోనే నంబర్ వన్ ప్రాజెక్ట్‌గా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఏర్పడిన చిన్న చిన్న సాంకేతిక లోపాలను భూతద్దంలో చూపిస్తూ, ప్రాజెక్టు ప్రతిష్టను మంటగలుపుతోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిజానిజాలను ప్రజలకు వివరించేందుకు మార్చి 1న చలో కాళేశ్వరానికి శ్రీకారం చుట్టామని కేటీఆర్ వివరించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై పాలసీ తీసుకురావాలి

ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన కార్మికులను ఆదుకునేందుకు ఎన్నారై పాలసీని తీసుకురావాలని కేటీఆర్ అన్నారు. ఈ సారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేఎన్నారై పాలసీని తీసుకురావాలని అనుకున్నట్లు తెలిపారు. సుమారు పద్దెనిమిదేళ్లు గల్ఫ్ దేశం జైల్లో ఉండి ఇటీవలే స్వగ్రామానికి వచ్చిన రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రం పెద్దూరుకు చెందిన బాధిత కుటుంబాలను బుధవారం ఆయన కలిశారు. వారి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. ఎన్నారై పాలసీ వస్తే గల్ఫ్ బాధితులకు తోడ్పాటుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడతామని చెప్పారు.

సాక్షి
గురువారం, 29 ఫిబ్రవరి 2024

చిన్న బుద్ధుల పెద్ద ఎన్నిక

అసెంబ్లీలో పార్టీలకు స్పష్టమైన సంఖ్యాబలం ఉన్నచోట రాజ్యసభ ఎన్నికలనేవి అంతా సజావుగా సాగిపోయే మామూలు తంతు. కానీ, పార్టీ ఏదైనా సరే పాలకపక్షంతో అంటకాగడానికీ, జెండా కన్నా సొంత అజెండాకు పెద్ద పీట వేయడానికీ ప్రజాప్రతినిధులు దిగజారితే, పెద్దల సభకు ఎన్నికలు సైతం చిన్న బుద్ధులకు వేదిక అనిపించక మానవు. ఫిబ్రవరి 27న యూపీ (10 సీట్లు), కర్ణాటక (4 సీట్లు), హిమాచల్ ప్రదేశ్ (1)లలో ఎగువసభ ఎన్నికలు అలానే సాగాయి. హిమాచల్‌లో అధికార కాంగ్రెస్ సభ్యులు ఆరుగురు, యూపీలో ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు ఏడుగురు క్రాస్ ఓటింగ్‌కు దిగడంతో ఆ పార్టీలు చెరొక స్థానాన్ని బీజేపీకి కోల్పోయాయి. ఒక బీజేపీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు ఓటేసిన కర్ణాటకలో మాత్రం కాంగ్రెస్ నాలుగింట తనకు దక్కాల్సిన 3 స్థానాల్ని నిలబెట్టుకుంది.

మంగళవారం 15 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరిగితే, బీజేపీ తన బలంతో గెలవగలిగిన వాటి కన్నా రెండు సీట్లు ఎక్కువగా 10 సొంతం చేసుకుంటే, కాంగ్రెస్, ఎస్పీలు తమ సంఖ్యాబలం కన్నా చెరొకటి తక్కువగా వరుసగా 3, 2 సీట్లే దక్కించుకోవడం గమనార్హం. ప్రజాప్రతినిధుల్ని రకరకాలుగా ప్రలోభపెట్టి, క్రాస్ ఓటింగ్‌కు దిగజార్చే దుష్టసంస్కృతి పూర్తి స్థాయిలో స్థిరపడినట్టు మరోసారి రుజువైంది. రాజ్యసభ ఎన్నికలకు విప్‌ల జారీ కుదరదు కానీ, తమ పార్టీ నియమించిన ఏజెంట్‌కు లెజిస్లేటర్లు తమ బ్యాలెట్ పేపర్లు చూపాలి. అయినా సరే, ఎమ్మెల్యేలు తామున్న పార్టీ వైఖరికి భిన్నంగా ఓటేయడం వర్తమాన రాజకీయాలలో విలువల పతనానికి విషాద నిదర్శనం. చిత్రమేమంటే, హిమాచల్‌లో రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు మనుగడనే బీజేపీ ప్రశ్నార్థకం చేసింది.

ఉత్తరాదిన కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గత ఏడాదే గెలిచి, హస్తం పార్టీ అక్కడ అధికారంలోకి వచ్చింది. ఆ రాష్ట్రం నుంచి తమ అభ్యర్థి గెలుపునకు కావాల్సిన బలం కన్నా ఎక్కువ ఎమ్మెల్యేలే తమకున్నారని అధికార కాంగ్రెస్ పెద్దలు ఏమరుపాటుగా ఉంటే, అదను కోసం చూస్తున్న ప్రతిపక్ష బీజేపీ తమ 'ఆపరేషన్ కమల్'కు పదును పెట్టింది. ఫలితంగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు తిరుగుబాటు చేసి, రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటేశారు. ఫలితంగా, మెజారిటీతో ఇట్టే గెలవాల్సిన కాంగ్రెస్ అభ్యర్థి – ప్రముఖ లాయర్ అభిషేక్ మను సింఘ్వీకి కాస్తా ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థితో సమానంగా మాత్రమే ఓట్లొచ్చిన పరిస్థితి. లాటరీలోనూ అదృష్టం బీజేపీ పక్షాన నిలిచేసరికి, ఆ రాజ్యసభా స్థానం కాంగ్రెస్ చేజారింది.

హిమాచల్‌లో కొద్దినెలలుగా కుతకుతలాడుతున్న అసంతృప్తిని అలక్ష్యం చేసి, బీజేపీ 'ఆకర్షణ మంత్రాన్ని' తక్కువగా అంచనా వేసి, కాంగ్రెస్ చేజేతులా ఈ ఓటమి కొనితెచ్చుకుంది. చివరకు అసెంబ్లీలో బడ్జెట్ ఆమోదం పొందాల్సినవేళ సభలో మెజారిటీ కోల్పోయిన కాంగ్రెస్ సర్కార్ కూలిపోయే దుఃస్థితి తలెత్తింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం ఆలస్యంగానైనా బరిలోకి దిగి, పరిస్థితిని చక్కదిద్దే పనిలో పడింది. సీనియర్ నేతలు డీకే శివకుమార్, భూపిందర్ సింగ్ హుడా తదితరుల్ని హిమాచల్ పంపింది. సుఖూ ప్రభుత్వంలో తమకు తగిన ప్రాధాన్యం లభించడం లేదన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు. ఈ విషయంపై వారు పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధిష్ఠానం తాజా బుజ్జగింపులతో అంతా సద్దుమణుగుతుందా అన్నది చూడాలి.

'నేను పోరాట యోధుణ్ణి, రాజీనామా ప్రసక్తే లేదు' అని సీఎం సుఖూ బింకంగా చెబుతున్నా, సభలో మెజారిటీ ఆయనకుందా, సొంత ఎమ్మెల్యేల్లోనే తీవ్ర అసంతృప్తి ఉన్నందున ఆయన అధికారంలో కొనసాగగలరా అన్నది అనుమానమే. మొత్తం 68 మంది సభ్యుల హిమాచల్ అసెంబ్లీలో కాంగ్రెస్ బలగం 40 మంది. ఆరుగురి క్రాస్ ఓటింగ్‌తో దాని బలం 34కు పడిపోయింది. ఇక, బీజేపికి 25 మంది ఉంటే, ఇండిపెండెంట్లు ముగ్గురున్నారు. బీజేపీ పాలిత హర్యానాలో పంచకులాలో మకాం వేసిన కాంగ్రెస్ రెబెల్స్‌తో కలుపుకొంటే కాషాయ బలమూ 34కు చేరింది. సభలో మెజారిటీ మార్కు 35. ఇంకా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమను సంప్రతిస్తున్నారని బీజేపీ అంటున్నందున ఏమైనా జరగవచ్చు. ఈ నేపథ్యంలో నాటకీయత పెంచుతూ బుధవారం 15 మంది బీజేపీ ఎమ్మెల్యేల్ని అసెంబ్లీ నుంచి స్పీకర్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌తో ఇప్పటికి గండం గట్టెక్కాలన్నది తాపత్రయం. అదే జరిగినా, సుఖూను వ్యతిరేకిస్తూ, సీఎం పీఠానికై విక్రమాదిత్య సింగ్ సహా ముగ్గురు కాంగ్రెస్ నేతలు పోటీ పడుతుండడం గమనార్హం. మాజీ సీఎం వీరభద్ర సింగ్ కుమారుడైన విక్రమాదిత్య మంత్రి పదవికి రాజీనామా ఇస్తున్నట్టు ప్రకటించడం కథలో కీలక మలుపు.

ఎన్నికల్లో మెజారిటీ ఏ పార్టీకి దక్కినా, ప్రభుత్వం ఎవరు ఏర్పాటు చేసినా, ఆఖరుకు అక్కడ బీజేపీయే అధికార చక్రం తిప్పడం కొన్నేళ్ళుగా పెరుగుతున్న ధోరణి. సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించి ప్రతి రాష్ట్రంలోనూ ప్రత్యర్థి పార్టీ నేతల్ని తమ వైపు తిప్పుకోవడంలో బీజేపీది ఇప్పుడు తిరుగులేని రికార్డు. 2019లో కర్ణాటకలో జేడీ–ఎస్ నేత కుమారస్వామి ప్రభుత్వం, 2020లో మధ్యప్రదేశ్‌లో కమలనాథ్ సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్, 2022లో మహారాష్ట్రలోని శివసేన ఉద్ధవ్ ఠాక్రే గవర్నమెంట్... ఇలా గత నాలుగేళ్ళలో కాషాయపార్టీ పాలబడినవి ఎన్నో. తాజాగా హిమాచల్‌లోని సుఖూ సారథ్య కాంగ్రెస్ సర్కార్ ఆ జాబితాలో చేరేలా కనిపిస్తోంది. సుఖూ పట్ల పార్టీలో వ్యతిరేకతను సర్దుబాటు చేసుకోవాల్సింది కాంగ్రెస్. కానీ, ఒక పార్టీ అంతర్గత విభేదాల కుంపటిలో మరొక పార్టీ చలి కాచుకొని, అధికారం చేజిక్కించుకోవాలని ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమే. సంతలో ప్రజాప్రతినిధులను కొని, ప్రజాతీర్పు తమ వైపు ఉందని ఏ పార్టీ భావించినా అది అవివేకం. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉంటారు. సమయం చూసి సమాధానం చెబుతారు.

రైతులకు ఉపగ్రహ ఊతం

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

ఉత్తర భారతదేశ రైతులు ఒకవైపు దేశ రాజధానిలో కనీస మద్దతు ధరతో పాటు ఇతర హక్కుల సాధన కోసం పోరు కొనసాగిస్తున్నారు. ఇంకోవైపు శ్రీహరి కోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్ర శాస్త్రవేత్తలు వాతావరణాన్ని మరింత మెరుగ్గా అంచనా వేసేందుకు ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించారు. ఈ ఉపగ్రహం వాన రాకడ, పోకడలతోపాటు వాతావరణానికి సంబంధించి మరింత కచ్చితమైన అంచనాలను రూపొందించేందుకు ఉద్దేశించినది. రైతులతోపాటు, మత్స్యకారులకూ ఉపయోగపడుతుంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఈ రెండు వర్గాలు పలు సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ వర్గాలకు సకాలంలో అందే హెచ్చరికలు, దీర్ఘకాలిక అంచనాలు ఎంతో ఉపయోగపడతాయి.

వాతావరణ మార్పుల ప్రభావం వల్ల 2050 నాటికి గోధుమ, వరి దిగుబడుల్లో గణనీయమైన తగ్గుదల ఉంటుందని శాస్త్రవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు. ఇన్‌శాట్–3డీఎస్ ప్రయోగం దేశంలోనే అతి పురాతనమైన ఉపగ్రహ ప్రయోగ కార్యక్రమం తాలూకూ పరిణతికి నిదర్శనం. ఇండియన్ నేషనల్ శాటిలైట్ (ఇన్‌శాట్) కార్యక్రమానికి యాభై ఏళ్ల క్రితమే బీజం పడింది. 1975లో ఇన్‌శాట్ శ్రేణి ఉపగ్రహాల ప్రయోగాలకు అనుమతులు లభించాయి. 1982లో తొలి ఉపగ్రహం (ఇన్‌శాట్–1ఏ) ప్రయోగం జరిగింది. మొదట్లో ఈ ఉపగ్రహాల్లో అత్యధికం ఫోర్డ్ ఏరోస్పేస్ అండ్ కమ్యూనికేషన్స్ కార్పొరేషన్ నుంచి కొనుగోలు చేసి, ఫ్లోరిడా(యూఎస్)లోని కేప్ కానవెరల్ నుంచి ప్రయోగించేవారు. ఇన్‌శాట్–1 శ్రేణి ఉపగ్రహాల కారణంగా భారతీయ వాతావరణ విభాగం ఉపగ్రహ ఆధారిత వాతావరణ అంచనాల రంగంలోకి అడుగుపెట్టింది. తుపానులు, ఈదురుగాలులతోపాటు అల్పపీడనాలను కూడా ఉపగ్రహాల సాయంతో పరిశీలించడం మొదలైంది.

1992లో ప్రయోగించిన ఇన్‌శాట్–2 శ్రేణి ఉపగ్రహాలు మునుపటి వాటి కంటే సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించినవి కావడం గమనార్హం. దేశీయంగా తయారు చేసిన చాలా హై రెజొల్యూషన్ రేడియో మీటర్లను ఇందులో ఉపయోగించారు. ఫలితంగా రోజువారీ వాతావరణ అంచనాలు, ముందస్తు అంచనాలు, మేఘాల ఛాయాచిత్రాల సేకరణ సులువు అయ్యింది.

సమాచార వినిమయానికి కూడా...

ఇన్‌శాట్–1, ఇన్‌శాట్– 2 శ్రేణి ఉపగ్రహాలు అటు వాతావరణ అంచనాలతోపాటు ఇటు సమాచార వినిమయం, బ్రాడ్‌కాస్టింగ్ రంగాలకూ ఎంతో ఉపయోగపడ్డాయి. ఇన్‌శాట్–2 శ్రేణిలోని కొన్ని ఉపగ్రహాల్లో వాతావరణ సంబంధిత పేలోడ్‌లు అసలు లేకపోవడం గమనార్హం. కొన్ని రకాల సమాచారాన్ని సేకరించేందుకు (తుపానుల మధ్య భాగం వంటివి) భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అమెరికా రక్షణ శాఖ ఉపగ్రహాలపై ఆధారపడింది. ఈ సమస్యను అధిగమించే లక్ష్యంతో ఐఎండీ 2002లో మెట్‌శాట్‌ను ప్రయోగించింది. తరువాతి కాలంలో దీని పేరును కల్పన–1గా మార్చారు. కర్నాల్ (హరియాణా)లో పుట్టి, 'నాసా' వ్యోమగామిగా ఎదిగి 2002లో స్పేస్‌షటిల్ ప్రమాదంలో మరణించిన కల్పనా చావ్లా స్మరణార్థమన్న మాట!

ఈ సమయంలోనే వాతావరణ పరిశోధనలకు ప్రత్యేకంగా ఒక ఉపగ్రహం ఉంటే బాగుంటుందన్న అభిప్రాయాన్ని ఐఎండీ వ్యక్తం చేసింది. ఫలితంగానే 2013లో ఇన్‌శాట్–3డీ శ్రేణి మూడోతరం వాతావరణ ఉపగ్రహ ప్రయోగం జరిగింది. 2016లో ఇదే శ్రేణిలో ఇంకో ఉపగ్రహాన్ని కూడా విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి –17న ప్రయోగించిన ఉపగ్రహం ఇన్‌శాట్–3డీ శ్రేణిలో తాజాది. కేంద్ర భూశాస్త్ర మంత్రిత్వ శాఖ ఈ ఉపగ్రహానికి



నిధులు సమకూర్చింది. ఐఎండీతోపాటు నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ (నోయిడా), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (పుణే) వంటి సంస్థలు ఈ ఉపగ్రహం అందించే సమాచారాన్ని ఉపయోగించుకుంటాయి.

వాతావరణం, సముద్ర సంబంధిత సమగ్ర సమాచారాన్ని ఇన్‌శాట్–3డీఎస్ ద్వారా అందుకోవచ్చు. దీంట్లోని పరికరాలు ఆరు రకాల పౌనఃపున్యాలలో ఛాయాచిత్రాలు తీయగలవు. నేల నుంచి మొదలుపెట్టి అంతరిక్షం వరకూ వేర్వేరు ప్రాంతాలకు సంబంధించిన ఉష్ణోగ్రతలు, తేమశాతం వంటి వివరాలూ సేకరించగలవు. సముద్ర, భూ ఉపరితల ఉష్ణోగ్రతలు, మేఘాల లక్షణాలు, పొగమంచు, వాన, మంచు ఆవరించిన ప్రాంతం, పడిన మంచు మందం, కార్చిచ్చులు, వాతావరణంలోని కాలుష్యకారక కణాలు, టోటల్ ఓజోన్ వంటి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు సేకరించేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుంది.

ఈ దశలో ఒక వైపు ఉపగ్రహ నిర్మాణంలో దేశీ టెక్నాలజీల వాడకం పెంచుకుంటూనే ఇంకోవైపున ఉపగ్రహ సమాచారాన్ని అందుకునేందుకు, విశ్లేషించేందుకు అవసరమైన భూతల సామర్థ్యాన్ని కూడా భారత్ పెంచుకుంది. వాతావరణ ఉపగ్రహాల నుంచి సమాచారం అందుకునేందుకు ఐఎండీ కొత్త కొత్త ఎర్త్ స్టేషన్స్ నిర్మాణాన్ని చేపట్టింది. సమాచారాన్ని అప్పటికప్పుడు విశ్లేషించేందుకు కంప్యూటింగ్ సామర్థ్యాన్ని కూడా పెంచుకుంది. వాతావరణ మోడలింగ్ కోసం సూపర్ కంప్యూటర్‌ను ఇచ్చేందుకు అమెరికా నిరాకరించిన 1980లలో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ–డాక్)ను ఏర్పాటు చేసి, దేశీయంగానే హై స్పీడ్ కంప్యూటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేసే పనిలో పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ భారత్ వాతావరణ సంబంధిత సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థల నిర్మాణంలో అగ్రగామి దేశంగా నిలిచింది. తాజాగా అంటే గత ఏడాది మరింత అత్యాధునిక వాతావరణ పరిశోధనల కోసం కేంద్ర భూపరిశోధన మంత్రిత్వ శాఖ రెండు సూపర్ కంప్యూటర్ల నిర్మాణానికి సిద్ధమైంది. ఫ్రెంచ్ కంపెనీ సాయంతో పది కోట్ల డాలర్ల ఖర్చుతో వీటిని నిర్మించనున్నారు. నోయిడా, పుణెల్లోని కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

టెక్నాలజీతోపాటు మారుతూ...

వాతావరణ అంచనాల ఫలితాలను సామాన్యులకు చేర్చేందుకు ఐఎండీ టెక్నాలజీతోపాటుగా మారుతూ వచ్చింది. అడ్వయిజరీస్, ఎర్లీ వార్నింగ్, షార్ట్ – మీడియం రేంజ్ స్థానిక అంచనాల వంటివి అందించే వ్యవస్థలను కూడా కాలక్రమంలో ఏర్పాటు చేసుకుంది. ఒకప్పుడు వాతావరణ సమాచారాన్ని టెక్స్ట్ ఎస్ఎంఎస్ రూపంలో పంపితే, మొబైల్ ఫోన్ల కాలంలో వేర్వేరు భాషల్లో సమాచారాన్ని అందించే వీలేర్పడింది. అయితే వీటి ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం రైతులకు ఎంతవరకూ ఆచరణ సాధ్యమన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. వాట్సప్, సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ల వంటి అనేకానేక సమాచార మాధ్యమాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఈ ప్రశ్నకు మరింత ప్రాధాన్యమూ ఏర్పడుతోంది. నకిలీ, తప్పుడు వార్తలు విచ్చలవిడిగా ప్రవహిస్తున్న ఈ కాలంలో విశ్వసనీయమైన సమాచారం అందించేందుకు భారత వాతావరణ విభాగం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలన్న భారత ప్రయత్నాల్లో ఇన్‌శాట్–3డీఎస్ ఒక కీలకమైన మైలురాయి అని చెప్పాలి. విదేశాల నుంచి ఉపగ్రహాల కొనుగోళ్లు, ప్రయోగాలు నిర్వహించే స్థితి నుంచి మనం సొంతంగా వాతావరణ ఉపగ్రహాల తయారీ, ప్రయోగాలను చేపట్టే స్థితికి చేరాము. అది కూడా భారతీయ రాకెట్ల సాయంతో మనకు కావాల్సిన కక్ష్యలో ప్రవేశపెట్టగలుగుతున్నాము. సాంకేతిక పరిజ్ఞాన లభ్యతలో ఉన్న అంతరాలను జాగ్రత్తగా గుర్తించడం, విదేశీ టెక్నాలజీలను ఔపోసన పట్టడం, వ్యవస్థలు–ఉప వ్యవస్థల నిర్మాణానికి తగిన కార్యక్రమాలను అమల్లోకి తేవడం, ఇండియన్ స్పేస్ ఆర్గనైజేషన్, ఐఎండీ, ఇతర శాస్త్రీయ సంస్థలతో సన్నిహితంగా పనిచేయడం వంటి అనేకానేక చర్యల వల్ల ఈ అభివృద్ధి సాధ్యమైంది. ఇటీవలి కాలంలో దేశీ టెక్నాలజీ పరిశ్రమల ముఖచిత్రంలో గణనీయమైన మార్పులు వస్తున్నాయి. మైక్రో ఉపగ్రహ సమూహాల ప్రయోగంలో ప్రైవేట్ సంస్థలు బిజీగా ఉంటున్నాయి. వేగంగా ముంచుకొస్తున్న వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం కూడా సాంకేతిక పరిజ్ఞాన రంగంలో స్వావలంబనకు, మరీ ముఖ్యంగా అత్యాధునిక టెక్నాలజీల విషయంలో మరిన్ని ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వాళ్లదే రాజ్యం



రాజ్యసభ ఎన్నికల్లో ఎప్పుడు క్రాస్ ఓటింగ్ జరిగినా దానికి కారణాలు – డబ్బు, కండబలం. ఎందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సీఆర్‌పీఎఫ్, హరియాణా పోలీసులు కిడ్నాప్ చేస్తున్నారు? ఇది అప్రజాస్వామికం. దీనంతటికీ కారణం బీజేపీయే.

– షమా మహమ్మద్, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

అంతటా అదే!



మొత్తం 2024 లోక్ సభ సీట్లన్నీ – కాంగ్రెస్ మిత్ర పక్షాలవి, కాంగ్రెస్ పాత మిత్రులవి, కాంగ్రెస్ భవిష్యత్ మిత్రులవి, కాంగ్రెస్ మాజీ సభ్యులవి, కాంగ్రెస్‌తో విభేదించి పుట్టిన ప్రాంతీయ పార్టీలవి అయివుంటాయి. నిజంగా కాంగ్రెస్ ముక్త్ భారతే (కాంగ్రెస్ లేని భారతమే)!

– కుణాల్ కామ్రా, స్టాండప్ కమెడియన్

సొంతంగా ఆలోచించాలి!



స్కూళ్లు, కాలేజీల్లో ప్రాక్టికల్ సైన్సు ల్యాబులు ఉత్త ఫార్సు! విద్యార్థులు గుడ్డిగా తమ పాఠ్యపుస్తకాల్లో ఉన్న స్టెప్స్ ఫాలో అవుతారు. వాళ్లకు వాళ్లు ఎంతమాత్రమూ ఆలోచించరు – ప్రతిది ముందే నిర్ణయమైనట్టుగా బోరుగా జరిగిపోతుంది.

– అనిరుద్ధ మాల్‌పానీ, విద్యావేత్త

అదరగొట్టండి!



పరీక్షలు ఎవరికైతే జరుగుతున్నాయో అందరికీ... ఆల్ ద బెస్ట్! బాగా రాయండి. మొత్తం పాజిటివ్ ఎనర్జీ అంతా పంపుతున్నాను. బిగ్ హగ్స్.

– రష్మికా మందన్నా, నటి

ఏమైనా అనొచ్చు...



భారతదేశ ప్రధాన మంత్రి ఎంతటి నియంత అంటే – ఆయన్ని ఎవరైనా సరే ఫాసిస్ట్ డిక్టేటర్ అని అనవచ్చు; దానికి పరిణామాలు ఏమీ లేకుండానే!

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

పరీక్షలకు ఎలా సిద్ధం కావాలంటే...

విద్యార్థులు ఏటా పరీక్షలు ఎదుర్కోవడం సహజం. ఈ క్రమంలో కొందరు ఒత్తిడికి గురవుతుంటారు. మంచి మార్కులు సాధించగలనా? ఎలాంటి ప్రశ్నలు వస్తాయో? సరైన సమాధానాలు రాయగలనా? ఆశించిన మార్కులు రాకపోయినట్లయితే పరిస్థితి ఏమిటీ?... లాంటి ప్రశ్నలు మెదళ్లలో కదలాడుతుంటాయి. ప్రణాళిక ప్రకారం చదవడంతో పాటుగా చిన్నచిన్న చిట్కాలు పరీక్ష ఫలితాలను శాసించవచ్చు.

ఎంత బాగా చదివినా, ఎంత గుర్తున్నా, వ్రాసే విధానం తెలియక పోతే మంచి మార్కులు సాధించడం కష్టం. చేతి రాత బాగుండాలి. నిర్వచనం ఉంటే యధాతథంగా రాసే ప్రయత్నం చేయాలి. చిన్న ప్రశ్నలకు రాసే సమాధానాలలో ముఖ్యమైన విషయాలు వదలకుండా రాయాలి. జవాబులో నిర్వచనం ఉంటే ముందుగా రాయాలి. ముఖ్యమైన సైడ్ హెడ్డింగ్స్‌కు అండర్ లైన్ చేయాలి. అవసరమైన చోట చిత్రపటాలను గీచి, భాగాలు గుర్తించాలి. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండాలి.

ఇక పరీక్షలకు ఎలా చదవాలి అన్నదీ ముఖ్యమే. సబ్జెక్టులన్నింటికీ సమయం కేటాయించి ప్రణాళికతో చదవాలి. ఉదయం 4 గంటల నుండి 6 గంటల మధ్య చదివితే మంచి ఫలితం ఉంటుంది. కష్టమైన, ఇష్టం లేని సబ్జెక్ట్‌లకు ఎక్కువ సమయం కేటాయించాలి. ప్రతిరోజూ అవసరమైనంత నిద్ర పోవాలి. ఆహారం విషయంలో శ్రద్ధ వహించాలి. చల్లని పదార్థాలు తినడం, త్రాగడం మంచిది కాదు.

పరీక్షలకు రెండు రోజుల ముందు మొదటి పరీక్ష కోసమే చదవాలి. గతంలో చదివినంతవరకు మాత్రమే రివిజన్ చేయాలి, కొత్తవి నేర్చుకోవాలని ప్రయత్నించకూడదు. పరీక్ష రోజున పరీక్ష సమయానికి కనీసం గంట ముందు చదవడం ఆపాలి. పరీక్ష రాయడానికి కావలిసినవి సిద్ధం చేసుకోవాలి. పరీక్షా కేంద్రానికి అర గంట ముందుగా చేరాలి.

పరీక్ష హాలులో 2 నుండి 5 నిముషాలు కళ్ళు మూసుకొని ప్రశాంతంగా కూచోవాలి. ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు శ్రద్ధగా విని పాటించాలి. పరీక్షకు సంబంధించిన సబ్జెక్ట్ మెటీరియల్, ఇతరములు చిన్నముక్క కూడా దగ్గర ఉంచుకోకూడదు. ప్రశ్నపత్రంపై గానీ, బెంచ్‌పై గానీ, ప్యాడ్‌లపై గానీ ఏమీ రాయకూడదు. తనిఖీ బృందాలు డిబార్ చేస్తాయి. ప్రశ్నపత్రం శ్రద్ధగా చదవాలి. తేలికగా ఉన్న ప్రశ్నకు సమాధానం మొదటగా రాయాలి. మొదటి పేజీ అందంగా రాసే ప్రయత్నం చేయాలి. ప్రశ్నల నంబర్లు జవాబు పత్రాల్లో కరెక్టుగా రాసిందీ లేనిదీ చివర్లో చెక్ చేసుకోవాలి. ఈ అన్ని సూచనలూ పాటిస్తే తప్పనిసరిగా మంచి ఫలితాలు వస్తాయి.

– డా॥ అట్ల శ్రీనివాస్ రెడ్డి; స్పెషల్ ఎడ్యుకేటర్, రిహ్యాబిలిటేషన్ సైకాలజిస్ట్

స్వతంత్ర ప్రతిపత్తి పెరిగితే మరింత ముందుకు!

సందర్భం



పి. సతీష్

గత దశాబ్ద కాలంగా అనేక ప్రతికూలతల మధ్య ఎల్ఐసీ గణనీయమైన పురోగతి సాధించడం అటు పాలసీదారులకూ, ఇటు ఉద్యోగులూ, ఏజెంట్లకు సంతోషదాయకం. ఈ మధ్య రాజ్యసభలో జరిగిన చర్చలో ప్రధాని నరేంద్రమోదీ ఎల్ఐసీ షేర్ విలువ పెరగడం పట్ల, సంస్థ సాధిస్తున్న పురోగతి పట్ల హర్షం వ్యక్తం చేయడం ఈ సందర్భంగా గమనార్హం.

2023 డిసెంబర్ చివరినాటికి ఎల్ఐసీ అద్భుతమైన ప్రదర్శన నమోదు చేసింది. గ్రూప్ వ్యాపారంలో అనేక రెట్లు వృద్ధి కారణంగా ఎల్ఐసీ ప్రీమియంలు 93.8 శాతం పెరిగి రూ. 11,858.5 కోట్ల నుంచి రూ. 22,981.3 కోట్లకు చేరాయి. 260 లిస్టెడ్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఎల్ఐసీ ఆర్జించిన లాభాలు ఒక సంవత్సరంలో రూ. 2.3 లక్షల కోట్లు పెరిగాయి. ఎల్ఐసీ అప్రతిహతమైన పురోగతిలో ప్రజల, పాలసీదారుల, అన్ని తరగతుల ఉద్యోగుల, ఏజెంట్ల పాత్ర నిరుపమానం. 68 ఏళ్ల జీవిత బీమా సంస్థ ప్రస్థానంలో ప్రభుత్వాల పాత్రకన్నా, సంస్థ పై అచంచలమైన విశ్వాసం ఉంచిన పాలసీదారుల, ప్రజల పాత్ర తిరుగులేనిది.

అదాని గ్రూప్ సంస్థలపై అమెరికన్ షార్ట్ సెల్లర్ 'హిండన్ బర్గ్' తీవ్ర విమర్శలతో ఒక నివేదికను 2023 జనవరిలో ప్రచురించినప్పటి నుండి, అదాని సంస్థల్లో ఎల్ఐసీకి భారీగా పెట్టుబడులు ఉన్నాయనీ, మధ్యతరగతి పొదుపు మొత్తాలకు దానివల్ల ముప్పు ఉందన్న కోణంలో చాలామంది వ్యక్తుల నుంచీ, రాజకీయ పార్టీల నుంచీ ఆందోళన వ్యక్తమైంది. ఇందువల్ల ఎల్ఐసీ వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడింది. అదాని గ్రూప్‌లో ఎల్ఐసీ పెట్టుబడులపై, ఎల్ఐసీకి నష్టం వచ్చిందని జరిగిన ప్రచారంపై ఎల్ఐసీ సంస్థ, ఏఐఐఈఏ (అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం), ఇతర ఉద్యోగ, ఏజంట్ల సంఘాలు బాధ్యతాయుతంగా స్పందించాయి. ఈ ప్రచారం ఊహాత్మకమైనదే తప్ప, నిజమైనది కాదని వీరంతా ఊరూ వాడా నిర్వహించిన ప్రచార కార్యక్రమాల వల్ల ఎల్ఐసీ జైత్రయాత్ర తిరిగి కొనసాగుతోంది.

'ప్రజల సొమ్ము –ప్రజా సంక్షేమం కోసమే' అనే నినాదంతో పని చేస్తూ, 2024 జనవరి 19 నాటికి 68 ఏళ్ళు పూర్తి చేసుకుని దేశీయ బీమా రంగంలో ఎల్ఐసీ అగ్రగామిగా ముందుకు సాగుతోంది. 2023 మార్చి31 నాటికి ఎల్ఐసీ మన దేశ ఆర్థిక వ్యవస్థలో రూ. 43,97,204.59 కోట్ల పెట్టుబడులు పెట్టింది. 1956లో కేవలం రూ. 5 కోట్ల మూలధనంతో ప్రారంభమైన ఎల్ఐసీ, నేడు దాదాపు రూ. 50 లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చుకుంది. ప్రపంచంలో 99 శాతం పైబడి క్లైములను పరిష్కరిస్తూ, నేటికీ నెంబర్ 1 స్థానంలో ఎల్ఐసీ ఉంది.

ఐఆర్‌డీఏ నివేదిక 2022–23 ప్రకారం, గత 23 సంవత్సరాల కాలంలో, ఇప్పటిదాకా ఎఫ్‌డీఐ రూపేణా దేశ జీవిత బీమా రంగంలోకి వచ్చిన పెట్టుబడుల విలువ కేవలం 12



వేల కోట్లు మాత్రమే. దీనిలో అధిక భాగం స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడానికి వినియోగించబడింది తప్ప దేశంలో మౌలిక వసతుల కల్పన కోసం ఈ పెట్టుబడి ఏమాత్రం ఉపయోగపడలేదు. బీమారంగంలో ఎఫ్‌డీఐని 74 శాతానికి పెంచడం, విదేశీ యాజమాన్యాన్ని అనుమతించడం వంటి చర్యలు భారతదేశంలోని ప్రజల విలువైన పొదుపుపై విదేశీ శక్తులకు పట్టు పెంచుతాయి తప్ప, దేశీయ ప్రయోజనాలు నెరవేరవు.

గత ఏడాది ఎల్ఐసీ షేర్ విలువ పడిపోయిందని మీడియాలో హడావుడి జరిగినా, నేడు ఎల్ఐసీ షేర్ విలువ పెరుగుతుండడంతో విమర్శకుల నోళ్ళకు తాళం పడింది. ఎల్ఐసీ వ్యాపార ప్రదర్శనకు, స్టాక్ మార్కెట్‌లో ఎల్ఐసీ షేర్ ధరకు ఎలాంటి సంబంధం లేదు. ఎల్ఐసీ నిజ విలువ, స్టాక్ మార్కెట్‌లో లెక్క కడుతున్న మార్కెట్ కాపిటలైజేషన్ కంటే అనేక రెట్లు ఎక్కువ.

ఎల్ఐసీ వ్యక్తి కాదు, అది ఆర్థికంగా ఒక బలీయమైన శక్తి. అది స్టాక్ మార్కెట్‌లో ఒక దీర్ఘ కాలిక ఇన్వెస్టర్. స్టాక్ మార్కెట్ ఎప్పుడు ఇబ్బందుల్లో పడ్డా, ఎల్ఐసీనే ఆదుకుంది. అదెప్పుడూ ఏ స్టాక్ అయినా తక్కువ ధరలో వున్నప్పుడు కొంటుంది. సమయం కోసం ఎంతకాలమైనా వేచి చూసి మంచి విలువకు స్టాక్స్ అమ్ముతుంది. తెలివిగా, బాధ్యతగా ఉంటూ దేశ ఆర్థిక పరిణామాల పట్ల మంచి అవగాహన కలిగిన ఇన్వెస్ట్ మెంట్ విభాగం ఎల్ఐసీ సొంతం. నష్టాల్లో ఉన్న ఐడీబీఐ బ్యాంకులో 51 శాతం వాటాలు కొని, దాన్ని లాభాల బాట పట్టించింది. తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లో 9.9 శాతం వాటాలు కొని, ఆ బ్యాంక్ షేర్ విలువ పడిపోకుండా కాపాడింది. గత 68 ఏళ్లుగా, లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నా, అవినీతి ఆరోపణల మరకలు లేని సంస్థగా ఎల్ఐసీ కితాబు తెచ్చుకుంది. ఇది అనితర సాధ్యం.

ఎల్ఐసీ ప్రతి ఏడాదీ దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల పాలసీ దారుల సొమ్మును సమీకరించి, దాన్ని ఇన్వెస్టబుల్ సర్‌ప్లస్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి అందిస్తుంది. ఈ మొత్తం ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కర్ణాటక రాష్ట్ర బడ్జెట్‌కు రెండు రెట్లు ఎక్కువ. బీమా రంగంలో కేవలం ఎల్ఐసీ సంస్థకే 'సావరిన్ గ్యారంటీ', అంటే కేంద్ర ప్రభుత్వ గ్యారంటీ ఉంది. ఏ ఇతర ప్రయివేటు బీమా సంస్థకూ ప్రభుత్వ గ్యారంటీ లేదు.

ప్రభుత్వం చెప్తున్న 'ఆత్మ నిర్భర భారత్' సాకారం కావాలన్నా, ఎఐసీ వ్యాపారం మరింత మేర అభివృద్ధి అవ్వాలన్నా ఆర్థిక పొదుపు ఇబ్బడిముబ్బడిగా పెరగాలి. స్టాక్ మార్కెట్లు, బంగారం వైపు కాకుండా, దేశీయ పొదుపు వైపు ప్రజలు ఆకర్షించబడేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి. ప్రజల ఆదాయాలు, నికర పొదుపు పెరగాలి. బీమా రంగం ద్వారా చేసే పొదుపుకు ప్రోత్సాహం ఉండాలి. బీమా ప్రీమియంపై జీఎస్టీ భారాన్ని తొలగించాలి. ఎల్ఐసీ సంస్థకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. అలా చేస్తే దేశ ఆర్థిక స్వావలంబనకు బలం చేకూరడమే గాక, కుటుంబాల దీర్ఘకాలిక అవసరాలు నెరవేరుతాయి.

వ్యాసకర్త ఏఐఐఈఏ ఉపాధ్యక్షులు ı 94417 97900

సత్సంగమం

పూర్వజన్మ పాపపుణ్యాల మేరకు ఈ జన్మలో ఫలితాలు అనుభవించక తప్పదని హిందువుల విశ్వాసం. ఈ జన్మలో మనం చేసే కార్యాలకు, మనకు లభించే ఫలితాలకూ గత జన్మలోని పాపపుణ్యాలతో సంబంధం ఉంటుందని దీని అర్థం. ఈ జన్మలో మనకు సమకూరే భూమి, ఇల్లు, భార్య, సంతతి, విద్య, బుద్ధి, మంచి వారితో పయనించడం వంటి వన్నీ గత జన్మ పాపపుణ్యాల మీదే ఆధారపడి ఉంటాయని హిందూ ధర్మశాస్త్రాలూ, ఇతిహాస పురాణాలూ



చెబుతున్నాయి. ఈ బోధనలన్నీ ఈ జన్మలో మనుషులు సమాజ నియమాలు దాటి అధర్మ మార్గంలో పయనించకుండా ఉండటానికి ఉపకరిస్తున్నాయి. సత్సంగమం ఎప్పుడూ మనకు మేలే చేస్తుందనీ, సాధువులను దర్శించాలనీ, విజ్ఞులతో సహవాసం చేయాలనీ మన పూర్వులు చెప్పిన మాటలు అనుభవ పూర్వకంగా చెప్పినవే తప్ప ఏదో చెప్పాలని చెప్పినవి కావు. సర్వసంగ పరిత్యాగులైన సాధుజనులు భగవంతుని మాత్రమే ధ్యానిస్తూ ఇహలోక సుఖాలను పట్టించుకోకపోవడానికి కారణం దైవ భక్తి వారికిస్తున్న అమితమైన ఆనందమే. వారి బోధనలు వినడం, వారిలాంటి వారితో తిరగడం వల్ల మనకు మంచే జరుగుతుంది కానీ కీడు సంభవించదు.

మనమెంత చెడ్డవాళ్లమైనా మనకున్న మంచి పరిచయాలూ, సత్సంగమాల వల్ల కొంత కాలానికి మనలోనూ మార్పువస్తుంది. అయితే ఇందుకు ఎంత సమయం పడుతుందనేది చెప్పలేం. మనలో ఉండే మంచిని గ్రహించే అణకువ, సామర్థ్యాలే మనం త్వరగా సన్మార్గంలోకి మారడానికి హేతువులవుతాయి. దేవునియందు భయ, భక్తులు కలిగినవారు సమాజ హితానికీ, ధర్మానికీ వ్యతిరేకంగా పయనించలేరు. కాబట్టి దేవునిపై భక్తికలిగి ఉంటే ఆయనే మనల్ని నడిపిస్తాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.పంచమి రా.2.24 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** చిత్త ఉ.7.34 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ప.1.34 నుండి 3.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.15 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, **అమృత ఘడియలు:** రా.11.53 నుండి 1.34 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.24, **సూర్యాస్తమయం:** 6.02.

క్లుప్తంగా...

ఏప్రిల్ 17న శ్రీ సీతారాముల కల్యాణం

- భద్రాద్రిలో ఏప్రిల్ 9న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

భద్రాచలంటౌన్ (భద్రాద్రి కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీసీతా రామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీరామనవమి నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 9న ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 17న శ్రీ సీతారాముల కల్యాణం(శ్రీరామనవమి), 18న స్వామివారికి మహా పట్టాభిషేకం ఉంటాయని ఆలయ ఈఓ రమాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 9 నుంచి 13వ తేదీ వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. 14న గరుడధ్వజపటలేఖనం, 15న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, బలిసమర్పణ, హనుమంత వాహనసేవ, 16న గరుడ వాహన సేవ ఉంటాయని వివరించారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జులకు నిధుల కేటాయింపుపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: దుబ్బాక నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జికి కేటాయించడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణాళికా, ఆర్థిక, పంచాయతీరాజ్ శాఖల ముఖ్య కార్యదర్శులతో పాటు సిద్దిపేట్ కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధులను కాంగ్రెస్ ఇన్‌చార్జిలకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దుబ్బాక మండలం తిమ్మాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు రామవరం మాధవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టారు.

జ్వరంతో చికిత్స పొందుతూ గిరిజన విద్యార్థిని మృతి

- వసతిగృహ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ జిల్లా మామిడిగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి తొడసం మహేశ్వరి (12) బుధవారం రాత్రి జ్వరంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆదివాసీ సంఘాల నాయకులు రిమ్స్‌కు చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి ఎదుట గల జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మహేశ్వరి కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురికాగా వసతి గృహ యాజమాన్యం కనీసం చికిత్స చేయించలేదని, సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఆ బాలిక మృతి చెందిందని ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రధానోపాధ్యాయుడిని, ఏటీడీవోను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ ఘటన స్థలికి చేరుకుని విచారణ చేపట్టి బాలిక కుటుంబానికి న్యాయం చేస్తామని హామీనివ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సైకిల్‌పై బాలింత తరలింపు

- వైద్యం అందక శిశువు మృతి



మడకం బుద్రు

వెంకటాపురం(ఎం): బిడ్డ పుట్టిందన్న ఆనందం ఆవిరైపోయింది. ఆస్పత్రికి తల్లి, బిడ్డను తరలించకపోవడం, వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో.. ఊపిరి పోసుకుని 24 గంటలు గడవకముందే ఆ శిశువు కన్నుమూసింది. మరోవైపు అనారోగ్యానికి గురైన బాలింతను ఏడు కిలోమీటర్ల అటవీ మార్గంగుండా సైకిల్‌పై తరలించాల్సి వచ్చింది. ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలం రోలుబండ గొత్తికోయగూడెంలో జరిగిన ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. మండల కేంద్రానికి 7 కిలోమీటర్ల దూరంలోని రోలుబండ గొత్తికోయగూడెంలో ఈనెల 25న మడకం బుద్రు అనే గర్భిణి శిశువుకు జన్మనిచ్చింది. ప్రసవానంతరం తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నప్పటికీ.. మర్నాడు శిశువు ఆకస్మికంగా మృతి చెందింది. ప్రసవానంతరం తల్లి, బిడ్డను వైద్యం కోసం ఆస్పత్రికి తరలిస్తే శిశువు బతికి ఉండేదని స్థానికులు అభిప్రాయపడ్డారు. స్థానిక వైద్యసిబ్బందికి సమాచారం అందినప్పటికీ పట్టించుకోకపోవడంతో శిశువు మృతి చెందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం బుద్రు సైతం ఆనారోగ్యానికి గురి కావడంతో ఆమె భర్త మడకం భీమా.. అటవీప్రాంతం నుంచి సైకిల్‌పై బుద్రును తీసుకొని 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి తీసుకొచ్చాడు. అక్కడినుంచి 108లో ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్‌ను సాక్షి వివరణ కోరగా నెలలు నిండకముందే శిశువుకు జన్మనివ్వడంతో మృతి చెందినట్లు తెలిపారు. ములుగు జిల్లా ఆసుపత్రిలో డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో బుద్రుకు మెరుగైన వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. గూడెంలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

మామునూరుకు పెద్ద విమానాలు!

వరంగల్‌లో పూర్తిస్థాయి విమానాశ్రయాన్నే ప్రారంభించాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ నిర్ణయం

- కేంద్ర ప్రభుత్వ సూచనకు అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం
- అన్నీ అనుకున్నట్లు జరిగితే ఏడాదిన్నరలోపే సిద్ధం కానున్న మామునూరు ఎయిర్‌పోర్టు
- ఇప్పటికే అక్కడ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ వద్ద 696 ఎకరాలు
- మరో 253 ఎకరాల కోసం త్వరలో భూసేకరణ
- '150 కి.మీ. నిబంధన'పై జీఎంఆర్‌తో చర్చల కోసం త్వరలో కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: వరంగల్ విమానాశ్రయాన్ని పెద్ద విమానాల ఆపరేషన్‌తోనే ప్రారంభించాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిర్ణయించింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సమ్మతించడంతో ఆ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీలైనంత త్వరలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. అవరోధంగా ఉన్న రెండు ప్రధాన అంశాలను వెంటనే కొలిక్కి తెచ్చేలా త్వరలో రాష్ట్ర ప్రభుత్వం-పౌరవిమానయాన శాఖ మధ్య ఒప్పందం కుదరనుంది. విమానాశ్రయం నిర్మాణానికి కావాల్సిన భూమిని సేకరించే పనిని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుండగా 150 కి.మీ. నిడివిలో మరో విమానాశ్రయం ఉండకూడదన్న అంశాన్ని అధిగమించేలా హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్మించిన జీఎంఆర్‌తో పౌర విమానయాన శాఖ చర్చలు జరపనుంది. ఈ రెండు కీలక ప్రక్రియలు పూర్తయితే ఏడాదిన్నరలోపే విమానాశ్రయాన్ని సిద్ధం చేయాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ భావిస్తోంది. ఈ ప్రక్రియలు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉండగా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఆలస్యం జరిగింది.

ఇప్పటికే ఓ పెద్ద రన్‌వే, మరో చిన్న రన్‌వే..

రాష్ట్రంలో ప్రస్తుతం హైదరాబాద్ విమానాశ్రయమే అందుబాటులో ఉంది. బేగంపేటలోని పాత విమానాశ్రయం కేవలం ప్రముఖుల ప్రత్యేక విమానాల నిర్వహణకే పరిమితమైంది. దీంతో రెండో విమానాశ్రయం వెంటనే అవసరమని నిర్ణయించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వరంగల్ విమానాశ్రయానికి చర్యలు చేపట్టింది. దాంతోపాటు ఆదిలాబాద్, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, కొత్తగూడెంలోని పాల్వంచ, మహబూబ్‌నగర్‌లోని దేవరకద్రలలో మరో ఐదు విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. మిగతా వాటి విషయంలో జాప్యం జరిగే పరిస్థితి ఉండటంతో వరంగల్ విమానాశ్రయాన్ని వెంటనే నిర్మించాలని చర్చల సందర్భంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గతంలోనే నిర్ణయించాయి. వరంగల్ శివారులోని మామునూరులో నిజాం కాలంలో ఎయిర్‌స్ట్రిప్ అందుబాటులో ఉండేది. అక్కడ 1,400 మీటర్ల పొడవైన రన్‌వే, గ్లైడర్స్ దిగేందుకు మరో చిన్న రన్‌వే ఉంది. దశాబ్దాలుగా వాటి వినియోగం లేకపోవటంతో అవి బాగా దెబ్బతిన్నాయి. ఇప్పటికీ ఆ పాత ఎయిర్‌స్ట్రిప్‌కు చెందిన 696 ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ అధీనంలోనే ఉంది. అక్కడే ఇప్పుడు కొత్త విమానాశ్రయాన్ని నిర్మించబోతున్నారు. పెద్ద విమానాశ్రయం నిర్మాణమంటే ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున చిన్న విమానాలు ఆపరేట్ చేసేలా ప్రస్తుతానికి చిన్న రన్‌వేతో చిన్న విమానాశ్రయాన్ని నిర్మించాలని గతంలో భావించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా దాన్ని విస్తరిస్తూ పోవాలని అప్పట్లో నిర్ణయించారు. కానీ



ఒకేసారి పెద్ద విమానాలను ఆపరేట్ చేసే పూర్తిస్థాయి విమానాశ్రయాన్నే నిర్మించాలని తాజాగా ఖరారు చేశారు. ఇటీవల కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన చర్చల్లో ఈ అంశం కొలిక్కి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే ఉద్దేశంతో ఉండటంతో దీనికి మార్గం సుగమమవుతోంది.

అదనపు భూసేకరణకు రంగం సిద్ధం..

అందుబాటులో ఉన్న భూమికి అదనంగా 253 ఎకరాలు కావాలని అథారిటీ ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అక్కడికి చేరువలోనే పశుసంవర్థక శాఖకు చెందిన స్థలం అందుబాటులో ఉండటంతో దాన్ని సేకరించనున్నారు. ఒక గ్రామాన్ని తరలించాల్సి ఉంటుంది. త్వరలో గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలకు వివరించనున్నట్టు సమాచారం.

విమానాశ్రయం వస్తే వరంగల్‌కు మరిన్ని పెట్టుబడులు..

హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరంగా వరంగల్ విస్తరిస్తోంది. దాన్ని ఐటీ, ఇతర పరిశ్రమల స్థాపనతో వేగంగా అభివృద్ధి చేయాల్సి ఉందని చాలా ఏళ్లుగా నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవలే కాజీపేట శివారులో కొన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. మరింత వేగంగా పారిశ్రామీకరణ జరగాలంటే భారీ ఎత్తున పెట్టుబడులు అవసరం. పెట్టుబడులు రావాలంటే స్థానికంగా విమానాశ్రయం ఉండాలన్నది పారిశ్రామికవేత్తల అభిప్రాయం. ప్రస్తుతం హైదరాబాద్‌కు వరంగల్ 135 కి.మీ. దూరంలో ఉంది. వరంగల్ చేరుకోవాలంటే హైదరాబాద్‌లో విమానం దిగి దాదాపు మూడు గంటలు ప్రయాణం చేయాల్సి ఉంది. ఇది పెట్టుబడులకు కొంత ఆటంకంగా ఉందని ప్రభుత్వం గుర్తించింది. వరంగల్‌లోనే నేరుగా ల్యాండ్ అయ్యే ఏర్పాటు ఉంటే వేగంగా పెట్టుబడులు వస్తాయని తేల్చారు. ఇదే విషయాన్ని జీఎంఆర్ దృష్టికి తీసుకెళ్లి ఒప్పించాలని కేంద్రరాష్ట్రప్రభుత్వాలు భావిస్తున్నాయి. హైదరాబాద్ విమానాశ్రయాన్ని జీఎంఆర్ సంస్థ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అక్కడికి 150 కి.మీ. నిడివిలో మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదన్నది కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలతో ఆ సంస్థకు ఉన్న ఒప్పందం చెబుతోంది. ఈ నిబంధన ఇప్పుడు వరంగల్ విమానాశ్రయానికి అడ్డంకిగా మారుతోంది. దీన్ని అధిగమించేందుకు ఇందుకు త్వరలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, కేంద్ర ప్రభుత్వం నుంచి ముగ్గురు ప్రతినిధులు ఇందులో ఉంటారని సమాచారం. ఈ కమిటీ సభ్యులు జీఎంఆర్‌తో సంప్రదింపులు జరిపి ఈ సమస్యను కొలిక్కి తేనున్నారు.

మార్ఫింగ్ చేసి అశ్లీల ఫొటోలు

- లోన్‌యాప్ నిర్వాహకుల దురాగతం
- మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న యువకుడు



సాయిరాజ్

సిరిసిల్ల క్రైం: యాప్ ద్వారా తీసుకున్న లోన్ చెల్లించకుంటే ఫొటోలు మార్ఫింగ్ చేసి బంధువులు, స్నేహితులకు పంపిస్తామని గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించడంతో మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన చిప్ప సాయిరాజ్ (28) అవసరాల కోసం ఆన్‌లైన్‌లో లోన్ యాప్ ద్వారా ఇటీవల కొంత రుణం తీసుకున్నాడు. ఎంతరుణం తీసుకున్నాడనే విషయంపై స్పష్టత లేదు. అయితే తీసుకున్న డబ్బులు సకాలంలో చెల్లించకపోవడంతో అశ్లీల, మార్ఫింగ్ చేసిన ఫొటోలను స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంపుతామని గుర్తుతెలియని వ్యక్తులు సాయిరాజ్‌ను ఫోన్‌ద్వారా బెదిరించారు. చేతిలో డబ్బు లేక, లోన్ ఎలా తీర్చాలో అర్థంగాక సాయిరాజ్ రెండు రోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లిపోయాడు. కొద్దిగంటల్లోనే లోన్ యాప్ నిర్వాహకులు సాయిరాజ్ ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి కొందరు స్నేహితులు, కుటుంబసభ్యులకు పంపించారు. దీంతో కుటుంబసభ్యులు సాయిరాజ్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా స్విచాఫ్ వచ్చింది. పోలీసుల సాయంతో మంగళవారం సెల్ సిగ్నల్ ఆధారంగా కొదురుపాక ఏరియాలో లొకేషన్ గుర్తించారు. అక్కడి హోటల్‌లో యువకుడి గురించి ఆరా తీయగా, ఆ హోటల్‌లో బిర్యానీ తిన్నట్టుగా తెలిసింది. దీంతో సమీప మధ్యమానేరు డ్యాం పరిసరాల్లో గాలించారు. అక్కడ బైక్ కనిపించడంతో డ్యాంలో దూకి ఉంటాడని అనుమానించారు. అయితే, అప్పటికే రాత్రి కావడంతో వెనుదిరిగారు. బుధవారం ఉదయం ఓ మృతదేహం మిడ్‌మానేర్‌లో ఉందని సమాచారం అందడంతో కుటుంబసభ్యులు వెంటనే అక్కడకు వెళ్లి.. ఆ మృతదేహం సాయిరాజ్‌దిగా గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఏడాది క్రితం మేనమరదలితో వివాహం జరిగింది. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందగా ఇద్దరు అక్కలు ఉన్నారు.

మనవడిని చంపిన నానమ్మకు జీవిత ఖైదు

- కోడలిని చంపిన అభియోగంపై కొడుకు జైలుకు
- మనవడిని భారంగా భావించి కాల్వలోకి తోసేసిన వైనం
- చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవించే వృద్ధురాలి నిర్వాకం

కమ్మర్‌పల్లి(బాల్కొండ): మూడున్నరేళ్ల వయసున్న మనవడిని వరద కాలువలోకి తోసి హత్య చేసిన ఓ నానమ్మకు జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ కోర్టు జడ్జి సునీత కుంచాల బుధవారం తీర్పు వెలువరించారు. కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలిలా.. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ కాలనీకి చెందిన గంగవ్వకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. గంగవ్వ భర్త చాలా ఏళ్ల క్రితమే మరణించాడు. ఆమె చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవించేది. పెద్ద కుమారుడు గంగాధర్ తన భార్య గంగామణి తలపై ఇటుకతో కొట్టి చంపాడన్న అభియోగంతో జైలు పాలయ్యాడు. దీంతో మనవడు లక్కీ పోషణ బాధ్యత గంగవ్వపై పడింది. 70 ఏళ్ల వయసులో తనను తాను పోషించుకోవడమే కష్టంగా భావించిన గంగవ్వ.. అదనపు భారంగా మారిన మనవడిని అడ్డు తొలగించుకోవాలనుకుంది. 2023 మే 10న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చిత్తు కాగితాలు ఏరుకోవడానికి మనువడిని వెంట తీసుకెళ్లి, గ్రామ శివారులోని ఎస్సారెస్పీ వరద కాలువలోకి తోసేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారించారు. గంగవ్వ నేరం నిరూపితం కావడంతో జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల బుధవారం తీర్పు ఇచ్చారు. నిందితురాలికి జీవిత ఖైదు విధించారు.

కాంగ్రెస్‌కు మరో 3 మున్సిపాలిటీలు

జగిత్యాల, నారాయణఖేడ్, భువనగిరి మున్సిపాలిటీలు హస్తగతం



అడువాల జ్యోతి
జగిత్యాల



ఆనంద్ స్వరూప్
నారాయణఖేడ్



వెంకటేశ్వర్లు
భువనగిరి

జగిత్యాల/నారాయణఖేడ్/సాక్షి, యాదాద్రి: జగిత్యాల, నారాయణఖేడ్, భువనగిరి మున్సిపాలిటీలు కాంగ్రెస్ వశమయ్యాయి. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం బుధవారం సమావేశం ఏర్పాటు చేయగా.. 47 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరయ్యారు. చైర్‌పర్సన్ స్థానానికి బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్ సమిండ్ల వాణిని పార్టీ ప్రతిపాదించింది. రెబల్ అభ్యర్థిగా కౌన్సిలర్ అడువాల జ్యోతి పోటీ పడ్డారు. జ్యోతికి కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరుగురు, బీజేపీ కౌన్సిలర్లు ముగ్గురు, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 8 మంది, స్వతంత్రులు ఐదుగురు, ఎంఐఎం, ఏఐఎఫ్‌బీ పార్టీలకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు అనుకూలంగా ఓటు వేశారు. బీఆర్‌ఎస్ ప్రతిపాదించిన సమిండ్ల వాణికి 22 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఓటు వేశారు. ఒకే ఒక్క ఓటు తేడాతో జ్యోతి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. కాగా, చైర్‌పర్సన్‌గా ఎన్నికైన జ్యోతి కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లడం మున్సిపల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాలిటీ సైతం కాంగ్రెస్ వశమైంది. బుధవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో కాంగ్రెస్‌కు చెందిన ఆనంద్ స్వరూప్ షెట్కార్ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా దారం శంకర్ ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ వసంతకుమారి ప్రకటించారు. మొత్తం 15 మంది కౌన్సిలర్లకుగాను బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా.. కాంగ్రెస్ మద్దతుదారులైన కౌన్సిలర్ల సంఖ్య 11కు చేరింది. ఎనిమిదిమంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన ముగ్గురు కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిపి మొత్తం 12 మంది హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్‌కు సంబంధించి ఒక్కో దరఖాస్తు రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు.

అలాగే భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ పదవి కాంగ్రెస్ కైవసం చేసుకుంది. వైస్ చైర్మన్ పదవి కూడా బీజేపీ ఖాతాలో చేరింది. కాంగ్రెస్‌కు చెందిన పోతంశెట్టి వెంకటేశ్వర్లు చైర్మన్‌గా, బీ జేపీకి చెందిన మాయ దశరథ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు పదవిలో ఉన్న బీఆర్‌ఎస్‌కి చెందిన చైర్మన్, వైస్‌చైర్మన్‌పై జనవరి 23న అవిశ్వాసం పెట్టగా నెగ్గింది. దీంతో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం బుధవారం మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికకు 29 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడి హోదాలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. చైర్మన్ పదవికి కాంగ్రెస్ నుంచి పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ నుంచి బొర్ర రాకేష్ పోటీలో నిలిచారు. రాకే ష్‌కు మద్దతుగా బీజేపీకి చెందిన ఐదుగురు సభ్యులు మా త్రమే చేతులెత్తారు. పోతంశెట్టి వెంకటేశ్వర్లుకు మద్దతుగా 11 మంది కాంగ్రెస్ సభ్యులు, ముగ్గురు బీఆర్‌ఎస్, ఒక ఇండిపెండెంట్, ఒక బీజేపీ కౌన్సిలర్ చేతులెత్తారు. దీంతో చైర్మన్‌గా వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

రోడ్డెక్కిన సిరిసిల్ల నేతన్నలు

- వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్



సిరిసిల్లలో ఆందోళన చేస్తున్న నేతన్నలు

సిరిసిల్ల: వస్త్రాల ఉత్పత్తికి ప్రసిద్ధిగాంచిన సిరిసిల్లలో నేతన్నలు రోడ్డెక్కారు. నేత కార్మికులు, ఆసాములకు పని కల్పించాలని, ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని కోరుతూ ఆందోళనకు దిగారు. బుధవారం సిరిసిల్ల నేతన్న విగ్రహానికి పూల మాలలు వేసి, అంబేడ్కర్ సర్కిల్‌లో 'నేతన్నల ఆకలి కేక- మహాధర్నా'ను నిర్వహించారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు గతంలోలాగే ఆర్డర్లు ఇచ్చి, పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.482 కోట్ల బకాయిలను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలోనే అత్యధికంగా పవర్‌లూమ్స్ (మరమగ్గాలు) ఉన్న సిరిసిల్లలో 70 శాతం మేరకు సాంచాలు బంద్ అయ్యాయని ఆసాములు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరిపెల్లి సీతారాములు డిమాండ్ చేశారు. నేతన్నలు ఇబ్బందుల్లో ఉంటే.. ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే కేటీఆర్ పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా నేతన్నలను ఆదుకోడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటే.. గతంలో లాగే వస్త్రోత్పత్తి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్, రాష్ట్ర కార్యదర్శి మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులో నీరు అడుగంటుతోంది. ఆయకట్టులో యాసంగి పంటలు పండించే రైతులకు కష్టాలు తప్పడం లేదు. ప్రాజెక్టులో గత ఏడాది కంటే పది అడుగుల నీటిమట్టం పడిపోవడంతో కాలువలకు నీరందడం లేదు. బావుల ద్వారా కొందరు రైతులు పంటలు సాగు చేస్తుండగా, చెరువులు, కాలువ నీటిపై ఆధారపడ్డ వారికి తిప్పలు తప్పడం లేదు. కడెం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన రైతులు పంటలు కాపాడుకునేందుకు కడెం కుడి కాలువకు నీరందేలా నాలుగు రోజులుగా ప్రాజెక్ట్‌లో కాలువ తీస్తున్నారు.

– కడెం



రోడ్డు ప్రమాదాల్లో 8 మంది మృతి

- సూర్యాపేట జిల్లాలో ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఐదుగురు మృతి
- మృతులందరూ వ్యవసాయ కూలీలే
- సిద్దిపేట జిల్లాలో కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు దుర్మరణం



నారాయణమ్మ



నాగమ్మ



సౌభాగ్యమ్మ



అనసూర్య

మునగాల, మోతె (కోదాడ)/నంగునూరు (సిద్దిపేట): సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లో బుధవారం జరిగిన రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. వివరాలిలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రం శివారులో ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మునగాల మండలం విజయరాఘవపురం గ్రామానికి చెందిన పది మంది, రేపాల గ్రామానికి చెందిన ఇద్దరు మహిళా వ్యవసాయ కూలీలు మోతె మండలం హుస్సేనాబాద్‌లోని మిర్చి తోటలో కాయలు ఏరేందుకు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో ఖమ్మం జిల్లా మధిర నుంచి హైదరాబాద్‌వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు మోతె శివారులో యూటర్న్ తీసుకునే క్రమంలో ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయరాఘవపురం గ్రామానికి చెందిన కందుల నాగమ్మ(55), చెవుల నారాయణమ్మ(56), రేపాల గ్రామానికి చెందిన పోకల అనసూర్య (65) తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. విజయరాఘవపురానికి చెందిన రెమిడాల సౌభాగ్యమ్మ(75) సూర్యాపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. విజయరాఘవపురం గ్రామానికి చెందిన కందుల గురువయ్య (65)ను హైదరాబాద్‌కు తరలించగా అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. రేపాల గ్రామానికి చెందిన సొంపంగు లక్ష్మి తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. విజయరాఘవపురం గ్రామానికి చెందిన కత్తి విజయమ్మ, పాలపాటి మంగమ్మ సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ పవన్‌తో పాటు మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. కోదాడ డీఎస్పీ ఎం.శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ డి.రామకృష్ణారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సిద్దిపేట జిల్లాలో ముగ్గురు మృతి



రవి



అయిలయ్య



మమత

కారు బైకును ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ వద్ద జరిగింది. కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన జక్కుల అనిల్, భార్య మమత, అతని బావమరిది బాబురాజు, భార్య కీర్తన, పిల్లలు చరణ్, భానుప్రసాద్, వైష్ణవి, హన్విక, నాన్సి, ప్రణయ్‌తో కలసి హుస్నాబాద్‌లో జరిగిన బంధువుల పెళ్లికి కారులో వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొట్టి రోడ్డు కిందకు ఈడ్చుకెళ్లింది. దీంతో పక్కనే ఉన్న కాల్వలో బైక్, కారు పడిపోయాయి. ఈ ప్రమాదంలో బద్దిపడగకు చెందిన కట్ట రవి (55), నాగరాజుపల్లికి చెందిన ముక్కెర అయిలయ్య (58), జక్కుల మమత (28) అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా వారిలో బాబురాజు పరిస్థితి విషమంగా ఉండగా గాయాలపాలైన చిన్నారులను సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు వచ్చి కారులో ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. సిద్దిపేట రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాతృత్వానికి దూరం.. దూరం!

దక్షిణ కొరియాలో వింత పరిస్థితి

- నానాటికీ తగ్గుతున్న జననాల రేటు
- పిల్లల్ని కనేందుకు స్త్రీల విముఖత
- కెరీర్, లింగవివక్షే ప్రధాన కారణాలు

ఆమె పేరు యెజిన్. టీవీ యాంకర్. ఓ సాయం వేళ స్నేహితురాళ్లతో సరదాగా గడుపుతుండగా మొబైల్‌లో ఓ పాపులర్ మీమ్ ప్రత్యక్షమైంది. 'మాలా మీరూ అంతరించిపోకముందే జాగ్రత్త పడండి' అని ఓ కార్టూన్ డైనోసార్ హితబోధ చేయడం దాని సారాంశం. దాంతో వారందరి మొహాల్లోనూ విషాద వీచికలు. 30 ఏళ్లు దాటుతున్నా వారెవరికీ ఇంకా పిల్లల్లేరు మరి! వారే కాదు, దక్షిణ కొరియాలో చాలామంది మహిళలు పిల్లల్ని కనడం లేదు. మాతృత్వానికి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంటున్నారు. అక్కడి సమాజంలోని సంక్లిష్టతే ఇందుకు ప్రధాన కారణం...! మహిళల అక్షరాస్యతలో దక్షిణ కొరియా చాలా ముందుంది. దాంతో ఆడవాళ్లలో అత్యధికులు ఉద్యోగులే. ఇంటిపట్టున ఉండేవారు చాలా తక్కువ. అయితే అక్కడ ఏ రంగంలోనైనా పని ఒత్తిళ్లు విపరీతంగా ఉంటాయి. సుదీర్ఘ పనిగంటలు. పైగా తరచూ ఓవర్ టైమ్ చేయడం తప్పనిసరి. నిరాకరిస్తే ఆ ప్రభావం ప్రమోషన్లతో పాటు చాలారకాలుగా పడుతుంది. దాంతో విపరీతంగా అలసిపోయి ఇంటికొచ్చే భర్తలు పిల్లల బాధ్యతలను అస్సలు పంచుకోరు. పైగా వేతనాలతో పాటు చాలా అంశాల్లో మితిమీరిన లింగ వివక్ష. దీనికి తోడు గర్భం దాల్చే ఉద్యోగినులను రాజీనామా చేసేలా కంపెనీలు ఒత్తిడి చేయడం సర్వసాధారణం. దాంతో పిల్లల్ని కనే క్రమంలో కెరీర్ ఒకసారి వెనకబడితే తిరిగి కోలుకోవడం చాలా కష్టం. అదీగాక దక్షిణ కొరియాలో జీవన వ్యయం చాలా ఎక్కువ. ఒక్కరి సంపాదనతో ఇల్లు గడవడం కష్టం. ఇన్ని ప్రతికూలతల మధ్య పిల్లల్ని కని, సజావుగా పెంచేందుకు కావాల్సిన సమయం, ఓపిక, కుటుంబ మద్దతు మహిళలకు ఏ మాత్రమూ ఉండటం లేదు. పిల్లలు, కెరీర్‌లో ఏదో ఒక్కదాన్నే ఎంచుకోక తప్పని అనివార్య పరిస్థితి. అత్యధికులు రెండో ఆప్షన్‌కే ఓటేస్తున్నారు. అలా మొత్తంగా మాతృత్వానికే దూరమవుతున్నారు!

అట్టడుగుకు జననాల రేటు

ప్రపంచవ్యాప్తంగా సంపన్న దేశాలన్నింట్లోనూ చాలాకాలంగా జనాభా క్రమంగా తగ్గుతూ వస్తోంది. కానీ దక్షిణ కొరియాలో ఈ ధోరణి మరీ ప్రమాదకరంగా ఉంది. నిజానికి అతి తక్కువ జననాల రేటు విషయంలో 20 ఏళ్లుగా ఆ దేశానిదే ప్రపంచ రికార్డు! పైగా అది ఏటికేడు మరింతగా తగ్గుతూ వస్తోంది. తాజాగా బుధవారం విడుదలైన గణాంకాలైతే ప్రమాద ఘంటికలే మోగిస్తున్నాయి. 2023లో అక్కడ జననాల రేటు (ఒక మహిళ జీవిత కాలంలో కనే పిల్లల సంఖ్య) 8 శాతం తగ్గి కేవలం 0.73గా నమోదైంది. ఇదిలాగే కొనసాగితే 2100 నాటికి దేశ జనాభా సగానికి సగం తగ్గిపోనుంది. దాంతో ఈ పరిణామాన్ని జాతీయ ఎమర్జెన్సీగా ప్రభుత్వం ప్రకటించింది!

ఫలించని ప్రోత్సాహకాలు...

పిల్లల్ని కనేలా జనాలను ప్రోత్సహించేందుకు దక్షిణ కొరియాలో ప్రభుత్వాలు చేయని ప్రయత్నాల్లేవు. నగదు ప్రోత్సాహకం, ఇంటి కొనుగోలుపై సబ్సిడీ, పిల్లలను చూసుకునేందుకు ఉచితంగా ఆయా సదుపాయం వంటివెన్ని ప్రకటించినా లాభముండటం లేదు. మహిళలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పరిష్కరించనంత కాలం ఇటువంటి పథకాలు ఎన్ని తెచ్చినా ఒరిగేదేమీ ఉండబోదని సామాజికవేత్తలు అంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ప్రభుత్వ ప్రకటనల్లో చైనా జెండానా?

మన దేశాన్ని, మన అంతరిక్ష పరిశోధకులను డీఎంకే ప్రభుత్వం అవమానించింది

- మన జాతీయ జెండాను ముద్రించడానికి వారికి మనసు రాలేదు
- ఇండియా ఘనతలను ప్రపంచానికి చాటడం డీఎంకేకు ఇష్టం లేదు
- కేంద్ర ప్రభుత్వ పథకాలపై సొంత ముద్రలు వేసుకుంటోంది
- తమిళనాడులో డీఎంకే సర్కారుపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

సాక్షి, చెన్నై: మన దేశాన్ని, దేశభక్తులైన మన అంతరిక్ష పరిశోధకులను తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం ఘోరంగా అవమానించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. తమిళనాడులోని కులశేఖరపట్నంలో 'ఇస్రో' రాకెట్ లాంచ్‌ప్యాడ్ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా పత్రికల్లో డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రకటనలో రాకెట్‌పై చైనా జాతీయ జెండాను ముద్రించడాన్ని ఆయన తప్పుపట్టారు. డీఎంకే ప్రభుత్వం ప్రజల కోసం చేసిందేమీ లేదని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై సొంత ముద్రలు వేసుకుంటోందని ఆరోపించారు. పనులేవీ చేయకున్నా తప్పుడు దారుల్లో క్రెడిట్ కొట్టేయాలని చూస్తోందని విమర్శించారు. డీఎంకే నేతలు హద్దులు దాటారని, ఇస్రో లాంచ్‌ప్యాడ్‌ను తమిళనాడుకు తామే తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకోవడానికి ఆరాటపడుతున్నారని విమర్శించారు. భారత జాతీయ జెండాను ముద్రించడానికి వారికి మనసొప్పలేదని ఆక్షేపించారు. ప్రజల సొమ్ముతో ఇచ్చిన ప్రకటనల్లో చైనా జెండా ముద్రించడం ఏమిటని మండిపడ్డారు. దేశ ప్రగతిని, అంతరిక్ష రంగంలో ఇండియా సాధించిన విజయాలను ప్రశంసించడానికి డీఎంకే సిద్ధంగా లేదని అన్నారు. ఇండియా ఘనతలను ప్రశంసించడం, ప్రపంచానికి చాటడం డీఎంకేకు ఎంతమాత్రం ఇష్టం లేదని ధ్వజమెత్తారు. డీఎంకేను తమిళనాడు ప్రజలు కచ్చితంగా శిక్షిస్తారన్నారు. ప్రధాని మోదీ బుధవారం తమిళనాడులో పర్యటించారు. తూత్తుకుడిలో రూ.17,300 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మరికొన్నింటిని జాతికి అంకితం చేశారు. కులశేఖరపట్నంలో రూ.986 కోట్ల ఇస్రో లాంచ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం తిరునల్వేలిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ కొత్త ప్రాజెక్టులు 'అభివృద్ధి చెందిన భారత్' రోడ్‌మ్యాప్‌లో ఒక ముఖ్య భాగమని అన్నారు. అభివృద్ధిలో తమిళనాడు నూతన అధ్యాయాలను లిఖిస్తోందని చెప్పారు. కేంద్రం చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు.

పదేళ్ల ట్రాక్ రికార్డు.. వచ్చే ఐదేళ్ల విజన్



అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసే విషయంలో డీఎంకే సర్కారు కేంద్ర ప్రభుత్వానికి సహకరించడం లేదని మోదీ విమర్శించారు. అయోధ్య రామమందిర అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరిగినప్పుడు డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారని అన్నారు. ప్రజల విశ్వాసాలంటే ఆ పార్టీ ద్వేషమని మరోసారి రుజువైనట్లు చెప్పారు. తమిళనాడు అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. తమిళనాడుకు చెందిన ఎల్.మురుగన్‌ను కేంద్ర మంత్రిగా నియమించామని, హిందీ రాష్ట్రమైన మధ్యప్రదేశ్ నుంచి ఆయనను రాజ్యసభకు పంపించామని గుర్తుచేశారు. కాంగ్రెస్, డీఎంకే పార్టీలకు ప్రజల కంటే వారసత్వ రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు. ఆ పార్టీల నేతలు సొంత పిల్లల అభివృద్ధి గురించి ఆరాటపడతుంటే తాము మాత్రం ప్రజలందరి పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. 'వికసిత్ భారత్' నిర్మాణమే తమ ధ్యేయమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. పరిపాలనలో తనకు పదేళ్ల ట్రాక్ రికార్డు ఉందని, రాబోయే ఐదేళ్లకు అవసరమైన విజన్ ఉందని వ్యాఖ్యానించారు.



వివాదానికి దారి తీసిన డీఎంకే ప్రభుత్వ ప్రకటన

దేశంలోనే తొలి గ్రీన్ హైడ్రోజన్ వాటర్ క్రాఫ్ట్

దేశంలోనే తొలి గ్రీన్ హైడ్రోజన్ ఇంధన సెల్ దేశీయ వాటర్ క్రాఫ్ట్‌ను తూత్తుకుడి వేదికగా ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించారు. వీఓ చిదంబరనార్ ఓడరేవు ఔటర్ పోర్ట్ కార్గో టెర్మినల్‌కు శంకుస్థాపన చేశారు. 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 75 లైట్‌హౌస్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. తమిళనాడు ప్రజలు చూపుతున్న ప్రేమ, ఆప్యాయతలు తనను ఆకట్టుకున్నాయని, ఈ రాష్ట్రానికి సేవకుడిగా వచ్చానని, ఈ సేవ కొనసాగుతుందని 'ఎక్స్'లో మోదీ పోస్టు చేశారు.



నేడు అఖిలేశ్‌ను ప్రశ్నించనున్న సీబీఐ

న్యూఢిల్లీ/లక్నో: ఉత్తరప్రదేశ్‌లో అక్రమ గనుల కేటాయింపుల కేసుల్లో విచారణ నిమిత్తం గురువారం తమ ఆఫీస్‌కు రావాలని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఆయనకు సమన్లు జారీచేసింది. సాక్షిగా హాజరైతే వాంగ్మూలం నమోదుచేసుకుంటామని ఆ సమన్లతో పేర్కొంది. ఈ-టెండర్ ప్రక్రియను పూర్తిగా ఉల్లంఘించారని, ప్రభుత్వ అధికారులు ఈ మైనింగ్ లీజుల కేటాయింపుల్లో పాలుపంచుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో సీబీఐ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తునకు అలహాబాద్ హైకోర్టు గతంలో ఆదేశించింది. అఖిలేశ్ యాదవ్ ముఖ్యమంత్రిగా ఉన్న 2012–16కాలంలోనే జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధించినా ఈ అక్రమ మైనింగ్‌కు తెరలేపారని సీబీఐ పేర్కొంది. 2019లో నమోదైన కేసులో భాగంగా అఖిలేశ్‌కు సమన్లు పంపామని, ఆయన ఈ కేసులో నిందితుడు కాదని, సాక్షి మాత్రమేనని సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. సీబీఐ సమన్లపై అఖిలేశ్ స్పందించారు. ''ఎన్నికలొచ్చినప్పుడల్లా నాకు నోటీసులొస్తాయి. 2019 లోక్‌సభ ఎన్నికల వేళా ఇలాగే జరిగింది. బీజేపీ ఎక్కువగా లక్ష్యంగా చేసుకున్నది మా పార్టీనే. గత పదేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉంటూ ఎంతో అభివృద్ధిచేశామని చెబుతుంటారు. అలాంటపుడు సమాజ్‌వాదీ పార్టీ అంటే బీజేపీకి ఎందుకంత కంగారు?. యూపీలో ఎక్స్‌ప్రెస్‌వేపై హెర్క్యులెస్ రకం విమానంలో మోదీ దిగారు. కానీ ఆ ఎక్స్‌ప్రెస్‌వేలను కట్టింది ఎస్పీ సర్కార్. అలాంటి జాతీయ రహదారులను మీరు వేరే రాష్ట్రాల్లో ఎందుకు కట్టలేకపోయారు?'' అంటూ బీజేపీపై అఖిలేశ్ నిప్పులు చెరిగారు.

ఏమిటీ కేసులు?

హమీర్‌పూర్ జిల్లా గనుల్లో తక్కువ విలువైన ఖనిజాలను లీజుకిచ్చి లీజు హక్కుదారుల నుంచి ప్రభుత్వ అధికారులు ముడుపులు తీసుకున్నారని సీబీఐ ఏడు కేసులు నమోదుచేసింది. 2012–17లో అఖిలేశ్ సీఎంగా ఉంటూనే 2012–13లో గనుల శాఖ మంత్రిగా కొనసాగారు. అప్పుడే 2013 ఫిబ్రవరి 17న ఒకేరోజు 13 ప్రాజెక్టులకు సీఎం ఈ-టెండర్లను పక్కనబెట్టి పచ్చజెండా ఊపారని సీబీఐ ఆరోపిస్తోంది. ఈ కేసుల్లో నాటి హమీర్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్, ఐఏఎస్ అధికారిణి బి.చంద్రకళ, సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్సీ రమేశ్‌కుమార్ సహా 11 మందిపై సీబీఐ కేసులు వేసింది.

పాకిస్తాన్ అనుకూల నినాదాలపై రగడ

కర్ణాటక అసెంబ్లీలో బీజేపీ ఆందోళన

బెంగళూరు: కర్ణాటకలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సయ్యద్ నసీర్ హుస్సేన్ గెలుపొందిన తర్వాత ఆయన అనుచరులు పాకిస్తాన్‌కు అనుకూలంగా నినాదాలు చేయడం పట్ల రాష్ట్ర అసెంబ్లీ బుధవారం అట్టుడికిపోయింది. విపక్ష బీజేపీ సభ్యుల ఆందోళనలతో సభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసిన వారిని అరెస్టు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ సభ్యులు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకొచ్చి బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. దీంతో అధికార కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. అరుపులు కేకలతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. పాకిస్తాన్ అనుకూల నినాదాల వ్యవహారంపై హోంమంత్రి జి.పరమేశ్వర అసెంబ్లీలో మాట్లాడారు. దర్యాప్తు కొనసాగుతోందని, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నివేదిక కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తున్న వీడియో అసలైందో కాదో తేలుతుందని అన్నారు. ఇది నిజంగా జరిగినట్లు బయటపడితే దోషులను గుర్తించి, చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని ప్రకటించారు. మంగళవారం రాజ్యసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. సయ్యద్ నసీర్ హుస్సేన్ గెలిచిన తర్వాత ఆయన అనుచరులు పాకిస్తాన్‌కు మద్దతుగా నినాదాలు చేశారంటూ ఓ వీడియో బయటకు వచ్చింది. దాన్ని చానళ్లు ప్రసారం చేశాయి.

నావల్నీ అంత్యక్రియలకు చర్చిలు నిరాకరించిన వేళ..

మాస్కో: ఇటీవల అనుమానాస్పదంగా జైలులో మరణించిన రష్యా విపక్ష నేత అలెక్సీ నావల్నీ అంత్యక్రియల నిర్వహణకు చర్చిలేవీ స్వచ్ఛందంగా ముందుకు రావడ లేదు. అధ్యక్షుడు పుతిన్ ఆగ్రహిస్తారన్న భయమే ఇందుకు కారణమని నావల్నీ సంస్థ అధికార ప్రతినిధి ఆరోపించారు. ''నావల్నీ పేరు చెప్పగానే ఇప్పటికే బుకింగ్ అయిపోయాయంటూ చాలా చర్చిల నిర్వాహకులు తప్పించుకున్నారు. ఎట్టకేలకు మాస్కో శివార్లలోని మేరీనో పట్టణంలో ఉన్న మదర్ ఆఫ్ గాడ్ క్వెంచ్ మై సారోస్ చర్చి నావల్నీ అంత్యక్రియల నిర్వహణకు ముందుకొచ్చింది'' అని ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'వాస్తవానికి గురువారమే అంత్యక్రియలు పూర్తిచేద్దామనుకున్నాం. కానీ పార్లమెంట్‌ను ఉద్దేశిస్తూ పుతిన్ ప్రసంగం ఉండటంతో ఆ రోజు అంత్యక్రియలకు చర్చిలేవీ ముందుకు రాలేదు. అందుకే శుక్రవారం మధ్యాహ్నం ఖననం చేయనున్నాం' అని చెప్పారు.

టార్గెట్ హిమాచల్‌ప్రదేశ్?

- ప్రభుత్వాన్ని కూల్చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం
- బీజేపీ వైపు మొగుతున్న పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- రంగంలోకి దిగిన కాంగ్రెస్ పరిశీలకులు
- ప్రభుత్వాన్ని కాపాడుకుంటామని కాంగ్రెస్ స్పష్టీకరణ
- ప్రజా పనుల శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ రాజీనామా

సిమ్లా/న్యూఢిల్లీ: హిమాచల్‌ప్రదేశ్ రాజకీయ పరిణామాలు రసకందాయంలో పడ్డాయి. రాజ్యసభ ఎన్నికల్లో అనూహ్య ఓటమితో కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడపై సందేహాలు మొదలయ్యాయి. ప్రభుత్వంపై శాసనసభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ప్రతిపక్ష బీజేపీ సిద్ధమవుతున్నట్లు ప్రచారం మొదలైంది. లోక్‌సభ ఎన్నికల ముందు చోటుచేసుకున్న ఈ పరిణామాలు కాంగ్రెస్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. నష్ట నివారణ కోసం ఆ పార్టీ అధిష్టానం రంగంలోకి దిగింది. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని సంకేతాలిచ్చింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముగ్గురు సీనియర్ నేతలు భూపేష్ బఘేల్, భూపిందర్ సింగ్ హుడా, డీకే శివకుమార్‌ను పార్టీ పరిశీలకులుగా హిమాచల్‌ప్రదేశ్‌కు పంపించారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం 68 స్థానాలుండగా, కాంగ్రెస్‌కు 40 మంది, బీజేపీకి 25 మంది, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ పట్ల అసంతృప్తితో ఉన్న పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు ముగ్గురు స్వతంత్ర సభ్యులు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఒక రాజ్యసభ స్థానానికి మంగళవారం జరిగిన ఎన్నికలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్‌కు తగిన బలం ఉన్నప్పటికీ క్రాస్ ఓటింగ్ జరగడంతో ఆ పార్టీ అభ్యర్థి అభిషేక్ మనూ సింఘ్వీ ఓడిపోయారు. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి ఓటువేశారు. ఈ 9 మంది ఎమ్మెల్యేలు బుధవారం అసెంబ్లీకి వచ్చారు. 'జైశ్రీరామ్, బస్ గయా కామ్' అని నినదిస్తూ బీజేపీ సభ్యులు వారికి స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, హిమాచల్‌ప్రదేశ్ ప్రజా పనుల శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రికి, గవర్నర్‌కు సమర్పించానని చెప్పారు. ప్రభుత్వంలో తనకు, తన కుటుంబానికి అవమానాలు ఎదురయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నానని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో అసలు ఏం జరుగుతోందో అధిష్టానం తెలుసుకోవాలని కోరారు. తన అనుచరులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించుకుంటానని వెల్లడించారు.



సీఎం సుఖు

బీజేపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు

హిమాచల్‌ప్రదేశ్ శాసనసభలో బుధవారం అనూహ్య పరిణామం చేసుకుంది. 15 మంది ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలపై స్పీకర్ కులదీప్ సింగ్ పథానియా సస్పెన్షన్ వేటు వేశారు. వీరిలో ప్రతిపక్ష నేత జైరామ్ ఠాకూర్ కూడా ఉన్నారు. బీజేపీ సభ్యులు సభలో స్పీకర్‌ను అగౌరవపరుస్తున్నారని, ఇతరులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, సభ సజావుగా సాగాలంటే వారిని సస్పెండ్ చేయాలని కోరుతూ మంత్రి హర్షవర్ధన్ చౌహాన్ ప్రవేశపెట్టిన తీర్మానం అసెంబ్లీలో ఆమోదం పొందింది. బడ్జెట్‌ను ఆమోదింపజేసుకోవడానికే తమను సస్పెండ్ చేశారని జైరామ్ ఠాకూర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలో పడిందని, ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ రాజీనామా చేయాలని జైరామ్ ఠాకూర్ అన్నారు. బీజేపీ సభ్యుల సస్పెన్షన్ అనంతరం అసెంబ్లీలో బడ్జెట్ ఆమోదం పొందింది.

ప్రజా తీర్పును కాపాడుకుంటాం

హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రజా తీర్పును కాలరాచే ప్రయత్నాలను సహించబోమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. రాష్ట్రంలోని పార్టీ ఎమ్మెల్యేలందరితో మాట్లాడి, త్వరలో సమగ్ర నివేదిక సమర్పించాలని కాంగ్రెస్ పరిశీలకులను ఖర్గే ఆదేశించారని తెలిపారు. వ్యక్తుల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, అదే సమయంలో ప్రజలు ఇచ్చిన తీర్పును కాపాడుకోవడం ముఖ్యమని తేల్చిచెప్పారు. హిమాచల్‌లో అధికారంలోకి రావడానికి బీజేపీ తప్పుడు మార్గాలు వెతుకుతోందని ఆరోపించారు.

చట్టపరమైన అధికారం ఒక్కటే సరిపోదు

- జడ్జిలకు సమస్యల పరిష్కార నైపుణ్యం ఉండాలి: సీజేఐ

న్యూఢిల్లీ: న్యాయమూర్తిగా రాణించాలంటే చట్టపరమైన అధికారం ఒక్కటే సరిపోదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. మానవ జీవితాన్ని, మనుషుల సమస్యలను అర్థంచేసుకొని, పరిష్కరించే నేర్పు అలవర్చుకోవాలని, వారికి అదే అతిపెద్ద సాధనమని పేర్కొన్నారు. బుధవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్తగా నియమితులైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సతీష్‌చంద్రశర్మ, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ప్రసన్న బి.వరాలేను సత్కరించారు. నూతన న్యాయమూర్తు నియామకంతో సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్య గరిష్టంగా 34కు చేరిందని జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. వారి అనుభవంతో సుప్రీంకోర్టుకు మంచి పేరు వస్తుందని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే నైపుణ్యమే మనల్ని గొప్ప న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా మారుస్తుందని స్పష్టం చేశారు.

కేరళలో 16 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ

తిరువనంతపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేరళలో విపక్షాల యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్(యూడీఎఫ్) కూటమి తరఫున అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బరిలో దిగనుంది. కేరళలో 20 లోక్‌సభ స్థానాలు ఉండగా మా పార్టీ 16 చోట్ల పోటీ సిద్ధమవుతోందని కాంగ్రెస్ పార్టీ బుధవారం ప్రకటించింది. యూడీఎఫ్ కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది. సీట్లపంపకాల వివరాలను కాంగ్రెస్ కేరళ చీఫ్ కె.సుధాకరన్, యూడీఎఫ్ చైర్మన్ వీడీ సతీశన్ మీడియాకు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ 16 చోట్ల, యూడీఎఫ్ కూటమి పార్టీ అయిన యునియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) రెండు చోట్ల, కేరళ కాంగ్రెస్(జాకబ్) పార్టీ, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ చెరో ఒక స్థానంలో పోటీకి నిలుస్తాయని కేరళ అసెంబ్లీలో విపక్ష నేత సతీషన్ చెప్పారు. కూటమి తరఫున ఎక్కువ స్థానాల్లో పోటీచేస్తున్నందుకు బదులుగా కేరళలో వచ్చే దఫాలో ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానం నుంచి ఐయూఎంఎల్‌కు కాంగ్రెస్ మద్దతు పలకనుంది. రాష్ట్రంలోని అన్ని సీట్లను గెలవడమే లక్ష్యంగా విపక్షాల 'ఇండియా' కూటమికి మద్దతివ్వాలని యూడీఎఫ్ నిర్ణయించుకుంది.

మిట్టల్‌కు నైట్‌హుడ్ పురస్కారం



లండన్/న్యూఢిల్లీ: భారతీయ టెలికం రంగ దిగ్గజ పారిశ్రామికవేత్త సునీల్ భారతీ మిట్టల్‌ను బ్రిటన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక నైట్‌హుడ్ కమాండర్ పురస్కారంతో సత్కరించింది. ఎలిజబెత్ రాణి మరణం తర్వాత బ్రిటన్ రాజసింహాసనాన్ని అధిరోహించిన చార్లెస్–3 నుంచి ఈ అవార్డ్‌ను అందుకున్న తొలి భారతీయుడిగా సునీల్ మిట్టల్ రికార్డు సృష్టించారు. బ్రిటన్, భారత్ వాణిజ్య సంబంధాల బలోపేతానికి చేసిన కృషికిగాను యూకే ప్రభుత్వం నైట్‌హుడ్(కేబీఈ) అవార్డ్‌తో మిట్టల్‌ను గౌరవించింది. భారత్‌లో రెండో అతిపెద్ద టెలికం సంస్థ ఎయిర్‌టెల్‌కు 66 ఏళ్ల మిట్టల్ వ్యవస్థాపక చైర్మన్‌గా కొనసాగుతున్నారు. బ్రిటన్ ఇచ్చే అత్యున్నత పౌర పురస్కారాల్లో నైట్ కమాండర్ కూడా ఒకటి. గౌరవార్థం విదేశీయులకూ దీనిని ప్రకటిస్తారు.

రాజీవ్‌గాంధీ హత్యకేసు దోషి శంతన్ మృతి

సాక్షి, చెన్నై: మాజీ ప్రధానమంత్రి, దివంగత రాజీవ్‌గాంధీ హత్యకేసులో దోషిగా తేలి జీవితఖైదు తర్వాత విడుదలైన 55 ఏళ్ల టి.శంతన్ అలియాస్ సుథేందిరరాజా బుధవారం గుండెపోటుతో మరణించారు. ఆయన శ్రీలంక దేశస్తుడు. 1991లో రాజీవ్ గాంధీ హత్యోదంతం తర్వాత జరిగిన కేసు విచారణలో అరెస్టయిన శంతన్‌సహా ఏడుగురు దోషులుగా తేలి దాదాపు రెండు దశాబ్దాలపాటు జైలు శిక్ష అనుభవించారు. తర్వాత కోర్టులో పెట్టుకున్న పిటిషన్లను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం 2022లో శంతన్‌సహా ఏడుగురికి శిక్ష నుంచి విముక్తి కల్పించి విడుదలచేసింది. శంతన్ జనవరిలో లివర్ వైఫల్యంతో ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మరణించారని ఆస్పత్రి డీన్ తేరనీరజన్ చెప్పారు.

అరేబియన్ సముద్ర జలాల్లో 3,300 కేజీల డ్రగ్స్ స్వాధీనం

పోలీసుల అదుపులో ఐదుగురు

సాక్షి, విశాఖపట్నం: అరేబియా సముద్ర జలాల్లో భారీ మొత్తంలో మత్తుపదార్థాలను భారత నౌకాదళం స్వాధీనం చేసుకుంది. సముద్రజలాలపై ఇంత భారీ స్థాయిలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారి. ఇరాన్‌లోని ఛబహార్ నౌకాశ్రయం నుంచి బయల్దేరి మంగళవారం ఉదయం అరేబియా సముద్రంలో అంతర్జాతీయ సముద్రజలాల సరిహద్దు(ఐఎంబీఎల్)కు 60 నాటికల్ మైళ్ల దూరంలో భారత్ వైపు వస్తున్న ఒక అనుమానిత చేపల పడవను భారత నావికాదళ నిఘా విమానం కనిపెట్టి వెంటనే ప్రధాన కార్యాలయానికి సమాచారం చేరవేసింది. అక్కడి నుంచి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)కి సమాచారం అందింది. వెంటనే నేవీ, ఎన్‌సీబీ, గుజరాత్ పోలీసులు సంయుక్తంగా రంగంలోకి దిగారు. పీ8ఐ నేవీ విమానం, యుద్ధనౌక, హెలికాప్టర్లు ఆ పడవను చుట్టుముట్టి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. నౌకను ఎన్‌సీబీ అధికారులు తనిఖీచేయగా దాదాపు 3,300 కేజీల మాదకద్రవ్యాలున్న ప్యాకెట్లు బయటపడ్డాయి. ఈ ప్యాకెట్లలో 3,110 కేజీల ఛరస్/హషీష్, 158.3 కేజీల స్ఫటిక రూప మెథామ్‌ఫెటమైన్, 24.6 కేజీల హెరాయిన్ ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో వీటి మొత్తం విలువ గరిష్టంగా రూ.2,000 ఉండొచ్చని ఢిల్లీలో ఎన్‌సీబీఐ డైరెక్టర్ జనరల్ ఎస్ఎన్ ప్రధాన్ అంచనావేశారు. ఆ ప్యాకెట్ల మీద 'రాస్ అవద్ గూడ్స్ కంపెనీ, పాకిస్తాన్ తయారీ' అని రాసి ఉంది. మత్తుపదార్థాల ప్యాకెట్లతోపాటు పడవలో ఉన్న ఐదుగురు విదేశీయులను అరెస్ట్‌చేశారు. వీరి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. వీరిని పాక్ లేదా ఇరాన్ దేశస్తులుగా భావిస్తున్నారు. వీరి నుంచి ఒక శాటిలైట్ ఫోన్, నాలుగు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 'భారత నావికాదళం, ఎన్‌సీబీ, గుజరాత్ పోలీసులు సాధించిన ఈ విజయం మత్తుపదార్థాల రహిత భారత్ కోసం కేంద్రం చేస్తున్న కృషికి నిదర్శనం'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. సముద్ర జలాల్లో ఇన్ని కేజీల డ్రగ్స్ పట్టివేత ఇదే తొలిసారి. అంతకు ముందు 2023 మేలో కేరళ తీరంలో 2,500 కేజీల మత్తుపదార్థాలను ఎన్‌సీబీ, నేవీ పట్టుకున్నాయి.

అమెరికాలో కార్చిచ్చు

టెక్సాస్ రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో అడవి దహనం

కనాడియన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో అడవికి నిప్పంటుకుని లక్షల ఎకరాల్లో పచ్చదనం మటుమాయమైంది. చెట్లు కాలిబూడిదయ్యాయి. సమీప ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం హుటాహుటిన సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. ఇప్పటికే 2,00,000 ఎకరాల విస్తీర్ణంలో అటవీప్రాంతాన్ని కాల్చేసిన కార్చిచ్చు మరింత పెద్దదవుతూ అక్కడి ప్రజలు, ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా పరిణమించింది. దీంతో టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబోట్ దాదాపు 60 గ్రామాల్లో విపత్తుగా ప్రకటించి సహాయక చర్యలను ముమ్మరంచేశారు. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పేందుకు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు.

అణ్వాయుధాల కేంద్రం బంద్

ఈ ప్రాంతంలో సంభవించే అతి పెద్ద కార్చిచ్చులకు ది స్మోక్‌హౌజ్ క్రీక్‌ఫైర్‌గా పిలుస్తుంటారు. భయంకరమైన ఎండ, వేడి, పొడి వాతావరణం కారణంగా ఉత్తర టెక్సాస్ అడవిలో కార్చిచ్చు అంటుకుంది. సోమవారం మొదలైన ఈ కార్చిచ్చు టెక్సాస్ రాష్ట్ర చరిత్రలో ఇంతవరకు సంభవించిన అతిపెద్ద కార్చిచ్చు ఘటనల్లో ఐదోది కావడం గమనార్హం. ఈ కార్చిచ్చు దెబ్బకు ఆమరిల్లో పట్టణంలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న అమెరికా అణ్వాయుధాల కేంద్రంలో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపేసినట్లు ప్యాన్‌టెక్స్ సంస్థ వెల్లడించింది. జాతీయ రహదారుల వెంట చెట్లకు సైతం మంటలు అంటుకోవడంతో ఆయా హైవేలపై వాహనాల రాకపోకలను నిలిపేశారు. ఓక్లహోమా రాష్ట్ర సరిహద్దుల్లోని హెంఫిల్, హచిన్సన్ కౌంటీల్లోనూ కార్చిచ్చు వ్యాపించింది. మియామీ, కనాడియన్ పట్టణాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సెనేటర్ కెవిన్ స్పార్క్స్ స్థానికులకు విజ్ఞప్తిచేశారు. కనాడియన్ పట్టణాన్ని కార్చిచ్చు దాదాపు చుట్టేసింది. స్కెలీటౌన్, వీలర్, అలీసన్, బ్రిస్కో పట్టణాల నుంచీ స్థానికులు వేరే చోట్లకు వెళ్లిపోయారు. కార్చిచ్చు ఘటనల కారణంగా టెక్సాస్ రాష్ట్రంలో మొత్తంగా కోటి 10 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా అమెరికాను కార్చిచ్చులు నిత్యం వణికిస్తున్నాయి.

సాక్షి హైదరాబాద్

గురువారం ♦ 29 ♦ ఫిబ్రవరి ♦ 2024



సికింద్రాబాద్‌లోని ఓ పరీక్ష కేంద్రం వద్ద రద్దీ



ఈసీఐఎల్‌లో హాల్‌టికెట్ తనిఖీలు



సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ కళాశాల వద్ద హాల్‌టికెట్ల పరిశీలన..

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు షురూ..

హైదరాబాద్ మహానగరంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం తొలి పరీక్ష కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి కనిపించింది. పరీక్షకు అరగంట ముందే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. కొన్ని పరీక్ష కేంద్రాల్లో ఇరుకు గదులు ఉండటంతో విద్యార్థులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్, రెవెన్యూ అధికారులతోపాటు ప్రత్యేక స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. సైఫాబాద్ పీజీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒడ్డెన్నతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఇక మూడు జిల్లాల్లో కలిపి మొత్తం 5547 మంది గైర్హాజరు అయినట్లు అధికారులు వెల్లడించారు.

– సాక్షి, సిటీబ్యూరో



సెంటర్ వద్ద నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



సైఫాబాద్‌లో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అనుదీప్

టోల్ తీస్తారా!

ఐఆర్‌బీ టెండర్లపై సీఎం రేవంత్ అభ్యంతరం

- అక్రమాలు జరిగాయని గతంలో ఆరోపణలు
- నేడు సీఎంగా టోల్ టెండర్లలో అక్రమాలపై విచారణకు ఆదేశాలు
- గత ప్రభుత్వ హయాంలో టెండర్లు దక్కించుకున్న ఐఆర్‌బీ
- తాజాగా సీబీఐ, అదే స్థాయి సంస్థల విచారణకు నిర్ణయం
- మరోసారి చర్చనీయాంశంగా మారిన ఔటర్ టోల్ టెండర్ల ఉదంతం



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్‌రోడ్డు లీజు టెండర్లలో అక్రమాలపైన ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. సీబీఐ లేదా అదేస్థాయి సంస్థలతో విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంతో ఔటర్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఔటర్ టోల్ లీజులో అక్రమాలకు బాధ్యులైన అధికారురులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మరోవైపు ఔటర్ లీజు వ్యవహారంపైన పూర్తి వివరాలను అందజేయాలని హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలిని ముఖ్యమంత్రి ఆదేశించారు. 158 కిలోమీటర్ల మార్గంలో టోల్ వసూలు ద్వారా ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయాన్ని ఆర్జించిపెట్టే ఔటర్ రింగ్‌రోడ్డును గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఐఆర్‌బీ సంస్థకు కారుచౌకగా కట్టబెట్టినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. బీజేపీతో పాటు, పీసీసీ చీఫ్‌గా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం తీవ్ర ఆరోపణలు చేశారు. కనీస ధర వెల్లడించకపోవడంతో ఔటర్‌లీజు వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగినట్లు ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఆరోపణలపైన అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ ఆయనపైన పరువునష్టం దావా కూడా వేశారు. ఈ నేపథ్యంలోనే వివాదాస్పదంగా మారిన ఔటర్ లీజు అంశాన్ని ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి సీరియస్‌గా పరిగణనలోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే సమగ్రమైన విచారణ చేపట్టాలని ఆయన హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

టీఓటీ పద్ధతిలో ఔటర్ లీజు...

కేంద్ర కేబినెట్ సబ్ కమిటీ ఆమోదించిన టీఓటీ (టోల్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో ఔటర్ రింగ్‌రోడ్డును 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు 2022 ఆగస్టు11వ తేదీన గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అదే సంవత్సరం నవంబర్ 9వ తేదీన అంతర్జాతీయ సంస్థల నుంచి హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. గత సంవత్సరం మార్చి 31వ తేదీ నాటికి 11 బిడ్డర్‌లు ఆసక్తిని ప్రదర్శించారు. బిడ్డింగ్ ప్రక్రియలో భాగంగా మూడుసార్లు బిడ్ గడువును పొడిగించారు. 30 ఏళ్ల లీజుపైన బేస్ ప్రైస్ కంటే ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలపర్స్ లిమిటెడ్ సంస్థ రూ.7380 కోట్లతో ఎక్కువ మొత్తంలో బిడ్ చేసినట్లు అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ వెల్లడించారు. కానీ ప్రభుత్వం నిర్ణయించిన బేస్‌ప్రైస్‌పైన మాత్రం గోప్యతను పాటించడంతో ఈ లీజు వ్యవహారం వివాదాస్పదమైంది. మొదట్లో 11 సంస్థలు పోటీ చేయగా, చివరకు 4 సంస్థలు మాత్రమే పోటీలో మిగిలాయి. ఆ నాలుగింటిలోనూ ఐఆర్‌బీ ఎక్కువమొత్తంలో బిడ్ వేసి లీజును దక్కించుకుంది. 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు మార్గంలో ప్రతి రోజు 1.5 లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అప్పట్లో గత ప్రభుత్వం నిర్దేశించిన అంచనాల కంటే ఎక్కువ మొత్తంలో ఐఆర్‌బీ సంస్థకు టోల్ ఆదాయం లభిస్తున్నట్లు అధికారవర్గాల అంచనా. మరోవైపు ఏటా సుమారు రూ.550 కోట్లకు పైగా ఆదాయాన్ని ఆర్జించి పెట్టే కామధేనువు వంటి ఔటర్‌ను ప్రైవేట్ సంస్థకు ధారాదత్తం చేయడం పట్ల ఇంజనీరింగ్ నిపుణులు సైతం అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

గడువు కంటే ముందే రూ.7380 కోట్లు చెల్లించిన ఐఆర్‌బీ...

ఇలా వివాదాల నడుమ ఔటర్ టెండర్‌ను దక్కించుకున్న ఐఆర్‌బీ సంస్థ నిర్ణీత 120 రోజుల గడువు కంటే ముందే రూ.7380 కోట్ల లీజు మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించింది..దీంతో 2008 నుంచి 2023 వరకు వరకు సుమారు 15 సంవత్సరాల పాటు హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ అయిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ నిర్వహణలో ఉన్న ఔటర్‌రింగ్ రోడ్డు మొట్టమొదటిసారి ప్రైవేట్ సంస్థ నిర్వహణలోకి వెళ్లిపోయింది. నిబంధనల మేరకు రానున్న 30 ఏళ్ల పాటు ఈ లీజు కొనసాగవలసి ఉంటుంది. 8 వరుస లేన్‌లతో (1264 లేన్ కి.మీలు) కూడిన 158 కి.మీల ఔటర్ రింగ్‌రోడ్డుపైన ఉన్న సుమారు 120కి పైగా టోల్‌గేట్ల వద్ద ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే సంస్థ టోల్ వసూళ్లను కొనసాగిస్తోంది. ఔటర్ రింగురోడ్డు నుంచి టోల్ వసూలు చేయడంతో పాటు రహదారుల నిర్వహణ, అవసరమైన మరమ్మతులు చేపట్టడం, తదితర ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) బాధ్యతలను కూడా గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే చేపట్టవలసి ఉంటుంది. హెచ్‌జీసీఎల్ ఔటర్‌ను ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్లు, ఔటర్ మాస్టర్‌ప్లాన్ అమలు, పచ్చదనం పరిరక్షణ వంటి బాధ్యతలకు పరిమితమైంది.

ఏం జరిగిందో?

- కుమారుడి ఆత్మహత్య.. అనుమానాస్పద స్థితిలో తల్లి మృతి
- మౌలాలి ఈస్ట్ ప్రగతినగర్‌లో విషాదం



శ్రీధర్ గౌడ్ (ఫైల్)



విజయ (ఫైల్)

మల్కాజిగిరి: కుమారుడు ఆత్మహత్య చేసుకోవడం..అదే గదిలో అతని తల్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెల్పిన వివరాల మేరకు..మౌలాలి ఈస్ట్ ప్రగతినగర్‌కు చెందిన మెరుగు విజయ (73) భర్త చనిపోవడంతో కుమారుడు శ్రీధర్ గౌడ్(47)తో కలిసి ఉంటుంది. శ్రీధర్ గౌడ్‌కు భార్య శైలజతో మనస్పర్థలు రావడంతో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఆమె వేరే ఇంట్లో ఉంటోంది. కాగా శ్రీధర్ గౌడ్ ప్రస్తుతం జవహర్‌నగర్‌లో ఉన్న వాటర్ ప్లాంట్ నిర్వహణ చూసుకుంటున్నాడు. వారి సంతానంలో కుమారుడు, కూతురు ఇతని వద్ద ఉంటుండగా..మరో కుమారుడితో కలిసి శైలజ కాప్రాలో ఉంటున్నది. బుధవారం ఉదయం శ్రీధర్ కుమార్తె నిద్రలేచి చూసేసరికి తండ్రి బెడ్‌రూమ్‌లో ఉరివేసుకొని ఉండగా, అదే రూములో ఆమె నానమ్మ విజయ కిందపడి చనిపోయిఉండడం గమనించింది. వెంటనే బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి..పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ మల్లయ్యలు వారిద్దరి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శ్రీధర్ భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.



సంఘటనా స్థలంలో మృతదేహాలు

కుటుంబ సమస్యలే కారణమా?

భిక్షపతి, విజయలకు నలుగురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. ఆర్థికంగా బాగానే ఉన్న కుటుంబం. శ్రీధర్‌కు అతని భార్య శైలజకు విభేదాలు ఏర్పడ్డాయి. గతంలో మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో శ్రీధర్‌పై వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. విడాకుల కోసం కోర్టును ఆశ్రయించగా..వాదనలు పూర్తయి వచ్చే నెలలో తీర్పు రానున్నట్లు సమాచారం. పోలీసులు శ్రీధర్ ఇంట్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా..మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో శ్రీధర్ బయట నుంచి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత పాలు పోసే వ్యక్తి రావడంతో విజయ పాలు పోయించుకున్నట్లు రికార్డు అయింది. విజయ నేల మీద పడి వుండడం, తల వెనుక రక్తం ఉండడాన్ని పోలీసులు గమనించారు. కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో షాక్‌కు గురైన ఆమె కింద పడిపోయి చనిపోయిందా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వచ్చే నెలలో విడాకులకు సంబంధించి తీర్పు రానున్నడంతో శ్రీధర్ ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడివుండవచ్చునని భావిస్తున్నారు. గత కొంత కాలంగా ఆస్తి పంపకాలపై కూడా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం.

హైదరాబాద్ అదనపు కలెక్టర్‌గా హేమంత కేశవ్ పాటిల్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా హేమంత కేశవ్ పాటిల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా హైదరాబాద్ స్పెషల్ ఎస్‌పీఎంగా డిప్యూటీ కలెక్టర్ కె.జ్యోతికి పోస్టింగ్ లభించగా, ఇక్కడ పనిచేస్తున్న కొమరయ్య జనగామ ఆర్డీవోగా బదిలీ అయ్యారు.

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ బదిలీ

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (రెవెన్యూ, ఐటీ) స్నేహ శబరీష్ బదిలీ అయ్యారు. ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆమెను కుమరం భీమ్–ఆసిఫాబాద్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆ జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావ్‌ను జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా నియమించారు.

అవసరమా!

ఒక్కరు చేసే పనికి నలుగురైదుగురు ఎందుకు?

- 'చెత్త' పనులకు పెద్ద సంఖ్యలో డీసీలు, జేసీల వినియోగం
- కార్పొరేటర్లు మండిపడ్డా.. ఖజానా దివాళా తీసినా తీరు మారని జీహెచ్ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: ఎవరేమనుకుంటే మాకేంటి అన్నట్లుంది జీహెచ్ఎంసీ తీరు. జీహెచ్ఎంసీలో పనులు లేక ఖాళీగా ఉంటున్న అధికారులతో ఖజానాకు భారమే తప్ప వారి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఇటీవలి కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేసినా..అధికారులను తగ్గించాల్సింది పోయి కొత్తగా వస్తున్నవారికి ఆహ్వానం పలుకుతున్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో సహా ఎందరో ఉన్నా జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆదాయాన్ని రప్పించలేక పోతున్నారని, అడ్డగోలు అక్రమాలతో ఖజానాకు చిల్లులు పడుతున్నా అడ్డుకట్ట వేయలేకపోతున్నారని నిండుసభలో పార్టీలకతీతంగా సభ్యులు ముక్తకంఠంతో మండిపడ్డా తమదారి తమదేనన్నట్లు వ్యవహరిస్తున్నారు. కౌన్సిల్ సమావేశం జరిగిన తర్వాతే దాదాపు డజను మందికి పోస్టింగులిచ్చారు. అవైనా అధికారుల స్థాయికి తగ్గట్లు బాధ్యతలున్నాయా అంటే అదీలేదు. గతంలో ఒక్కరు చేసిన పనినే నలుగురైదుగురికి అప్పగించారు. అంటే అదనంగా పెరిగింది అధికారులే కాదు.. వారికి అవసరమైన చాంబర్లు, కార్లు, సిబ్బంది వగైరా. దీంతో జీహెచ్ఎంసీకి ఖర్చుల భారం మరింత పెరుగుతుందే కానీ తగ్గదు. కేవలం తమ అవసరాల కోసం హైదరాబాద్‌కు వచ్చే వారికి పునరావాసకేంద్రంగా జీహెచ్ఎంసీ మారుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టించుకోవడం లేదు.

ఒకే పనికి ఎందరెందరో..!

జీహెచ్ఎంసీలో గతంలో వైద్యం, ఆరోగ్యం, పారిశుధ్యం, దోమల నివారణ, కుక్కల నియంత్రణ తదితరమైన వన్నీ ఒకే అడిషనల్ కమిషనర్ నిర్వహించేవారు. అదిసైతం ఐఏఎస్ అధికారి కాదు. సహాయకులుగా ఒక జాయింట్ కమిషనర్ ఉండేవారు. ప్రస్తుతం ఆరోగ్యానికి ఒక అడిషనల్ కమిషనర్, పారిశుధ్యానికి మరో అడిషనల్ కమిషనర్, ఇందులో ఒకరు ఐఏఎస్..అడిషనల్ కమిషనర్లకు సహాయకంగా నలుగురైదుగురు జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ఉన్నారు. వీరందరికీ కార్లతో సహా సకల సదుపాయాలకు జీహెచ్ఎంసీ ఖజానా నుంచే ఖర్చు చేస్తున్నారు. ఇటీవల జీహెచ్ఎంసీకి బదిలీపై వచ్చిన ఇద్దరు డిప్యూటీ కమిషనర్లకు రెండు జోన్లలోని పారిశుధ్య పనులు అప్పగించారు. జోన్ల స్థాయిలో కేవలం ఈ పనులకు ప్రత్యేకంగా డిప్యూటీ కమిషనర్లను నియమించడం గతంలో లేదు. ఒక అడిషనల్ కమిషనర్‌కు గతంలో ఉన్న రెండు మూడు బాధ్యతలు తప్పించి కేవలం సంస్థాగత విచారణలు అనే విభాగాన్ని మిగిల్చారు. కొత్తగా బదిలీపై వచ్చిన మరో అడిషనల్ కమిషనర్‌కు పోస్టు కల్పించేందుకు ఉన్న బాధ్యతల్ని విడదీసి ఇలా అప్పగించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో అడిషనల్ కమిషనర్‌కు లీగల్, విద్యుత్ విభాగం బాధ్యతలప్పగించారు. ఇంకో స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌కు ఎన్నికల విభాగం జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. రెవెన్యూ విభాగం నుంచి వచ్చిన డిప్యూటీ కలెక్టర్‌కు సైతం ఎన్నికల విభాగంలోనే మరో జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇంకో స్పెషల్‌గ్రేడ్ కమిషనర్‌కు ఆరోగ్య విభాగంలో జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కో విభాగంలో ఎంతమందిని నియమిస్తున్నారో అంతే లేదు.వీరి పోస్టింగుల వివరాలు వెలుగు చూసినప్పటికీ, ఇంకా వెలుగులోకి రాకుండా లోలోన ఎన్ని జరుగుతున్నాయోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సవాల్ విసురుతున్న కార్పొరేటర్లు

పనిలేని అధికారులు జీహెచ్ఎంసీకి తెల్ల ఏనుగుల్లా మారారని, పాలన చేతకాని వారు తమకు ఆయా విభాగాల బాధ్యతలప్పగిస్తే ఆదాయాన్ని పెంచి చూపిస్తామని కార్పొరేటర్లు సభ సాక్షిగా సవాల్ విసిరినా చలనం లేకపోవడం.. తగిన విధంగా స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఆయా విభాగాల్లో అక్రమాల కట్టడికి హౌస్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించినా అమలుకు నోచుకోలేదు.

ఆదాయమేదీ..?

ఎందరున్నా, జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆదాయం రాకుండా గండ్లు పడుతున్నా అరికట్టలేకపోయారు. పోనీ ఆయా విభాగాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయా? అంటే అదీ లేదు. చెత్త పనుల కోసం ఎందరున్నా చెత్త సమస్యలు తగ్గడం లేదు. విద్యుత్ విభాగం నగరంలో చీకట్లను నివారించలేకపోతోంది. ప్రకటనల విభాగం అక్రమాలకు అడ్డాగా మారింది. రెవెన్యూ విభాగం ట్యాక్స్ వసూళ్లలో లోపాలు అరికట్టలేకపోయింది. అంతేకాదు.. ఏవిభాగంలో చూసినా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఇటీవల అభయహస్తం దరఖాస్తులు గాల్లో కొట్టుకుపోవడం అందుకు ఒక నిదర్శనం. కార్పొరేటర్లు ఫోన్లు చేసినా అధికారులు స్పందించరు. మీడియా కోరినా వివరాలివ్వరు.

'90 ఎంఎల్' ఇస్తేనే బయటకు వస్తా!

- హుస్సేన్‌సాగర్‌లో దిగి ఓ మందుబాబు హల్‌చల్
- సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన ఈ వీడియో



సాక్షి, సిటీబ్యూరో: ఎప్పుడు పడితే అప్పుడు... ఎక్కడ పడితే అక్కడ డ్రంకెన్ డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తూ పోలీసులు మందుబాబులకు చుక్కలు చూపిస్తున్న విషయం అందిరికీ తెలిసిందే. అయితే నగరానికి చెందిన ఓ వ్యక్తి మాత్రం మద్యం మత్తులో హుస్సేన్‌సాగర్‌లో దిగి పోలీసులకే చుక్కలు చూపించాడు. '90' ఇస్తేనే బయటకు వస్తానంటూ ముప్పతిప్పలు పెట్టాడు. గత నెల్లో చోటు చేసుకున్న ఈ ఉదంతానికి సంబంధించిన వీడియో బుధవారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. జనవరిలో ఓ రోజు రాత్రి మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు ట్యాంక్‌బండ్ పై నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి దిగాడు. ఇతడు నడుము లోతు నీళ్లు ఉన్న ప్రాంతంలో నిల్చుని ఉండటాన్ని ట్యాంక్‌బండ్‌పై ఉన్న పర్యాటకులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు అగ్నిమాపక శాఖ అధికారులనూ రప్పించారు. ట్యాంక్‌బండ్ మీది నుంచి తాడు వేసిన ఓ కానిస్టేబుల్ అది పట్టుకుని పైకి రావాల్సిందిగా ఆ యువకుడిని కోరాడు. ఆ ప్రాంతం దాటి ముందుకు వెళ్లవద్దని, అది చాలా ప్రమాదకరం అని హెచ్చరించాడు. ఈ విషయాన్ని సదరు యువకుడు పట్టించుకోకపోవడంతో సదరు కానిస్టేబుల్ 'నీకు ఏం కావాలి?' అంటూ ఉర్దూలో ఆ యువకుడిని అడిగాడు. దీనికి సమాధానంగా '90 (ఎంఎల్ పరిమాణంలో మద్యం) ఇస్తేనే బయటకు వస్తా' అంటూ చెప్పడంతో అంతా అవాక్కయ్యారు. ఆ సమయంలో ట్యాంక్‌బండ్‌పై ఉన్న అనేక మంది దీన్ని వీడియో తీశారు. ఓ నెటిజనుడు బుధవారం దీన్ని సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఆ రోజు దాదాపు గంట కష్టపడిన తర్వాత పోలీసులు ఆ యువకుడిని బయటకు రప్పించగలిగినట్లు తెలిసింది.

మెట్రో స్టేషన్‌లో ఆటవిడుపు!

మధురానగర్ మెట్రో పైన క్రికెట్ సదుపాయం



సాక్షి, సిటీబ్యూరో: మధురానగర్ మెట్రో స్టేషన్‌లో క్రికెట్ ప్రాక్టీస్, ఆటకు అవకాశం లభించింది. స్వింగ్ జోన్ ఇండోర్ క్రికెట్ అకాడమీ అండ్ నెట్స్ నగరంలో తొలిసారిగా మెట్రో స్టేషన్‌లో మినీ క్రికెట్, మిషన్ బాల్ సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. ఐసీసీ లెవల్–2 కోచ్ సర్టిఫికెట్ పొందిన మహ్మద్ లియాఖత్ అలీ దీన్ని ఏర్పాటు చేశారు. మెట్రో స్టేషన్‌లోనే ఈ సదుపాయం ఉండటం వల్ల చాలా మంది చిన్నారుల శారీరక శ్రమలో ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొంటున్నారని, రోడ్ల మీద వెళుతూ లేనిపోని ప్రమాదాల బారిన పడతారనే టెన్షన్ తల్లిదండ్రులకు కూడా లేకుండా నేరుగా మెట్రో స్టేషన్‌లో ప్రయాణించి, కోచింగ్ తీసుకునేలా ఉందని లియాఖత్ అలీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మధురానగర్ మెట్రో స్టేషన్ మొదటి అంతస్తులో 1,300 చదరపు అడుగుల విస్తీర్ణంలో మినీ క్రికెట్, మిషన్ బాల్ సదుపాయాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. వర్ధమాన క్రికెటర్లకు నాణ్యమైన కోచింగ్‌ను అందించడమే లక్ష్యంగా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అండర్–14 పిల్లలతో పాటు ప్రొఫెషనల్ క్రికెటర్లకు వ్యక్తిగత కోచింగ్ కూడా ఉంటుంది. బ్యాచ్‌కు 8–10 మంది విద్యార్థులుంటారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రోజంతా ప్రాక్టీస్ సెషన్స్ ఉంటాయి. ఫీజు నెలకు ఒక్కరికి రూ.3,500. త్వరలో వేసవి శిబిరం కూడా ప్రారంభమవుతుందని తెలిపారు.

కన్న కొడుకును కడతేర్చిన తండ్రి

మద్యం తాగి పరువు తీస్తున్నాడని ఆక్రోశం



మృతిచెందిన వినయ్ (ఫైల్‌ఫోటో)

మన్సూరాబాద్/హయత్‌నగర్: మద్యం తాగి కుటుంబ పరువు తీస్తున్నాడని కలత చెందాడో..ఆస్తి తగాదాలు ఉన్నాయో తెలియలేదు కానీ..ఓ తండ్రి కన్న కొడుకును కడతేర్చాడు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన కలగోని శ్రీనివాస్‌గౌడ్ గత కొంత కాలంగా మునగనూరులోని రామాంజనేయకాలనీ రోడ్‌నెంబర్–7 స్వంత ఇంటిలో నివాసం ఉంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వినయ్ (28) ఐదు సంవత్సరాల క్రితం ప్రవల్లికను ప్రేమించి పెళ్లి చేసుకుని సమీపంలోని ఓ ఇంట్లో భార్యతో కలిసి నివాసముంటున్నాడు. వీరికి రెండేళ్ల పాప రక్షిత ఉంది. ఇటీవల కొద్ది కాలంగా వినయ్ తరచుగా మద్యం తాగి తండ్రి శ్రీనివాస్‌గౌడ్ నివాసానికి వచ్చి వ్యాపారం చేసుకుంటా డబ్బులు ఇవ్వాలని గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి గొడవ పడ్డాడు. వ్యాపారం చేసుకుంటా..ఆస్తిలో తన భాగం ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అలాగే మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని అడిగాడు. చేసేది లేక శ్రీనివాస్‌గౌడ్ రూ.500 మద్యానికి ఇచ్చాడు. అనంతరం వినయ్ మద్యం తెచ్చుకుని తాగి మరింతగా ఇంట్లో గొడవకు దిగాడు. దీంతో ఆవేశానికి లోనైన శ్రీనివాస్‌గౌడ్ అక్కడే ఉన్న ఇనుప పారతో వినయ్ తలపై గట్టిగా బాదాడు. దీంతో తలకు తీవ్ర గాయమై వినయ్ కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఈ ఘటనకు ఆస్తి తగాదాలే కారణమని కూడా తెలుస్తోంది. హయత్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. శ్రీనివాస్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

'సౌత్ జోన్ గోల్ఫ్ టూర్'లో సత్తా చాటిన వివాన్



వివాన్ పిన్నపురెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: చెన్నై వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జూనియర్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన జూనియర్ గోల్ఫ్ క్రీడాకారుడు వివాన్ పిన్నపు రెడ్డి సత్తా చాటాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా టీఎన్‌జీఎఫ్ గోల్ఫ్ కోర్స్‌లో జరిగిన 'సౌత్ జోన్ గోల్ఫ్ టూర్ 2024' సీ కేటగిరి బాలుర విభాగంలో వివాన్ ద్వితీయ స్థానంలో రన్నరప్‌గా నిలిచాడు. పదేళ్ల వయసున్న వివాన్ ప్రస్తుతం తుక్కుగూడలోని అగాఖాన్ అకాడమీలో 5వ తరగతి చదువుతున్నాడు. 8వ ఏట నుంచే తాత హరోత్తం రెడ్డి ప్రోత్సాహంతో గోల్ఫ్ క్రీడలో రాణిస్తున్న వివాన్..ఇప్పటికే హైదరాదాద్ గోల్ఫ్ క్లబ్, బౌల్డర్‌హిల్స్ గోల్ఫ్ క్లబ్ తదితర వేదికల్లో నిర్వహించిన పోటీల్లో మెడల్స్ సాధించారు. గతంలో ఈ, డీ బాలుర విభాగాల్లో సాలుగు సార్లు విజేతగా పతకాలను సాధించాడు.

ఐజీయూ నేషనల్స్ ఆడటమే లక్ష్యం..

సౌత్ జోన్ గోల్ఫ్ టూర్‌లో విజేతగా నిలిచిన సందర్భంగా వివాన్ మాట్లాడుతూ., రానున్న సంవత్సరంలో ఐజీయూ నేషనల్స్ ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నానని, దీని కోసం ప్రత్యేకంగా హైదరాదాద్ గోల్ఫ్ క్లబ్, బౌల్డర్‌హిల్స్ గోల్ఫ్ క్లబ్‌లలో శిక్షణ తీసుకుంటున్నానని అన్నారు. సీ కేటగిరీలో ఐజీయూ నేషనల్స్‌లో స్థానం పొందాలంటే ముందస్తుగా జరిగే దాదాపు 12 గోల్ఫ్ మ్యాచ్‌ల్లో కనీసం 8 అయినా ఆడి, అందులో టాప్ 5లో నిలవాలని అన్నారు. బెంగుళూరు తరహాలో నగరంలో కూడా జూనియర్ గోల్ఫ్ పోటీలు, ఛాంపియన్‌షిప్స్ నిర్వహించాల్సిన అవసరముందని వివాన్ తల్లి హావనీ రెడ్డి పేర్కొన్నారు. నేషనల్స్ స్థాయిలో జూనియర్ గోల్ఫ్ క్రీడాకారులు రాణించాలంటే నగరంలో సీనియర్ గోల్ఫ్ టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లుగానే జూనియర్స్ పోటీలు పెరగాలని, అప్పుడే ఇలాంటి చిన్నారులకు ఒత్తిడి తగ్గి, అనుభవం పెరుగుతుందని ఆశించారు.

నాసిరకం ముడి సరుకు.. రసాయనాలు



అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీ

- నిల్వ ఉండేందుకు రసాయనాల వినియోగం
- ప్యాక్‌ చేసి ఇరుగు పొరుగు రాష్ట్రాలకూ సరఫరా
- గుట్టురట్టు చేసిన సెంట్రల్‌ జోన్‌ టాస్క్‌ఫోర్స్‌ టీమ్‌

సాక్షి, సిటీబ్యూరో: నాసిరకం ముడిసరుకుతో అల్లం-వెల్లుల్లి పేస్టు తయారు చేయడం... ఇది ఎక్కువ రోజులు నిల్వ ఉండటం కోసం రసాయనాలకు కలపడం... తెలంగాణ సహా నాలుగు రాష్ట్రాలకు సరఫరా చేసి విక్రయించడం... ఈ పంథాలో వ్యవస్థీకృతంగా దందా చేస్తున్న ముఠాకు మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు చెక్‌ చెప్పారు. నలుగురు నిందితులను పట్టుకుని, వీరి నుంచి భారీ పరిమాణంలో నాసిరకం ముడిసరుకు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ ఎస్‌.రష్మి పెరుమాల్‌ బుధవారం వెల్లడించారు. ఫుడ్‌ సేఫ్టీ నిబంధనల ప్రకారం ఏ ఆహార పదార్థంలోనూ ప్రిజర్వేటివ్స్‌ వినియోగించకూడదని ఆమె పేర్కొన్నారు. గుజరాత్‌కు చెందిన రహీమ్‌ చారినియా బతుకుతెరువు కోసం నగరానికి వలసవచ్చి బేగంపేటలో స్థిరపడ్డాడు. డెక్కన్‌ ట్రేడర్స్‌ పేరుతో నిత్యావసర వస్తువులు వ్యాపారం చేస్తున్న ఇతను తేలిగ్గా డబ్బు సంపాదించాలని భావించాడు. నాసిరకం ముడిసరుకులతో అల్లం-వెల్లుల్లి పేస్ట్‌ తయారు చేసి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకుగాను రాజేంద్రనగర్‌ పరిధిలోని ఉప్పర్‌పల్లిలో ఓ కార్ఖానా ఏర్పాటు చేశాడు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే నాసిరకం అల్లం, వెల్లుల్లి కొనుగోలు చేసి వాటిని ఉప్పర్‌పల్లిలోని కార్ఖానాలో ఏర్పాటు చేసిన మిషన్‌ ద్వారా పేస్టుగా మార్చి సిట్రిక్‌ యాసిడ్‌తో పాటు గుర్తుతెలియని పొడి కలుపుతూ ఆకర్షణీయమైన వాసన వచ్చేలా చేస్తున్నాడు. ఇది ఎక్కువ రోజులు నిల్వ ఉండటం కోసం సిట్రిక్‌ యాసిడ్‌తో ఎర్రరంగు రసాయనాన్ని ప్రిజర్వేటివ్‌గా కలుపుతున్నాడు. దీనిని ప్యాక్‌ చేసి బేగంపేటకు చెందిన పాండురంగారావు ద్వారా బేగంబజార్‌లో తెలంగాణ ఏజెన్సీ నిర్వహించే అజయ్‌ కుమార్‌ అహీర్‌, నిఖిల్‌ ట్రేడర్స్‌ నిర్వాహకుడు ప్రదీప్‌ సంక్లాలకు సరఫరా చేస్తున్నాడు. వీరు ఈ అల్లం-వెల్లుల్లి పేస్ట్‌ను నగరంలోని దుకాణాలతో పాటు ఇతర జిల్లాలు, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు సరఫరా చేస్తున్నారు. కొన్నాళ్లుగా సాగుతున్న ఈ దందాపై సెంట్రల్‌ జోన్‌ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్‌ బి.రాజు నాయక్‌ నేతృత్వంలో ఎస్సైలు సీహెచ్‌ నవీన్‌కుమార్‌, ఎస్‌.సాయి కిరణ్‌ తమ బృందాలతో వలపన్నారు. పాటిగడ్డ వద్ద పాండురంగారావును పట్టుకున్నారు. ఇతడి విచారణలో పూర్తి వివరాలు వెలుగులోకి రావడంతో మిగిలిన ముగ్గురినీ అదుపులోకి తీసుకుని బేగంపేట పోలీసులకు అప్పగించారు. వీరి నుంచి 700 కేజీల అల్లం-వెల్లుల్లి పేస్ట్‌, 625 కేజీల అల్లం, 100 కేజీల వెల్లుల్లి, 20 కేజీల రసాయనాలు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రిజర్వేటివ్స్‌గా వాడుతున్న రసాయనాలకు గుర్తించడానికి నమూనాలకు ఫోరెన్సిక్‌ పరీక్షలకు పంపనున్నారు. ఇలాంటి అల్లం-వెల్లుల్లి పేస్ట్‌ వాడటం ఆరోగ్యానికి హానికరం అని పోలీసులు పేర్కొన్నారు.

ఢిల్లీలో చోరీ... సిటీలో విక్రయం!

కర్ణాటకలోనూ కొన్ని వాహనాల అపహరణ

- తక్కువ ధరకు నగరంలో అమ్మకం
- గుట్టురట్టు చేసిన హైదరాబాద్‌ సీసీఎస్‌ స్పెషల్‌ టీమ్‌
- 10 మంది అరెస్టు... 12 ఖరీదైన కార్లు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: ఢిల్లీతో పాటు కర్ణాటకలో చోరీ చేసిన కార్లను హైదరాబాద్‌కు తరలించి తక్కువ ధరకు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంతో పాటు ఆంధ్రప్రదేశ్‌, ఢిల్లీలకు చెందిన పది మందిని అరెస్టు చేశామని, వీరి నుంచి రూ.3.5 కోట్ల విలువైన 12 ఖరీదైన కార్లు స్వాధీనం చేసుకున్నట్లు డిటెక్టివ్‌ డిపార్ట్‌మెంట్‌ డీసీపీ ఎన్‌.శ్వేత తెలిపారు. నగరానికి చెందిన కార్తీక్‌, షేక్‌ అబ్దుల్లా, మహ్మద్‌ ఫెరోజ్‌, షేక్‌ షాహెద్‌ అలీ, జి.శివకుమార్‌, మహ్మద్‌ తౌసిఫ్‌, లవణ్‌ కుమార్‌ స్నేహితులు. వీరు ఏడుగురు తక్కువ ధరలో కార్లు ఖరీదు చేసి, విక్రయించాలని భావించారు. ఇందుకుగాను ఓఎల్‌ఎక్స్‌లో సెర్చ్‌ చేసి, అందులో తమ కార్లను పోస్టు చేసిన కొందరు యజమానులను సంప్రదించారు. ఇలా వీరికి మదనపల్లెకు చెందిన సోను, సైఫ్‌ అలీ ఖాన్‌లతో పాటు బెంగళూరు వాసి సయిాద్‌ పరిచయం ఏర్పడింది. కార్ల ధరపై బేరసారాలు ఆడుతున్న నేపథ్యంలోనే వీళ్ల చోరీ కార్లు అయితే మరింత తక్కువ ధరకు విక్రయించగలమని చెప్పారు. ఇందుకు నగరానికి చెందిన ఏడుగురూ అంగీకరించడంతో వాట్సాప్‌ గ్రూప్‌లు క్రియేట్‌ చేసుకున్నారు. వీటిలో ఢిల్లీకి చెందిన కొందరు చోరులూ సభ్యులుగా ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ముఠాలు ఢిల్లీ, బెంగళూరుల్లో చోరీ చేసిన వాహనాల ఫొటోలను వీటిలో పోస్టు చేసే వాళ్లు. ఆసక్తి చూపిన వారికి దాని రేటు చెప్పే వారు. బేరసారాల తర్వాత నగదు డిపాజిట్‌ చేయించుకుని, డ్రైవర్‌ ద్వారా వాహనం పంపేవారు. ఇలా ఇప్పటి వరకు ఢిల్లీలో చోరీ అయిన 11, బెంగళూరులో తస్కరణకు గురైన ఒక కారు సిటీకి వచ్చాయి. వీటిని నగరంలో ఉన్న ఏడుగురూ నెంబర్‌ ప్లేట్‌ మార్చి విక్రయానికి పెట్టారు. వాస్తవ ధరకంటే చాలా తక్కువ చెప్పే వీరు తొలుత అడ్వాన్స్‌ తీసుకుని వాహనం అప్పగించారు. వాహనానికి సంబంధించిన పత్రాలు ఆయా ప్రాంతాల నుంచి రావాల్సి ఉందని, అవి ఇచ్చిన తర్వాత మిగిలిన మొత్తం ఇవ్వాలని చెప్పేవారు. ఆ తర్వాత నుంచి ఆ కస్టమర్‌కు దొరక్కుండా తప్పించుకుని తిరిగే వారు. వినియోగదారులు సైతం మొత్తం చెల్లించలేదనే ఉద్దేశంతో మిన్నకుండిపోయే వాళ్లు. కొందరు కస్టమర్లు ఇలా మోసపోగా... మరికొందరు ఇవి చోరీ వాహనాలని తెలిసీ ఖరీదు చేశారు. సీసీఎస్‌లోని స్పెషల్‌ జోనల్‌ క్రైమ్‌ టీమ్‌ అధికారులు బుధవారం బహదూర్‌పుర చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నెంబర్‌ ప్లేట్‌ లేని వాహనంలో వస్తున్న లవణ్‌ కుమార్‌ వీరికి తారసపడ్డాడు. వాహనం ఆపగా... అతడు కారు దిగి పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులకు అసలు విషయం తెలియడంతో మిగిలిన వారినీ అరెస్టు చేశారు.

ఎస్‌బిఐ గృహకల్ప శాఖలో రూ.32.8 లక్షలు మాయం

- మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఖాతా నుంచి స్వాహా
- సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు బాధితుల ఫిర్యాదు

నాంపల్లి: స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా గృహకల్ప శాఖలో దొంగలు పడ్డారు. మృతి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అకౌంట్‌లో నుంచి రూ.32,80,000 మాయం చేశారు. బాధితుడు ప్రశాంత్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వీఎస్‌ఆర్‌ ప్రసాద్‌ గాంధీ ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేసి రిటైర్‌ అయ్యారు. వీరికి రోహిణి, నందిని, ప్రశాంత్‌, వి.తరణి, వి.శాలిని అనే ఐదుగురు సంతానం. ప్రసాద్‌ పేరిట స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బిఐ) గృహకల్ప శాఖలో ఖాతా ఉంది. మూడేళ్ల కిందట వీఎస్‌ఆర్‌ ప్రసాద్‌ మృతి చెందాడు. గత సోమవారం ఆయన కుటుంబసభ్యులు స్టేట్‌మెంట్‌ తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్లగా ఖాతాలో ఉన్న డబ్బులు మాయమైనట్లు తెలిసింది. దీంతో శాఖ మేనేజర్‌ సంప్రదించగా ఫిబ్రవరి 16 నుంచి ఫిబ్రవరి 22 వరకు రోజుకు రూ.5 లక్షల చొప్పున డ్రా చేశారని, ఫిబ్రవరి 22న రూ.2 లక్షల 80 వేలు డ్రా చేసినట్లు తెలిపాడు. గుర్తు తెలియని వ్యక్తులు తమ తండ్రి పేరున తప్పుడు కేవైసీని అప్డేట్‌ చేసుకుని, ఫోన్‌ నంబర్‌ను మార్చి ఖాతాలోని నగదును కాజేసినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యులందరూ ఒకేచోట లేని కారణంగా బ్యాంకు ఖాతాను క్లోజ్‌ చేయలేకపోయామని తెలిపారు. డెత్‌ సర్టిఫికెట్‌, లీగలేర్‌ సర్టిఫికెట్‌ సమర్పించినా బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.



ఎస్‌బిఐ గృహకల్ప శాఖ కార్యాలయం

ఆరుగంటల్లో పట్టేశారు..

- పద్మారావునగర్‌లో చైన్‌స్నాచింగ్‌
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఈస్ట్‌ జోన్‌ టాస్క్‌ఫోర్స్‌

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా పరిధిలోని పద్మారావునగర్‌లో బుధవారం మధ్యాహ్నం చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని 6 గంటల్లో ఈస్ట్‌ జోన్‌ టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పద్మారావునగర్‌ స్కందగిరి ఆలయ సమీపంలోని ఇంట్లో వృద్ధురాలు తుల్జాబాయి (80) ఒంటరిగా నివాసం ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం ఆమె ఇంటి తలుపులు తెరిచి హాల్‌లో కూర్చుని టీవీ చూస్తోంది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగుడు ప్రహరీ దూకి హాల్‌లోకి ప్రవేశించాడు. ఎవరు, ఎందుకువచ్చావని ప్రశ్నించే లోగా, ఆమె నోరు మూసి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. దీంతో షాక్‌కు గురైన తుల్జాబాయి కొద్దిసేపటి తర్వాత తేరుకుని గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. నిందితుడి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా రాత్రి 9 గంటల సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడికి ఇతర కేసులతో సంబంధం ఉందా అనే కోణంలో విచారణ చేపట్టారు. గురువారం నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరచనున్నట్లు సమాచారం.

సోలార్‌ ప్యానెల్‌ ఏర్పాటుతో ఉచిత విద్యుత్‌

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ పీఎం సూర్య ఘర్‌ ముఫ్త్‌ బిజిలీ యోజన పథకం కింద సోలార్‌తో 300 యూనిట్స్‌ ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్‌ శాఖ సికింద్రాబాద్‌ డివిజన్‌ సీనియర్‌ సూపరింటెండెంట్‌ సుబ్రమణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద గృహాల పైకప్పులపై సోలార్‌ ప్యానెల్స్‌ ఏర్పాటు చేసుకునేందుకు అయ్యే ఖర్చులో సుమారు 40 శాతం వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఇందుకోసం పోస్టల్‌శాఖ నిర్వహించే సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు దగ్గర్లోని పోస్ట్‌ ఆఫీస్‌, లేదా పోస్ట్‌మ్యాన్‌ను సంప్రదించాలని సూచించారు.

హౌసింగ్‌ సొసైటీ అక్రమాలపై విచారణ జరిపించాలి

కో ఆపరేటివ్‌ డైరెక్టర్‌కు సొసైటీ సభ్యుల ఫిర్యాదు



సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగర్‌ టీ ఎన్జీవోస్‌ మ్యూచువల్లీ ఎయిడెడ్‌ కో-ఆపరేటివ్‌ హౌసింగ్‌ సొసైటీ లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు సభ్యులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌ గృహకల్ప కాంప్లెక్స్‌ లోని సహకార శాఖ కార్యాలయంలో సొసైటీ సభ్యుల ప్రతినిధి బృందం కో- ఆపరేటివ్‌ డైరెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీలో రూ. కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. 2008లో లబ్దిదారుల జాబితాను ఆమోదించి విడుదల చేసినప్పటికీ, సొసైటీ పేరును రూల్స్‌ కు వ్యతిరేకంగా మార్పు చేసి అర్హతలేని పంచాయతీ కార్యదర్శులు, మార్కెట్‌ యార్డుల్లో పనిచేసే ఉద్యోగులు, జిల్లాల్లోని ఉద్యోగులనుంచి రూ. కోట్లు వసూలు చేసి ఎలాంటి రసీదులు ఇవ్వకుండా సభ్యత్వం ఇచ్చారన్నారు. సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్‌, సెక్రెటరీ మల్లారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌, కమిటీ సభ్యులు కొందరు కుమ్మక్కై భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ల్యాండ్‌ ప్రభుత్వ అధీనంలో ఉన్నప్పటికీ అసత్య ప్రచారం చేస్తూ డబ్బులు వసూలు చేశారన్నారు. తెలంగాణ మ్యాక్స్‌ యాక్ట్‌, 1995 లోని సెక్షన్‌ 29 ప్రకారం ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, విచారణ పూర్తయ్యేవరకు సొసైటీ నిధులను ప్రస్తుత మేనేజింగ్‌ కమిటీ డ్రా చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని వారు డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో పాండురంగారావు, నరసింగరావు, వెంకటేశ్వర రావు, ప్రసాద రావు, మహేష్‌ కుమార్‌, ధన్‌రాజ్‌ , సి శ్రీనివాస రావు, హేమలత, కొఆపరేటివ్‌ నాగార్జున్‌, వేంకటేశ్వర రావు ఉన్నారు.

‘రెడ్‌ బుల్‌ సోప్‌బాక్స్‌ రేస్‌’కు నగరం సిద్ధం

మార్చ్‌ 3న రామానాయుడు స్టూడియోస్‌, ఫిల్మ్‌ నగర్‌, జూబ్లీహిల్స్‌లో రేస్‌..



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ‘రెడ్‌ బుల్‌ సోప్‌బాక్స్‌ రేస్‌’ మూడో ఎడిషన్‌కు హైదరాబాద్‌ నగరం వేదికగా మారనుంది. బెల్జియం, స్పెయిన్‌, ఇటలీ, యూకే, యూఎస్‌ఏ, ఫ్రాన్స్‌, జర్మనీ వంటి దేశాలతో ప్రసిద్ధ రేసులను నిర్వహించిన రెడ్‌ బుల్‌ సోప్‌బాక్స్‌ రేస్‌ మార్చ్‌ 3న నగరంలోని రామానాయుడు స్టూడియోస్‌, ఫిల్మ్‌ నగర్‌, జూబ్లీ హిల్స్‌లో సాయంత్రం 5 గంటలకు జరగనుంది. గతంలో జరిగిన రెండు ఎడిషన్లకు ముంబై వేదిక కాగా ఈ సారి నగరంలో నిర్వహించనున్నారు. ఈ రేసు కోసం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 3300 రిజిస్ట్రేషన్‌ల నుంచి షార్ట్‌లిస్ట్‌ చేసిన 30 టీమ్‌లు మాత్రమే వారి ప్రత్యేక వాహనాలతో దూసుకుపోనున్నారు. ఈ రేసుల్లో పాల్గొనే వారు సృజనాత్మకతతో నిర్మించుకున్న నాన్‌-మోటరైజ్డ్‌ సోప్‌ బాక్స్‌ వాహనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ రేసింగ్‌ కార్యక్రమాల్లో కులు బాజీ, రోహన్‌ జోషి, సాహిబా బాలి, జోర్డిండియన్‌ అని పిలుచుకునే ఆదిత్య కులశ్రేష్ఠ వంటి క్రియేటివ్‌ హోస్ట్‌లు సందడి చేయనున్నారు. అంతేకాకుండా ప్రముఖ చెస్‌ ప్లేయర్‌ తానియా సచ్‌దేవ్‌, భారత హాకీ ప్లేయర్‌ మన్‌ప్రీత్‌ సింగ్‌, హాకీ ప్రాడిజీ లాల్‌రెమ్సియామి, డాకర్‌ ర్యాలీ 2 ఛాంపియన్‌ హరిత్‌ నోహ్‌ వంటి ప్రముఖులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ రేసుల్లో ఎస్‌8యూఎల్‌ గేమింగ్‌, గాడ్‌లైక్‌ గేమింగ్‌, టెక్నో గేమర్జ్‌, జోస్‌ కోవాకో, జెర్క్స్‌, ఆర్ట్‌ గై రాబ్‌ వంటి ప్రముఖ క్రియేటర్‌లు తమ సొంత కార్ట్‌లలో వాలుపై పరుగెత్తనున్నారు. ఈ రేసుకు సంబంధించిన టిక్కెట్లు https://in.bookmyshow.com/sports/red&bull&soapbox&race/ET00385383 లో అందుబాటులో ఉంటాయని, ప్రత్యక్షంగా వీక్షించలేని రేసింగ్‌ అభిమానులు జియో టీవీలో రెడ్‌ బుల్‌ సోప్‌బాక్స్‌ రేస్‌ను ప్రత్యక్షంగా చూడవచ్చని తెలిపారు.

ముందు జాగ్రత్తలతో కేన్సర్‌ నివారణ: కలెక్టర్‌



కలెక్టరేట్‌లో కేన్సర్‌ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: కేన్సర్‌కు నిర్దిష్టమైన మందులు లేవని, అది రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు ఉత్తమమని హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కేన్సర్‌ స్క్రీనింగ్‌ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 సంవత్సరాలు దాటిన మహిళలు స్క్రీనింగ్‌ పరీక్షలు జరిపించుకోవాలని, దీనితో రానున్న ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చన్నారు. సర్వైకల్‌, బ్రెస్ట్‌ కేన్సర్లను ముందుగా గుర్తిస్తే సత్వర చికిత్స ద్వారా స్వస్థత పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ నిర్మలా ప్రభావతి, ఎంఎన్‌జే కేన్సర్‌ ఇన్‌స్టిట్యూట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ జయలత, గైనిక్‌ విభాగం హెడ్‌ డాక్టర్‌ లీల, డాక్టర్‌ శాలిని, డాక్టర్‌ స్వప్న, పారామెడికల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో విజయవంతంగా టెడ్‌ ఎక్స్‌

సాక్షి, సిటీబ్యూరో: సృజనాత్మక ఆలోచనలకు, భావితరాల నాయకత్వానికి నిలువుటద్దంలా నిలిచే ప్రతిష్టాత్మక టెడ్‌ ఎక్స్‌ వేదికపై చిన్నారులు పంచుకున్న ఆలోచనలు అందరినీ అబ్బురపరిచాయి. మియాపూర్‌లోని శ్రీ చైతన్య ఫ్యూచర్‌ పాత్‌వేస్‌ క్యాంపస్‌లో టెడ్‌ ఎక్స్‌ నిర్వహించారు. 6 నుంచి 8వ తరగతికి చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పలు అంశాలపై తమదైన శైలిలో మాట్లాడారు. భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలు, ప్రపంచ దేశాల్లో భారత్‌ దేశ పాత్ర తదితర అంశాలపై నిశితమైన భావనతో విద్యార్థులు ప్రసంగించారు. ప్రిన్సిపాల్‌ భావన పాథక్‌, శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్‌ సీమ బొప్పన, చీఫ్‌ అకాడమిక్‌ ఆఫీసర్‌ పుష్పవల్లి తదితరులు పాల్గొన్నారు.



గాల్లో పల్టీలుకొట్టిన కారు

బంజారాహిల్స్‌: ఒక కారు గాల్లో పల్టీలు కొట్టిన సంఘటన జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..మలక్‌ పేటకు చెందిన ఇంటర్మీడియట్‌ విద్యార్థి(17) తన స్నేహితుడి(17)తో కలిసి బుధవారం ఉదయం కారులో జూబ్లీహిల్స్‌ రోడ్‌ నంబరు 45 జంక్షన్‌ మీదుగా మాదాపూర్‌ వైపు వెళ్తున్నాడు. రోడ్‌ నంబర్‌ 45లోని ఫ్లైఓవర్‌ ఎక్కే క్రమంలో కారు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి గాలిలోకి ఎగిరి రోడ్డుకు అవతలి వైపు పడింది. అదే సమయంలో మాదాపూర్‌ నుంచి జూబ్లీహిల్స్‌ వైపు వస్తున్న క్యాబ్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. జూబ్లీహిల్స్‌ పోలీసులు, ట్రాఫిక్‌ పోలీసులు అక్కడికి చేరుకుని రెండు కార్లను అక్కడి నుంచి తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. కారు నడుపుతున్న విద్యార్థితోపాటు అతని స్నేహితుడికి, మరో కారు డ్రైవర్‌కు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించగా, ఎవరూ మద్యం సేవించలేదని తేలింది. అతి వేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లు గుర్తించిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. క్యాబ్‌ డ్రైవర్‌ మధుసూదన్‌ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మైనర్లకు వాహనాన్ని ఇచ్చిన కారు యజమానిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

వలస కార్మికుడి దారుణ హత్య

జీడిమెట్ల: బీహార్‌కు చెందిన వలస కార్మికుడు దారుణహత్యకు గురైన సంఘటన జీడిమెట్ల ఠాణా పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాసరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం హెచ్‌ఎంటీలోని నిర్మానుష్య ప్రదేశంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు అతను హత్యకు గురైనట్లు గుర్తించి క్లూస్‌టీం సహాయంతో, ఆధారాలు సేకరించారు. ఘటనాస్థలిలో బీర్‌ సీసాలు పడి ఉండటంతో వాటితో తలపై మోది హత్యచేసినట్లు నిర్ధారణకు వచ్చారు. మృతదేహం వద్ద లభించిన ఆధారాల ప్రకారం మృతుడు బీహార్‌కు చెందిన రమేష్‌రామ్‌(48)గా గుర్తించారు. అతను కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి రాంరెడ్డినగర్‌లో నివాసం ఉంటూ అదే ప్రాంతంలోని డ్రమ్ముల పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఐదురుగు కుమారులు ఉన్నారు. మంగళవారం ఉదయం రమేష్‌రామ్‌ బ్యాంకు ఖాతా తెరిచేందుకు ఇంటి నుండి బయటికి వచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టూరిజం అభివృద్ధికి సహకరించండి

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- తెలుగు వారియర్స్‌తో పర్యాటక శాఖ భాగస్వామ్యం



తెలుగు వారియర్స్‌తో మంత్రి జూపల్లి కృష్ణారావు

గోల్కొండ: తెలంగాణలో టూరిజం ప్రమోషన్‌లో భాగంగా సెలబ్రిటీ క్రికెట్‌ లీగ్‌ టోర్నమెంట్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ తెలుగు వారియర్స్‌తో భాగస్వామి అవుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం గోల్కొండ తారామతి బారాదరిలో ప్రీ ఈవెంట్‌ మీట్‌ ఆఫ్‌ తెలుగు వారియర్స్‌ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.... మార్చి 1 నుంచి 3 వరకు ఉప్పల్‌ స్టేడియంలో జరుగనున్న 2వ దశ సెలబ్రిటీ క్రికెట్‌ లీగ్‌కు ఈ సారి విశేష స్పందన రావడం ఖాయమన్నారు. తెలుగు వారియర్స్‌తో తమ శాఖ జతకట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుగువారియర్‌ టీమ్‌ ప్లేయర్స్‌తో ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సుధీర్‌ బాబు, ఆది, సుశాంత్‌, ప్రిన్స్‌, అశ్విన్‌, ఆదర్శ్‌ బాలకృష్ణ, ప్రముఖ సంగీత దర్శకుడు థమన్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు ఆల్‌దబెస్ట్‌ తెలుపుతూ ‘మీ అందరినీ చూస్తుంటే తాను చిన్నప్పుడు క్రికెట్‌ ఆడిన రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు’. సినిమాతారలు, క్రికెటర్లు ఒకే వేదికపై కనబడితో ప్రేక్షకులకు కన్నుల పండుగేనని అన్నారు. సీసీఎల్‌ను విజయవంతం చేయడానికి తమ అండదండలు ఉంటాయని, తెలంగాణలో టూరిజం అభివృద్ధికి భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ డైరెక్టర్‌ నిఖిల, కార్పొరేషన్‌ ఎండీ రమేష్‌ నాయకుడు సీసీఎల్‌ వ్యవస్థాపకులు విష్ణు ఇందూరి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయండి



ఎన్బీటీ నగర్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నెం. 12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో మధ్యలో వదిలేసిన సీసీ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎన్బీటీ నగర్ బస్తీలో ఆమె జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్, ఏఈ నగేష్‌తో కలిసి పర్యటించారు. పోచమ్మ గుడి నుంచి ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాల వరకు రోడ్డు పనులు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఆ పనులు ప్రారంభించాలని అన్నారు. అధికారులు ఒకటి, రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్ బస్తీతో పాటు పరిసర బస్తీల్లో ఐదు రోజులుగా నల్లాలో మంచినీరు రావడం లేదని బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం పట్ల జలమండలి జీఎం హరిశంకర్ స్పందించి సంబంధిత అధికారులతో ఇందుకు గల కారణాలపై ఆరాతీశారు. వాల్వ్ ఉన్న మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటుచేసి తాళం వేయాలని, నీళ్లు వదిలినప్పుడు మాత్రమే లైన్‌మెన్ తాళం తీసి వాల్వ్ విప్పేవిధంగా చర్యలు తీసుకోవాలని మేనేజర్‌ను ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. బుధవారం అన్ని బస్తీల్లో నీళ్లు వదిలారు.

పైప్‌లైన్ల నిర్మాణానికి నిధులివ్వండి



ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మన్నె కవిత

వెంకటేశ్వరకాలనీ: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని వెంకటేశ్వర కాలనీ కార్పొరేటర్ మన్నె కవిత విజ్ఞప్తి చేశారు. ఆమె బుధవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో వివిధ చోట్ల కొత్తగా మంచినీరు, డ్రైనేజీ లైన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారని, బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

ఒహిరీస్ బంజారాలో 'మింగ్స్ అండ్ మీ మెనూ'



మింగ్స్ అండ్ మీ మెనూను లాంచ్ చేస్తున్న ఒహిరీస్ ప్రతినిధులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నెం. 12లోని ఒహిరీస్ బంజారా హోటల్‌లో ఇండో చైనీస్ మలేషియన్ వంటకాలైన మింగ్స్ అండ్ మీ మెనూను సంస్థ జీఎం శేలేష్‌సాయి, క్రియేటివ్ ఎగ్జిక్యూటీవ్ సుభాష్, షెఫ్ గురుబాజ్ సింగ్ నందులు ఆవిష్కరించారు. బుధవారం హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఈ రుచులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జపాన్, చైనా, మలేషియన్ రుచికరమైన స్పైసీ వంటకాలతో పాటు సౌత్ ఇండియా వంటకాలను కూడా తాము అందిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా 'ఫన్‌స్కూల్'వార్షికోత్సవం



ఫన్‌స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో చిన్నారుల ప్రదర్శనలు

శ్రీనగర్‌కాలనీ: చిన్నారులు ఆహారం, పర్యావరణం, అలవాట్లు, ఆహార్యం, పరిశుభ్రత లాంటి వాటిపై చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మోతీనగర్ ఫన్‌స్కూల్ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, పర్యావరణ పరిరక్షణపై చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ప్రిన్సిపాల్ క్యాండిస్ మాథ్యూ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆవిర్భావం



సీఎండీని కలిసిన అసోసియేషన్ సభ్యులు

ఖైరతాబాద్: టీఎస్ఎస్‌పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2024–25గాను షెడ్యూల్ ఆఫ్ రేట్స్ కమిటీని ఏర్పాటు చేయాలని, మార్కెట్ ధరలకు సమానంగా రేట్లు నిర్ణయించాలని ఇతరత్రా కాంట్రాక్టర్ల సమస్యలపై విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. నూతన రాష్ట్రంలో కొంత విద్యుత్ సరఫరా అంతరాయం వల్ల కొందరు రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని పెట్టుకున్నారని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కొత్త విద్యుత్ లైన్‌లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, మరమ్మత్తులు అందరికి తెలిసేటట్లుగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పినట్లు సభ్యులు తెలిపారు. టీఎస్ఎస్పీడీసీఎల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, మెదక్ నుంచి విశ్వేశ్వరరావు, నల్గొండ నుంచి బ్రహ్మాచారి, సూర్యాపేట నుంచి రమేష్, మహబూబ్‌నగర్ నుంచి మోహన్, వనపర్తి నుంచి సాయి రమేష్ తదితరులు ఉన్నారు.



ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల నమూనాలు



శ్రీకృష్ణానగర్ సాయిరాం స్కూల్‌లో...

చిట్టి బుర్రల్లో ఎన్నెన్ని ఆలోచనలో...

- పాఠశాలల్లో సందడిగా నేషనల్ సైన్స్‌డే
- ఆలోచింపజేలా వైజ్ఞానిక అంశాల రూపకల్పన
- సరికొత్త ఆవిష్కరణలతో భళా అనిపించుకున్న విద్యార్థులు



శ్రీనిధి స్కూల్‌లో...

బంజారాహిల్స్: నేషనల్ సైన్స్‌డే సందర్భంగా పలు స్కూళ్లలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు అబ్బురపరిచే, ఆలోచింపజేసే నమూనాలను ప్రదర్శించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌సీఎల్, నిర్మాణ్ అనే స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌లో తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వారు పలు అంశాలపై ఏర్పాటు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయిరాం స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను విద్యాసంస్థల చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించి విద్యార్థులను అభినందించచారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు విబిన్న రకాల వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత వారికి బహుమతులు అందజేశారు.

శ్రీనిధి స్కూల్‌లో

వెంగళరావునగర్: మధురానగర్ కాలనీలోని శ్రీనిధి స్కూల్‌లో బుధవారం జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల నమూనాలు తయారు చేసుకొచ్చి ప్రదర్శించారు. సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి కె.వి.రావు సైంటిఫిక్ ఇనిస్టిట్యూట్ జనరల్ సెక్రటరీ కె.రత్న హాజరై సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. స్కూల్ డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్, సుకుమార్, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి, కో ఆర్డినేటర్ సాయిరామ్, ఇన్‌చార్జి అనిత, పూర్ణిమ, కుముదవల్లి, టీచర్లు పాల్గొన్నారు.



బంజారాహిల్స్ సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో...

సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అపార అవకాశాలు



ఎంజేసీఈటీలో సైన్స్ డే వేడుకల్లో వక్తలు

బంజారాహిల్స్: ముఫకంజాహ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంజేసీఈటీ)లో నేషనల్ సైన్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్' అంశంపై సదస్సు జరిగింది. బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ హెడ్ ప్రొఫెసర్ అబ్దుల్ మాజీద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంజేసీఈటీ ప్రిన్సిపాల్ డాక్టర్ మహిపాల్‌సింగ్ రావత్ మాట్లాడుతూ... సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. డీఎంఆర్ఎల్ రవీంద్రనాథ్ బొబ్బిలి 'మెటీరియల్స్ డిజైన్‌లో మెషిన్ లెర్నింగ్ పాత్ర'పై ప్రసంగించారు. అభివృద్ధి చెందుతున్న సాఫ్ట్‌వేర్‌ల వినియోగంపై మెషిన్ లెర్నింగ్, మెటీరియల్ సైన్స్ పాత్ర ఎంత కీలకమైనదో వివరించారు. అదేవిధంగా అంగ్ల విభాగంలో ఇంటర్ డిపార్ట్‌మెంట్ క్విజ్ కాంపిటీషన్, క్విజార్డ్, ట్రాష్ టు ట్రెజర్ ఈవెంట్‌లను ఉత్సాహంగా నిర్వహించారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కిడ్నాప్.. దాడి



గాయపడిన సాయి, అక్బర్

బంజారాహిల్స్: రాజకీయ కక్షతో కాంగ్రెస్ కార్యకర్తలు తమను కిడ్నాప్ చేసి తీవ్రంగా కొట్టారని ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివీ... వెంకటగిరి బస్తీకి చెందిన అక్బర్, యూసుఫ్‌గూడకు చెందిన సాయి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నారు. మంగళవారం రాత్రి కాంగ్రెస్ కార్పొరేటర్ అనుచరులు చోర్‌అబ్బూతో పాటు తొమ్మిది మంది కాంగ్రెస్ కార్యకర్తలు తమపై దాడి చేయడమే కాకుండా తీవ్రంగా కొట్టారని, కిడ్నాప్ చేశారంటూ బాధితులు ఆరోపించారు. వెంకటగిరి సమీపంలోని గాయత్రీహిల్స్‌లో ఈ ఘటన జరిగిందని, వీరంతా తమపై దుర్భాషలాడుతూ తీవ్రంగా కొడుతూ వీరంగం సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన బోరబండ కార్పొరేటర్ బాబాఫసీయుద్దీన్ ప్రోద్బలంతో బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి జరిగిందని, బాధితులతో పాటు ఆ పార్టీ కార్పొరేటర్లు ఆరోపించారు. సాయి, అక్బర్‌లను కిడ్నాప్ చేసి దాడి చేశారని, వాట్సప్ కాల్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్ దాడి చేయించారని బాధితులు దుయ్యబట్టారు. గతంలో డ్రగ్స్ కేసు పెట్టారనే కక్షతో తమను కిడ్నాప్ చేసి చితకబాదారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకునిత దర్యాప్తు ప్రారంభించారు.

'గత ప్రభుత్వం లాక్కున్న భూములను అప్పగించాలి'

పంజగుట్ట: అస్సైన్డ్ భూముల పేరుతో గత ప్రభుత్వం తమ భూములు లాక్కుందని, ఈ ప్రభుత్వంలో వాటిని తిరిగి ఇప్పించాలని తెలంగాణ మాదిగ దండోర రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రుద్రాల స్వామి మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు దైద శ్యాంసుందర్ మాదిగలు కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశం, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా రుద్రాల స్వామి మాదిగ, అధ్యక్షుడిగా దైద శ్యాంసుందర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మగల్ల మోజెస్ మాదిగ, ప్రధానకార్యదర్శి పాలడుగు జానయ్య, సెక్రటరీ జనరల్ దార యాదగిరి, నగర అధ్యక్షులు నిమ్మగల్ల అర్జున్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లోల రాము, కార్యదర్శి ఒగ్గు వెంకన్న, నేరేడు రమేష్‌లను ఎన్నుకున్నారు. ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా పనిచేస్తామని త్వరలో జిల్లా కమిటీలు వేస్తామన్నారు.

అట్రాసిటీ కేసులో నలుగురికి జైలు శిక్ష

రహమత్‌నగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నలుగురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకటరమణ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మానగర్ బస్తీకి చెందిన పి.కమలమ్మ, పి.వెంకటేశ్, పి.సురేష్, ఎస్.రజిత అలియాస్ పి.లావణ్యపై ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన సికింద్రాబాద్ 6 అదనపు ఎంఎస్‌జే న్యాయమూర్తి ఎం.జాన్సన్ నలుగురు నిందితులకు ఐపీసీ సెక్షన్ 354 ప్రకారం ఏడాది పాటు సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 500 జరిమానా విధించారు. డబ్బులు చెల్లించని పక్షంలో అదనంగా మరో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు.

అవగాహనతో సైబర్ నేరాలకు చెక్

హిమాయత్‌నగర్: రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు నగర సైబర్ క్రైమ్ పోలీసులు మరో ముందడుగు వేశారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు, యువత, వృద్ధులను టార్గెట్ చేస్తూ కోట్లాది రూపాయలను కొల్లగొడుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు, సైబర్ నేరాల పట్ల వారు ఎలా అప్రమత్తంగా ఉండాలనే విషయాలను ఈ అవగాహన కార్యక్రమాల ద్వారా తెలియజేస్తున్నారు. బుధవారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నగర సైబర్ క్రైం డీసీపీ కవిత ఆదేశాల మేరకు, ఎస్ఐ టీ.వినయ్ కుమార్ బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలను ముందస్తుగా ఎలా గుర్తించాలి, పార్ట్ టైమ్ జాబ్, టాస్కుల పేరుతో జరుగుతున్న మోసాలు, పోంజీ స్కీమ్‌లు, పంప్ అండ్ డంప్ స్కీమ్‌లు, క్రిప్టో కరెన్సీ స్కామ్‌లతో పాటు సాధారణంగా జరిగే సైబర్ మోసాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను ప్రజలకు వివరించారు. ప్రధానంగా ఇటీవలి కాలంలో భారీగా పెరుతున్న ట్రేడింగ్ మోసాలను ఎలా గుర్తించాలని తెలియజేశారు. ధ్రువీకరించిన యాప్‌ల ద్వారా మాత్రమే ట్రేడింగ్ చేయాలని, సైబర్ నేరగాళ్ల వాట్సప్, టెలిగ్రామ్‌ల ద్వారా పంపించే నకిలీ లింకుల ద్వారా నకిలీ యాప్‌లలో ట్రేడింగ్ పేరుతో పెట్టుబడుతు పెట్టవద్దని సూచించారు. అదేవిధంగా నకిలీ ఫెడెక్స్, కొరియర్ మోసాల విషయంలో ముఖ్యంగా కేటుగాళ్లు పోలీసు అధికారులమని నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారని, డ్రగ్స్, ఇతర నిషేధిత పదార్థాల పార్శిల్ తమ పేరుతో ఉన్నాయని భయపెడుతూ మోసాలకు పాల్పడుతున్నారని, ఈ విషయంలో ప్రధానంగా సీనియర్ సిటిజన్‌లను సైబర్ చీటర్స్ టార్గెట్ చేస్తున్నారని, అలాంటి అనుమానంతో వచ్చిన కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలిన సూచించారు. సైబర్ మోసాలపై నేషనల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930, సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.

క్రిప్టోలో ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలంటూ రూ. 22 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో పరిచయం చేసుకొని ఓ మహిళను సైబర్ నేరగాళ్లు భారీగా మోసం చేశారు. సైబర్ క్రైం పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన ఓ మహిళ(34)కు మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరు తరచూ చాటింగ్ చేసుకుంటూ, చనువుగా మాట్లాడుకున్నారు. అనంతరం ఆమెకు క్రిప్టోలో ట్రేడింగ్ చేయడం ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించాడు. ముందుగా పథకం ప్రకారం ఆమె పేరుతో కేటుగాడు నకిలీ ట్రేడింగ్ అకౌంట్ తెరిచాడు. మొదట లాభాలు చూపించడంతో విడతల వారీగా బాధితురాలు మొత్తం రూ. 22,59,617లను పెట్టుబడి పెట్టింది. కొన్నిరోజుల అనంతరం ఆ డబ్బును విత్‌డ్రా చేసుకోవాలంటే మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని, లేదంటే అకౌంట్ ఫ్రీజ్ అవుతుందని భయపెట్టారు. దీంతో అనుమానం వచ్చిన బాధిత మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేస్తున్నారు. మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లలో వచ్చే ప్రొఫైల్‌లను సైతం వెరిఫై చేసుకోవాలని, అవసరమైతే పెద్దవారితో కలిసి నేరుగా వారి గురించి చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గుర్తుతెలియని వారికి ఫొటోలు, వ్యక్తిగత వివరాలను ముందుగా పంపించవద్దని నగర సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన అన్నానగర్‌బస్తీ నేతలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఫసియుద్దీన్

రహమత్‌నగర్: అన్నానగర్ బస్తీకి చెందిన నాయకులు రంగనాయక్ నేతృత్వంలో బుధవారం మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న ప్రజాసంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వచ్ఛందగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని స్పష్టం చేశారు. అన్నానగర్ బస్తీ నాయకులు సతీష్, సలీం, కృష్ణ యాదవ్, సర్వర్, మహబూబ్, డివిజన్ నాయకులు నర్సింహ, కాసుల మహేష్ గౌడ్,అశోక్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

'సబల సత్యభామ' అవార్డుల ప్రదానం



అవార్డు గ్రహీతలతో ముఖ్య అతిథులు

పంజగుట్ట: వివిధ రంగాల్లో రాణిస్తూ, సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తున్న 20 మంది మహిళలకు గోనె వెంకటేశ్వర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సబల సత్యభామ పురస్కారాలతో సత్కరించింది. సీనియర్ జర్నలిస్టు, లైఫ్ గురు గోనె రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంత లక్ష్మి, సంఘసేవకురాలు వెల్ది కవిత హాజరై అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గోనె స్వర్ణ, ఆర్.జె.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యపు కోరల్లో ప్రపంచం

ఐఐసీటీ సీనియర్ సైంటిస్ట్ వెంకటమోహన్



ఐఐసీటీ సీనియర్ సైంటిస్ట్ వెంకటమోహన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: ప్రపంచ పూర్తిస్థాయిలో కాలుష్యం కోరల్లో చిక్కుకుందని, ఇది భవిష్యత్తు తరాల మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చనుందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వెంకటమోహన్ అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో విక్షిత్ భారత్‌లో భాగంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎస్.వెంకటమోహన్ అతిథిగా హాజరై ×సుస్థిర అభివృద్ధి సాంకేతిక జోక్యం× అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. వాతావరణంలో కాలుష్య పరిమాణం రోజురోజుకు పెరుగుతూ ఆందోళన కలిగిస్తోందన్నారు. గాలిలో కార్బన్ డయాక్సైడ్ శాతం పరిమాణం ఉండాల్సిన దాని కంటే ఎక్కువగా నమోదవుతున్నదని, మరోవైపు విపరీతంగా పెరుగుతున్న జనాభా కూడా దీనికి కారణంగా చెప్పుకొచ్చారు. వ్యర్థాలను రీసైకిల్ చేయడం వల్ల కొంతమేర అటు గాలి, ఇటు జల కాలుష్యాన్ని తగ్గించవచ్చని, ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేస్తున్నాయని, అయినప్పటికీ ప్రజల భాగస్వామ్యం లేకుండా పూర్తిస్థాయిలో కాలుష్యాన్ని అరికట్టడం సాధ్యం కాదని వెల్లడించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సీతారామరావు మాట్లాడుతూ... తమ విశ్వవిద్యాలయంలో సైన్స్ విభాగానికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్, సైన్స్ విభాగ డీన్ పుష్పచక్రపాణి మాట్లాడుతూ... ప్రఖ్యాత భారతీయ పరిశోధకులు సర్ సీవీ రామన్ ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్‌ను గుర్తించుకునేలా ఆయన పేరున జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరపడం శుభసూచకంగా వివరించారు. పలు విభాగాల డైరెక్టర్లు, డీన్స్, విశ్వవిద్యాలయ సైన్స్ విద్యార్థులు, అన్ని విభాగాల అధిపతులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులపై విద్యార్థులు అధ్యయనం చేయాలి



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న రెడ్యానాయక్

బంజారాహిల్స్: సైఫాబాద్‌లోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో 'సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మల్టీడిసిప్లినరీ దృక్పథం' అంశంపై బుధవారం ఒక రోజు జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను వీసీ ఓఎస్‌డీ రెడ్యానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులపై నేటితరం విద్యార్థులు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు యరగొర్ల, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జ్ఞానేష, ఓయూ యూసీఈ ఐటీ విభాగం అబ్దుల్ హమీద్, ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, జగదేశ్వర్, వెంకట్‌రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్యాటరాక్ట్ ఆపరేషన్ల క్యాంప్

పెద్ద సంఖ్యలో ఆపరేషన్లు, కళ్లజోళ్ల పంపిణీ



పాల్గొన్న శ్రీనివాస్, సుమ, రాజీవ్ కనకాల, అరుల్, నాగబాల తదితరులు

వెంగళరావునగర్: మన అమెరికా తెలుగు అసోసియేషన్ (మాట) ప్రారంభించిన పది నెలల్లోనే ఐదు వేల మందితో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గనగోని శ్రీనివాస్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (మాటా), శంకర్ నేత్రాలయ సంస్థ, ఫెస్టివల్స్ ఫర్ జాయ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి క్యాటరాక్ట్ ఆపరేషన్ల క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... ఈ నెల 19న స్టేడియంలో దీనిని ప్రారంభించామని 2300 మందికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. 200 మందికి ఆపరేషన్లు నిర్వహించి 100 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశామని, మరో 250 మందిని చెన్నైకి పంపి వైద్యం చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఫెస్టివల్స్ ఫర్ జాయ్ అధ్యక్షురాలు సుమ కనకాల మాట్లాడుతూ... ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేయాలంటే మానవత్వం ఉండాలని అన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ... గతంలో సుమ భర్త అంటే చిరాగ్గా ఉండేదని, ప్రస్తుతం ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలు, మంచి పనులు చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. సుమ భర్తనే అని చెప్పుకోవాలని అనిపిస్తుందని అన్నారు. శంకర్ నేత్రాలయం ప్రతినిధి అరుల్, డాక్టర్ విజయ్ భాస్కర్ బొలగం, ప్రవాసాంధ్రులు ప్రదీప్ సామల, టీటీ ఫెడరేషన్ సభ్యులు విజయ్, టీటీఏ ఫడబ్ల్యూఏ అధ్యక్షుడు నాగబాల సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సీనియర్ నేత సూర్యారావు

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నేత గొల్లపల్లి

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పి.గన్నవరం టీడీపీ నేత నేలపూడి స్టాలిన్ బాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి సీఎం వైఎస్ జగన్ పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్‌రెడ్డి, ఎంపీ కేశినేని నాని పాల్గొన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లనుద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ పెత్తందార్లకు అనుకూలంగా, దళిత వర్గాలకు, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉందని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ టీడీపీ నేతలు, కార్యకర్తల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఒంగోలు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా చెవిరెడ్డి

- మరో ఐదుగురు పార్టీ సమన్వయకర్తల నియామకం
- గుంటూరు లోక్‌సభకు కిలారి రోశయ్య



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో రెండు పార్లమెంటు స్థానాలకు, మూడు శాసన సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పార్టీ సమన్వయకర్తల ఎనిమిదో జాబితాలో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గానికి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానికి కిలారి రోశయ్యను నియమించారు. పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా అంబటి మురళి, కందుకూరుకు బుర్రా మధుసూదన్ యాదవ్, గంగాధర నెల్లూరు (జీడీ నెల్లూరు)కు కల్లత్తూర్ కృపాలక్ష్మిని నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ పత్రికా విడుదల చేసింది.

మాటకు మించి సాయం

ప్రతి అడుగులో అన్నదాతకు తోడుగా నిలబడ్డాం: సీఎం జగన్

- రూ.50 వేలే ఇస్తామని చెప్పినా ప్రతి ఒక్కరికీ రూ.67,500 ఇచ్చాం
- అన్నదాతలకు ఈ ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చాం
- వైఎస్సార్ రైతు భరోసా మూడో విడతగా 53.58 లక్షల కుటుంబాలకు రూ.1,078.36 కోట్లు
- సున్నా వడ్డీ రాయితీ కింద 10.79 లక్షల మందికి మరో రూ.215.98 కోట్లు
- క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేసిన సీఎం జగన్



వైఎస్సార్ రైతు భరోసా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: అన్నదాతల కష్టం తెలిసిన ప్రభుత్వంగా ఈ ఐదేళ్లలో ప్రతి అడుగూ రైతులు, రైతు కూలీలు బాగుండాలని మనసా వాచా కర్మణా వేస్తూ వచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ప్రగాఢంగా విశ్వసిస్తూ విత్తనం నుంచి పంట విక్రయం వరకూ అన్ని విధాలుగా చేయి పట్టుకుని నడిపించామన్నారు. ప్రతీ పథకాన్ని పేద రైతు కుటుంబాలకు అందుబాటులోకి తెచ్చి సంక్షేమ ఫలాలన్నీ అందించామని, రాష్ట్రంలో ఐదేళ్లుగా మాత్రమే ఇలా జరుగుతోందని గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా చెప్పిన సమయానికి చెప్పినట్లుగా రైతన్నలకు భరోసా కల్పిస్తూ వ్యవసాయాన్ని పండగ చేసిన ప్రభుత్వం ఇదేనని, భవిష్యత్‌లోనూ ఇదే రీతిలో అండగా నిలిచి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా వరుసగా ఐదో ఏడాది మూడో విడత కింద ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున 53.58 లక్షల మందికి రూ.1,078.36 కోట్ల పెట్టుబడి సాయంతో పాటు 10.79 లక్షల మందికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.215.98 కోట్లు కలిపి మొత్తం 64.37 లక్షల మంది ఖాతాలకు రూ.1,294.34 కోట్లను బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

హామీ కంటే మిన్నగా..

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.50 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీ కంటే మిన్నగా రూ.12,500 బదులు ఏటా రూ.13,500 చొప్పున అందచేశాం. రూ.50 వేలకు బదులు ఐదేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.67,500 చొప్పున లబ్ధి చేకూర్చాం. ఇవాళ జమ చేస్తున్న పెట్టుబడి సాయంతో కలిపి ఐదేళ్లలో 53.58 లక్షల రైతు కుటుంబాలకు మొత్తం రూ.34,288 కోట్లు పంటలు వేసే సమయంలో పెట్టుబడి సాయంగా అందించాం. ప్రతి రైతన్నకు పెట్టుబడి సాయంగా డబ్బులు ఇవ్వడమే కాకుండా సున్నా వడ్డీని కూడా వర్తింపజేస్తూ రూ.లక్ష వరకు పంట రుణాలను అందిస్తున్న కార్యక్రమం కూడా మన ప్రభుత్వ హయాంలోనే జరుగుతోంది. గత ప్రభుత్వం 39.07 లక్షల మంది రైతులకు ఎగ్గొట్టిన బకాయిలతో కలిపి 84.67 లక్షల మంది అన్నదాతలకు సున్నా వడ్డీ రాయితీ కింద దాదాపు రూ.2,051 కోట్లు అందించాం.

మాఫీ పేరుతో బాబు మోసాలు..

2014 ఎన్నికల సమయంలో రూ.87,612 కోట్ల రైతుల రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానన్న చంద్రబాబు తీరా గద్దెనెక్కిన తర్వాత ఎంత దారుణంగా మోసగించారో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలని కోరుతున్నా. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు సీఎం కావాలని పబ్లిసిటీ చేసి ఆ తరువాత వంచనకు పాల్పడ్డారు. చివరికి ఆ రూ.87,612 కోట్లపై సున్నావడ్డీని కూడా ఎగ్గొట్టాడు. ఐదేళ్లలో దాదాపు రూ.30 వేల కోట్లు ఆ వడ్డీలకే అవుతుంది. ఆయన ఎగ్గొట్టిన సున్నా వడ్డీ బకాయిలను కూడా మనమే ఇచ్చాం. ఐదేళ్లలో ఒక్క వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ పథకం ద్వారానే రైతుల చేతుల్లో రూ.34,288 వేల కోట్లు పెట్టాం. ధాన్యం కొనుగోలు కోసం మరో రూ.65 కోట్లు వెచ్చించాం. ఇలా వివిధ పథకాల ద్వారా అన్నదాతల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వ్యవసాయ రంగం కోసం ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు చేసిన పరిస్థితి కళ్లెదుటే కనిపిస్తోంది.

బాబు గ్రాఫిక్స్ పెట్టుబడులు.. జగన్ రియల్ పెట్టుబడులు

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల్లో బట్టబయలైన బాబు గ్రాఫిక్స్ మాటల బురిడీ

బాబు హయాంలోకంటే సీఎం జగన్ హయాంలో రాష్ట్రంలో 3 రెట్లు పెరిగిన పెట్టుబడులు



సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలన : ఓ కంప్యూటర్.. అందులో పెద్ద పెద్ద కంపెనీల పేర్లు, లోగోలు.. వాటి గ్రాఫిక్స్.. ఓ వంద అంకెలు, నలభై గీతలు.. వంద అబద్ధాలు. అన్నీ భూతద్దంలో చూపిస్తారు. వినడానికి, గ్రాఫిక్స్ చూడటానికి అబ్బో అనిపిస్తాయి. వాస్తవంగా వచ్చే పెట్టుబడులు సున్నా. పెట్టుబడులన్నీ కాగితాలకు, కంప్యూటర్లకే పరిమితం. సీఎం వైఎస్ జగన్ పాలన : చంద్రబాబు గ్రాఫిక్స్ లాంటి టక్కుటమారాలేమీ ఉండవు. అంతా వాస్తవికత. వచ్చే పెట్టుబడులే కాగితాల్లో కనిపిస్తాయి. అవే ప్రజలకు చేరతాయి. వాస్తవంగా నూరు శాతం పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమలు వస్తాయి. కాగితాల్లో ఉన్న పెట్టుబడులే పరిశ్రమలుగా రూపుదిద్దుకొని ప్రజల ముందు నిలుస్తాయి. .. అందుకే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వస్తున్నాయి. గత చంద్రబాబు ప్రభుత్వంతో పోలిస్తే గడిచిన నాలుగున్నర ఏళ్లలో పెట్టుబడులు మూడు రెట్లు పెరిగాయి. ఈ విషయం వెల్లడించింది స్వయానా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ. ఆ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఫర్ ఇండ్రస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. 2014–18 సంవత్సరాల మధ్య కాలంలో (చంద్రబాబు పాలన) రాష్ట్రంలోకి వాస్తవంగా వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే 2019 నుంచి 2023 జూన్ వరకు (వైఎస్ జగన్ పాలన) వచ్చిన పెట్టుబడులు 226.9 శాతం అధికంగా వచ్చాయి. 2014–18 క్యాలండర్ ఇయర్ ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వాస్తవ రూపంలోకి వచ్చి ఉత్పత్తిని ప్రారంభించిన పరిశ్రమల పెట్టుబడులు కేవలం రూ.32,803 కోట్లు మాత్రమే. ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రూ.1,00,103 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపం దాల్చాయి. చంద్రబాబు నాయుడు పెట్టుబడుల సదస్సు పేరుతో ప్రతి ఏటా హడావుడి చేసి లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేశాయని చెప్పిన వార్తల్లో వాస్తవం ఏమాత్రం లేదని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. చంద్రబాబు హయాంలో వివిధ పెట్టుబడుల సదస్సుల ద్వారా రూ.18.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ఉత్తుత్తి ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న విషయం సుస్పష్టమైంది.

తరలి వస్తున్న దిగ్గజ సంస్థలు

చంద్రబాబుకు భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎటువంటి ప్రచార ఆర్భాటాలు చేయకుండా పరిశ్రమలకు అన్ని విధాలా చేయూతనిస్తున్నారు. సీఎం జగన్ సహకారం అందించడంతో రిలయన్స్, అదానీ, టాటా, బిర్లా, హెచ్‌యూఎల్, బ్లూస్టార్, డైకిన్, ఇన్ఫోసిస్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. సాధారణంగా దేశంలో పెట్టుబడుల సదస్సులోజరిగే ఒప్పందాల్లో 16 నుంచి 17 శాతం మాత్రమే వాస్తవ రూపంలోకి వస్తాయి. కానీ విశాఖ పెట్టుబడుల సదస్సు జరిగి ఏడాది కాకుండానే 19 శాతం పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చేశాయి. జీఐఎస్‌లో మొత్తం రూ.13.11 లక్షల కోట్ల విలువైన 386 ఒప్పందాలు జరగ్గా రూ.2.46 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన పరిశ్రమల పనులు వేర్వేరు దశల్లో ఉన్నాయి.

టీ–జే ఫ్లాప్ షో!

- తుస్సుమన్న టీడీపీ–జనసేన (టీజే) తొలి బహిరంగ సభ
- 6 లక్షల మంది వస్తారని ఊదరగొట్టిన నేతలు
- కిందా మీదా పడి 40–50 వేల మందికే పరిమితం
- పొత్తుకు తమ మద్దతు లేదని స్పష్టం చేసిన ఇరు పార్టీల కేడర్

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ సాక్షి, భీమవరం: జనాదరణ లేక టీడీపీ–జనసేన (టీజే) తొలి బహిరంగ సభ తుస్సుమంది. అంతా.. ఇంతా.. నభూతో.. అన్నట్లు నాలుగైదు రోజులుగా ఊదరగొట్టిన ఎల్లో మీడియా ఇప్పుడు ఈ సభకు వచ్చిన జనం మాటెత్తడం లేదు. టీడీపీ–జనసేన పొత్తుకు జనం మద్దతును ఈ సభతో చాటిచెబుతామంటూ ఇరు పార్టీల అధినేతలు హడావుడి చేశారు. కేడర్ నిరసనల్ని, మనోభావాల్ని లెక్కచేయకుండా చంద్రబాబు, పవన్‌ల వ్యక్తిగత ఆ'జెండా'తో నిర్వహించిన సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆరు లక్షల మంది తరలివస్తారంటూ ఎల్లో మీడియాలో మోత మోగించారు. తాడేపల్లిగూడెం సమీపంలో 22 ఎకరాల ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేసుకుంటే.. తీరా టీడీపీ–జనసేన పార్టీల కేడర్ నిరాదరణతో కాస్తా ఫ్లాప్ షోగా మిగిలింది. ఈ పొత్తు తమకు అంగీకారం కాదని స్పష్టం చేస్తూ నాయకులు, కింది స్థాయి కేడర్ సభను తుస్సుమనిపించారు. ప్రజలు పొత్తుకు బ్రహ్మరథం పడతారని చంద్రబాబు, పవన్‌లు ఎన్నో ఆశలు పెట్టుకుంటే.. టీడీపీ–జనసేన సంయుక్తంగా నిర్వహించిన తొలి బహిరంగ జెండా సభకు వారి లక్ష్యంలో పది శాతం మంది కూడా రాకపోవడం ఆ పార్టీల భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. సభకు హాజరైన వారి సంఖ్య చూసి ఆ పార్టీల అగ్ర నేతలు విస్తుపోయారు. గ్యాలరీల్లో సగం పైగా కుర్చీలు ఖాళీగా కనిపించడంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కంగుతిన్నారు.



సభకు అరకొరగా హాజరైన టీడీపీ-జనసేన కార్యకర్తలు, నాయకులు

టీ–జే పార్టీ నేతల్లో నైరాశ్యం

టీడీపీ–జనసేన నిర్వహిస్తున్న తొలి ఉమ్మడి సభకు తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి బైపాస్ పక్కనే ఉన్న 22 ఎకరాల మైదానాన్ని ఎంచుకున్నారు. 500 మంది కూర్చోవడానికి వీలుగా వేదికతోపాటు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వేర్వేరుగా హెలికాప్టర్‌లలో రానుండటంతో అక్కడకు సమీపంలో రెండు హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. వేదిక, హెలి ప్యాడ్‌లు, వీవీఐపీల రెస్ట్ రూమ్‌లు, పార్కింగ్‌కు ఏడు ఎకరాలు పోగా మిగిలిన 15 ఎకరాల్లో కార్యకర్తల కోసం 22 గ్యాలరీలు సిద్ధం చేశారు. ఒక్కో గ్యాలరీలో 1,500 కుర్చీల చొప్పున 22 గ్యాలరీల్లో 33 వేల కుర్చీలు వేశారు. మొత్తం కుర్చీలన్నీ నిండిపోయి 15 ఎకరాల ప్రాంగణం కిక్కిరిసిపోతే దాదాపు 60 వేల మంది హాజరైనట్లు లెక్క. అయితే సభ ప్రారంభం నుంచి చివరిదాకా సగం గ్యాలరీలు ఖాళీగానే ఉన్నాయి. వాస్తవానికి ఆరు లక్షల మంది జనం వస్తారని టీడీపీ–జనసేన నేతలు చెప్పారు. అయితే అది సాధ్యం కాదని వారికీ తెలుసు. అందుకే తక్కువ స్థలం ఉన్న చోట సభ నిర్వహించి, జనం కిక్కిరిసిపోతే.. దానినే కొండంతలు చేసి చూపాలన్న టీడీపీ, జనసేన అగ్రనేతల పన్నాగం బెడిసికొట్టింది. మొత్తంగా 40–50 వేల మంది కూడా హాజరు కాకపోవడం ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

నగర వార్తలు

ఘనంగా ఇండో కాటన్ ఫ్యాషన్ షో

లక్డీకాపూల్ : సరసమైన ధరలో ప్రీమియం దుస్తులను, అత్యుత్తమ నాణ్యతను కలిగిన వస్త్రాలను అందించడమే లక్ష్యంగా మొదలైన ఇండో కాటన్ గార్మెంట్స్ (ఎల్ఎల్‌పీ) హైదరాబాద్‌లో ఘనంగా ఇండో కాటన్ ఫ్యాషన్ షో నిర్వహించింది. జూబ్లీహిల్స్ లోని దసపల్లా హోటల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో కంపెనీ ఎండీ శ్రీధర్ నంబూరి మాట్లాడుతూ.. ఫ్యాబ్రిక్ పారామీటర్ టెస్టింగ్ (ఎఫ్‌పీటీ), గార్మెంట్ పారామీటర్ టెస్టింగ్ (జీపీటీ) ప్రమాణాలను అనుసరించి దుస్తులు తయారవుతాయన్నారు. తాము వంద శాతం నాణ్యతను ఇస్తున్నందుకు గర్వపడుతున్నామంటూ..తమ ఉత్పత్తి ప్రక్రియలో కాటన్ లైక్రా, వంద శాతం కాటన్ ఫ్యాబ్రిక్స్‌ని ఉపయోగిస్తామన్నారు. అలాగే అరటి, మొక్కజొన్న, ఆరెంజ్ , నేచురల్ కలర్ కాటన్ ను ఉపయోగిస్తామని.. అందులో ఎటువంటి రసాయనాలు కలపమన్నారు. ఇవి పూర్తిగా పర్యావరణానికి అనుకూలమైన వన్నారు. త్వరలో ఏడబ్ల్యు24 కలెక్షన్‌ను ప్రారంభించబోతున్నామని కంపెనీ సీఈఓ మిస్టర్ సుభాన్ షైక్ తెలిపారు.

అమెరికా అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి



బంజారాహిల్స్: ఖండాలు దాటిన ప్రేమ ఆ ఇద్దరిని ఒక్కటి చేసింది. అక్కడమ్మాయి... ఇక్కడబ్బాయి ప్రేమ వివాహం బంజారాహిల్స్‌లో ఘనంగా జరిగింది. అమెరికాకు చెందిన యువతితో తెలంగాణ యువకుడికి జరిగిన ఈ వివాహాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం వచ్చారు. బంజారాహిల్స్ గౌరీశంకర్ కాలనీలో నివాస ఉండే సూర్యనారాయణ, తల్లి నాగవేణిల కుమారుడు రామచంద్రమూర్తి 15 ఏళ్ళ క్రితం అమెరికాకు చదువుకోసం వెళ్ళాడు. అక్కడే చదువుకొని అక్కడే స్థిరపడ్డాడు. తనతో పాటు అమెరికాలోని కొలరాడో రాష్ట్రం డెన్వర్ సిటీకి చెందిన మరియా దొయినా కుమార్తె లుసియాన ఆండ్రియాతో పీజీ చదువుకునే సమయంలో పరిచయం అయింది. ఆ సమయంలోనే వీరి పరిచయం కాస్త ప్రేమకు దారి తీసింది. ఈ విషయాన్ని తాజాగా ఇరువురి వారి కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఒప్పుకున్నారు. దీంతో హిందూ సంప్రదాయం ప్రకారం బంజారాహిల్స్‌లోని ఆషియానా ఫంక్షన్ హాల్‌లో బుధవారం వైభవంగా వారి వివాహం జరిగింది. ఈ వివాహాన్ని చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున వచ్చారు.

జర్నలిస్టులపై దాడి అనైతికం



పంజగుట్ట: సీనియర్ సంపాదకులు వేణుగోపాల్‌పై దాడి జర్నలిస్టు ప్రపంచంమీద జరిగిన దాడిగా భావిస్తున్నట్లు పలువురు సీనియర్ పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వీక్షణం కలెక్టివ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులపై ఎన్ఐఏ దాడులను ఖండించండి పేరుతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. వీక్షణం బాధ్యులు నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ .. ఈ కేసులను వ్యతిరేకించే వాటిలో తాను ఒకడినని తెలిపారు. అప్రజాస్వామిక పద్ధతి పాటిస్తూ వాటిని వ్యతిరేకించే వారిని వేధించడం సాధారణమైపోయిందన్నారు. వేణుగోపాల్ కేసును త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. పౌరహక్కుల నాయకులు ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ .. ఫాసిజం లక్షణం ఒకే భావజాలంతో ఉంటుందని అది వేరే భావజాలాన్ని సహించలేదన్నారు. ఈడీ, ఎన్ఐఏ, సీబీఐ సంస్థలను పార్టీ యంత్రాంగంగా ఉపయోగించుకుంటుందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉద్యమం నుండి వచ్చిన పార్టీకూడా గతంలో చిన్నచిన్న సమావేశాలు పెట్టుకున్నా అణచివేసిందని, ఆ దిగజారుడు వ్యవస్థను తెలంగాణ ప్రజలు వ్యతిరేకించారన్న విషయం కాంగ్రెస్ తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు నమ్మింది కేవలం ప్రజాస్వామ్యం వస్తుందని.. మాట్లాడే అధికారం వస్తుందనే అన్నారు. రాష్ట్రంలో 300 మందిపై ఉపా చట్టం, ఎన్ఐఏ దాడులు చేసేందుకు కారణం గత కేసీఆర్ ప్రభుత్వమే అని తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. భిన్నాభిప్రాయాలను కనీసం సహించే పరిస్థితుల్లో కూడా ప్రభుత్వాలు ఉండడంలేదని ఆగ్రహంవ్యక్తం చేశారు. దేశంలో ఏకశిల ప్రభుత్వం తీసుకువచ్చేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యం పునరుద్ధీకరణ జరుగుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ సంపాదకులు కె.రామచంద్ర మూర్తి, కె.శ్రీనివాస్, మారుతీ సాగర్, విరాహత్ అలీ, రహమాన్, రాజీవ్ సాగర్, కల్లూరి భాస్కరంలు వేణుగోపాల్ ఇంటిపై ఎన్ఐఏ దాడిని ఖండించారు.

ప్రత్యేక డ్రైవ్‌తో దొంగ ఓట్లను ఏరివేయాలి



పంజగుట్ట: హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో మొత్తం 21 లక్షల ఓట్లు ఉంటే అందులో ఆరు లక్షల 64వేల దొంగ, బోగస్ ఓట్లు ఉన్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. యాకత్‌పూరాలో 200 గజాల ఇంట్లో 662 ఓట్లు ఉన్నాయని, ఓ వ్యక్తి 2022లో చనిపోతే 2024 జనవరిలో ఆమెపేరుతో ఓటు వచ్చిందని, దొంగ ఓట్లను తొలగిస్తే హైదరాబాద్‌లో ఎమ్ఐఎమ్ గెలవలేదని, ఇప్పుడున్న 7 అసెంబ్లీ స్థానాల్లో రెండు కూడా గెలవదని ఆయన పేర్కొన్నారు. ఎమ్ఐఎమ్ ఏ ముఖ్యమంత్రి ఉంటే వారివద్దకు వెళ్లి కూర్చోవడం దొంగ ఓట్లు తీయించకుండా అధికారులపై ఒత్తిడి తేవడం, రౌడీయిజం, గుండాయిజంతో ఎన్నికల్లో గెలుస్తున్నారని ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తమకు కూడా దగ్గరయ్యేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. తమ టీం రెండు నెలలు కష్టపడి ప్రతీ బస్తీ, ప్రతీ బూత్ స్థాయికి వెళ్లి ఓటర్‌లిస్టు సేకరించి, ఆరు విభాగాలుగా విభజించి పూర్తి ఆధారాలతో వివరాలు సేకరించామని తెలిపారు. బూత్ లెవల్ ఆఫీసర్స్ (బిఎల్ఓ) అవినీతితోనే ఇలా బోగస్ ఓట్లు పుట్టుకువస్తాయన్నారు. 2.88 లక్షల ఓట్లు ఇల్లు షిఫ్ట్ అయిన వారి పేరుతో ఓట్లు ఉన్నాయని, ఒక చిన్న ఇంటికి ఉన్న ఇంటినెంబర్‌కు మరో నెంబర్ చేర్చి సింగిల్ ఓటు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. ఇప్పటికే చనిపోయిన వారు, చనిపోయిన వారిపేరుతో కొత్త ఓట్లు తీసినవి మొత్తం 15వేలు ఉన్నాయని ఒక 102 సంవత్సరాల మహిళ చనిపోయి రెండున్నర సంవత్సరాలు అవుతుందని, ఆమె పేరుతో ఈ సంవత్సరం జనవరి నెలలో ఓటు తీసుకున్నారని, డెత్ సర్టిఫికెట్లు ప్రదర్శించారు. స్పెషల్ డ్రైవ్ పెట్టి 10 రోజుల్లో లిస్టు ప్రకారం క్లియర్ చెయ్యాలని అధికారులకు, ముఖ్యమంత్రికి తెలిపినట్లు పేర్కొన్నారు.

మాలలకు రెండు పార్లమెంట్ సీట్లు కేటాయించాలి

హిమాయత్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాలలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్లను తొలగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాలలను అవమానించేలా మాట్లాడుతున్నారని,మాలల పట్ల ఆయన వైఖరి మార్చుకోవాలని లేనిపక్షంలో, రానున్న ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రత్యేక కార్యచరణతో కిషన్ రెడ్డికి మాల సత్తా చూపెడతామని హెచ్చరించారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ ఒక్క పార్లమెంట్ సీటు కూడా గెలవకుండా చేస్తామన్నారు. జాతీయస్థాయిలో దళిత ఆదివాసులతో ఎస్సీ.ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక సంఘటన ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. దళిత, ఆదివాసీలపై దాడులు చేసే వారికి బీజేపీ మద్దతిస్తుందని,అందుకే దేశవ్యాప్తంగా దళిత, ఆదివాసీలు ప్రజాస్వామ్య పరిరక్షణకై కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి మద్దతు తెలుపుతున్న మాలలకు తెలంగాణలో పెద్దపల్లి,నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని చెన్నయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూరుగుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్ రావు, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు గోకుల కళ్యాణ్, రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షులు చేపూరి శంకర్, జి.రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులను తీర్చి దిద్దాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



మణికొండ: విద్యార్థులను అన్ని రంగాలలో రాణించేలా తీర్చి దిద్ది వారి భవిష్యత్తును ఉన్నతంగా మార్చుకునేందుకు పాఠశాలల్లోనే తీర్చిదిద్దాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్‌లో వింగ్స్ ఆఫ్ వండర్ ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అవసరమయ్యే సౌకర్యాలను కల్పించుకోవాలన్నారు. హైదరాబాద్ నగర శివార్లలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అన్ని రకాల పాఠశాలలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె. నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి, స్కూల్ ఎండీలు శ్వేత అట్లూరి, ప్రియదర్శిని పాలినా, ప్రిన్సిపాల్ ఆగస్టీనా ఈస్టెర్, డైరెక్టర్‌లు పీడీఆర్ కృష్ణ, పి.రాంమనోజ్‌లతో పాటు స్థానిక కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

మూసీ పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి



బాగ్ అంబర్‌పేట్‌లో నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట్: నగరంలో గత దాదాపు 8 ఏళ్లుగా ఎక్కడ చూసిన ఇష్టారీతిగా అధికార దుర్వినియోగం చేసి భూ కబ్జాలు జరిగాయని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 100 ఎకరాల మూసీ నది భూములను ఆక్రమంగా ఆక్రమించుకొని పేద ప్రజలకు అమ్ముకుంటున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం అంబర్‌పేటలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. కబ్జా భూములను కొనడంతో పేద ప్రజలు మోసపోతున్నారని ఆయన అన్నారు. మూసీ ప్రక్షాళన, రివర్ డెవల్ప్‌మెంటు కింద కార్పోరేషన్ ఏర్పాటు చేసి రూ. 3500 కోట్లు ఖర్చుపెడుతున్నామని గత ప్రభుత్వ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినప్పటికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాగానే అధికారులను, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ లను లండన్ తీసుకెళ్లి అక్కడున్న నదీలా అభివృద్ధి చేస్తామని చెప్పారని, ఇది విడ్డూరం అన్నారు. అసలు మూసీ భూముల ఆక్రమణకు సహకరించిందే మజ్లీస్ పార్టీ అన్న విషయాన్ని రేవంత్‌రెడ్డి తెలుసుకోకపోవటం శోచనీయమన్నారు. హైదరాబాద్ నగరానికి మణిహారంగా ఉండే మూసీనదిని రోజురోజుకు కుచించుకు పోవడం దారుణమన్నారు. హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున్న వరదలు వచినపుడు 111 జీవో ను గత ప్రభుత్వం ఎత్తేస్తామని చెప్పి 111 జీవో మీదనే బీఆర్ఎస్ నాయకులు వేలాది ఎకరాలు ఆక్రమించుకున్నారని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ నగరం పరిరక్షించబడాలంటే తక్షణమే ప్రభుత్వం మూసీ పరివాహక ప్రాంతాల భూములు రక్షించేలా 111 జీవో విషయంలో పునరాలోంచించుకోవాలన్నారు. 111 జీవోతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులకే లాభం జరుగుతుందన్నారు. . ప్రస్తుత ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మూసీ నది పరిరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జియో సైన్స్ డేటాపై వర్క్‌షాప్



బంజారాహిల్స్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నేషనల్ జియో సైన్స్ డేటా రిపోజిటరీ (ఎన్‌జీడీఆర్) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న జియో సైన్స్ డేటాపై బుధవారం జూబ్లీహిల్స్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. జీఎస్ఐ ద్వారా రూపొందించినన విస్తారమైన డేటాను ప్రదర్శించడం, ఎన్‌జీడీఆర్ పోర్టల్‌లో విస్తృతమైన డేటా లభ్యతకు సంబంధించిన సమాచారాన్ని వ్యాప్తి చేయడం, తద్వారా ఖనిజ అన్వేషణ, వ్యవసాయం, ఆరోగ్యం, ప్రమాదాలు, పర్యావరణం వంటి వివిధ రంగాల్లో డేటాను ఏవిధంగా ఉపయోగించవచ్చో ఈ వర్క్‌షాప్ ద్వారా తెలియపరిచారు. అలాగే ప్రభుత్వ ఏజెన్సీలు, పీఎస్‌యూలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక మార్గాల గురించి అవగాహన కల్పించడమే లక్ష్యంగా వర్క్‌షాప్ కొనసాగింది. ఈ కార్యశాలకు ప్రభుత్వ గనులు, భూగర్భ శాస్త్రం ప్రిన్సిపల్ సెక్రటరీ బెన్‌హూర్ మహేష్ దత్ ఎక్కా, జీఎస్ఐ దక్షిణ ప్రాంతం ఏడీజీ విభాగం అధిపతి సీహెచ్.వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర డీడీజీ లాలన్ ప్రసాద్‌సింగ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఖనిజ అన్వేషణ, భౌగోళిక, పర్యావరణ అధ్యయనాలు, ప్రాథమిక భూశాస్త్ర అధ్యయనాలు తదితర వాటి కోసం ఉపయోగించబడే జీఎస్ఐకు చెందిన ఎన్‌జీసీఎం డేటా ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశ ఖనిజ అన్వేషణను ప్రోత్సహించడానికి, స్థిరమైన అభివృద్ధికి సంబంధించిన ఆందోళనలను పరిష్కరించడంలో విధాన రూపకర్తలకు కూడా సహాయం చేస్తుందని తెలిపారు. వివిధ రంగాలలో వారి అవసరాలను తీర్చడానికి జియో సైంటిఫిక్ డేటాను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎకోసిస్ప్లోరేషన్‌ను వేగవంతం చేయడానికి నేషనల్ జియో కెమికల్ మ్యాపింగ్ (ఎన్‌జీసీఎం) , నేషనల్ జియో ఫిజికల్ మ్యాపింగ్ (ఎన్‌జీపీఎం), నేషనల్ ఏరో–జియో ఫిజికల్ మ్యాపింగ్ వంటి వివిధ పాన్ ఇండియా ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌ల ద్వారా జీఎస్ఐ జియోలాజికల్, జియో కెమికల్, జియో ఫిజికల్ బేస్‌లైన్ డేటాను రూపొందిస్తుందని వివరించారు. వర్క్‌షాప్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యా సంస్థలు, పీఎస్‌యూలు, జీఎస్ఐ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



న్యూస్‌మేకర్



క్రికెట్ ఫీల్డ్‌లోని ఒక్కొక్క రంగంలో
నెమ్మదిగా మహిళా కేతనం ఎగురుతోంది.
గతంలో మొదటి మహిళా క్రికెట్ అంపైర్
వృందా రతి, మొదటి ఐసీసీ
మహిళా మ్యాచ్ రిఫరీగా
జి.ఎస్.లక్ష్మి చరిత్ర సృష్టిస్తే
ఇప్పుడు దేశంలోనే
మొదటి మహిళా పిచ్ క్యూరేటర్‌గా
జసింత కల్యాణ్ ఘనత సాధించింది.
బెంగళూరులో జరుగుతున్న
విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో
పిచ్ క్యూరేటర్‌గా జసింత
తన బాధ్యతను నిర్వర్తిస్తోంది.
ఆమె పరిచయం.

తొలి మహిళా క్యూరేటర్ జసింత

క్రికెట్ అంటే సచిన్, ద్రవిడ్, గంగూలి అనేవారు ఒకప్పుడు. మిథాలీ రాజ్, హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన అంటున్నారు ఇప్పుడు. క్రికెట్ కామెంటేటర్స్ అంటే హర్ష భోగ్లే, సునీల్ గవాస్కర్ అనేవారు మొన్న. ఫీమేల్ క్రికెట్ యాంకర్స్‌గా మందిరా బేడీ, సంజనా గణేశన్ పేరు గడించారు ఇవాళ. మహిళా అంపైర్లు ఇదివరకే రంగంలోకి వచ్చారు. వారి వరుసలో చేరింది జసింత కల్యాణ్. ఈమె భారతదేశంలో తొలి మహిళా పిచ్ క్యూరేటర్.

1980ల నుంచి

మనదేశంలో పిచ్ క్యూరేటర్లు 1980 వరకూ లేరు. స్టేడియంలో గడ్డి పెంచే మాలీలే పిచ్‌ను కూడా తయారు చేసేవారు, తెలిసినంతలో చూసుకునేవారు. కాని వాన పడితే పిచ్‌ను తడవడానికి వదిలేయడం, స్టంప్స్ వదిలేసి పోవడం జరిగేది. దానివల్ల మ్యాచ్ కొనసాగే సమయంలో పిచ్ అనూహ్యంగా మారేది. అలా కాకుండా స్టేడియంలోని మట్టిని బట్టి, రుతువులను బట్టి, ఆట సమయానికి పిచ్‌ను శాస్త్రీయంగా తయారు చేసేందుకు 'పిచ్ క్యూరేటర్లు' రంగం మీదకు వచ్చారు. వీరు పిచ్‌ను తీర్చిదిద్దుతారు. రకరకాల వాతావరణ పరిస్థితుల నుంచి కాపాడి పిచ్‌ను ఎప్పుడూ ఆటకు వీలుగా ఉంచుతారు. అయితే ఈ నలభై ఏళ్ల నుంచి కూడా పురుషులే పిచ్ క్యూరేటర్లుగా ఉన్నారు. ఒక స్టేడియంలోని పిచ్‌లను స్త్రీలకు అప్పజెప్పడం ఎప్పుడూ లేదు. మొదటిసారి అలా బాధ్యత తీసుకున్న మహిళ జసింత కల్యాణ్.


బెంగళూరులో జసింత

బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరుగుతోన్న డబ్ల్యూపీఎల్ కోసం పిచ్‌ను తయారు చేసే బాధ్యతను అందుకున్నారు జసింత కల్యాణ్. బెంగళూరు నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరొబెలె అనే ఊరిలో జన్మించిన జసింత తండ్రి వరి రైతు. చిన్నప్పుడు ఆర్థిక కష్టాలు పడిన జసింత బెంగళూరు చేరుకుని 'కర్నాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్'లో రిసెప్షనిస్ట్‌గా చేరింది. ఆ తర్వాత అడ్మినిస్ట్రేటర్‌గా ప్రమోట్ అయ్యింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆమె ఆఫీసు ఉన్నా మ్యాచ్‌లు చూసేది కాదు. సిక్సర్లు, ఫోర్లు విని పిస్తే తప్ప. అయితే ఆమెకు స్టేడియంలోని పచ్చగడ్డి అంటే ఇష్టం. అది గమనించిన అసోసియేషన్ సెక్రటరీ బ్రిజేష్ 2014లో స్టేడియంలో పని చేసే మాలీలపై అజమాయిషీని అప్పజెప్పాడు. ఆ తర్వాత ఆ స్టేడియంకు చెందిన పిచ్ క్యూరేటర్ ప్రశాంత్ రావు ఆమెకు పిచ్‌లు తయారు చేయడంలో మెళకువలు నేర్పాడు. దాంతో ఆమె పూర్తిగా అనుభవం గడించింది. ఆ అనుభవం నేడు ఆమెను మన దేశ తొలి మహిళా పిచ్ క్యూరేటర్‌గా నిలిపింది. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ప్రస్తుతం జరుగుతున్న విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో పిచ్‌లను ఆమె అజమాయిషీ చేస్తోంది. క్యూరేటర్‌గా జసింత నియామకం గురించి తెలిశాక క్రికెట్ రంగం నుంచి, అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతుంటే బీసీసీఐ సెక్రటరీ జై షా కూడా సోషల్ మీడియా వేదికగా ఆమెను కొనియాడుతూ పోస్ట్ చేశారు. తన పనితీరుకు మెచ్చుకుంటూ ప్రశంసలతో ముంచెత్తారు.

పెట్ పేరెంట్

'ఆశ్రయం కోరి వచ్చిన ప్రాణిని ఆదరించు...
అని చెప్పింది అమ్మ. ఒక మూగజీవి
గాయాలతో రోదిస్తుంటే చూస్తూ ఊరుకోలేను.
ఒక ప్రాణి కడుపులో కాళ్లు పెట్టుకుని ముడుచుకుని పడుకుంటే
దాని ఆకలి తీర్చకుండా నా దారిన నేను వెళ్లలేను. ఒక రోజు
గాయపడిన ఓ కుక్కపిల్ల ఏడుపు నాలోని తల్లి మనసును కదిలించింది.
దాని బాధ చూసిన తర్వాత మనసు కలచి వేసింది.
ఆ కుక్కపిల్ల ఆరోగ్యం కుదుటపడే వరకు మా ఇంట్లోనే పెట్టుకున్నాను.
అలా మొదలైన ఈ సేవ ఇప్పుడు దాదాపు నాలుగు
వందల కుక్కలతో సాగుతోంది' అన్నారు 58 ఏళ్ల **సారా అయ్యర్.**





మూగ జీవుల సేవలో...

చెన్నైకి చెందిన సారా అయ్యర్ స్పెషల్ ఎడ్యుకేటర్. స్పెషల్ చిల్డ్రన్‌ని సమాజంలో సాధారణ పౌరుల్లా తీర్చిదిద్దడంలో దాదాపు పాతికేళ్లు పని చేశారు. ఐదేళ్ల కిందట మూగజీవుల సేవ వైపు మలుపు తీసుకుందామె జీవితం. ఏ మాత్రం ముందస్తు ప్రణాళిక లేకుండా జరిగిపోయిన మార్పులను ఇలా చెప్పారామె...

"మా అమ్మాయి పై చదువుల కోసం అమెరికా వెళ్లింది. ఆ పనుల కోసం నేను టీచింగ్ నుంచి కొంత విరామం తీసుకోవాల్సి వచ్చింది. పిల్లలు దూరంగా వెళ్లిన తర్వాత ఇంట్లో ఏర్పడే వెలితి. ఎంప్టీనెస్ట్ సిండ్రోమ్ అనేటంత పెద్ద పదం చెప్పను కానీ కొంత మానసికమైన ఖాళీ ఏర్పడిందనే చెప్పాలి. జనవరి ఒకటో తేదీన నేను, నా భర్త గెర్రీ ఇద్దరం పీకే సినిమాకి వెళ్లి వస్తున్నాం. దాదాపుగా ఇంటికి దగ్గరకు వచ్చేశాం. ఎక్కడి నుంచో చిన్న కుక్కపిల్ల అరుపు వినిపిస్తోంది. క్షణాల్లోనే తెలిసింది అది అరుపు కాదు ఏడుపు అని. ఎవరో పెంచుకోవడానికి కుక్కపిల్లను తెచ్చుకున్నారు, అది బెంగతో ఏడుస్తుందేమో అనుకున్నాను. అది నిస్సహాయంగా ఏడుస్తోందని కొద్ది నిమిషాల్లోనే తెలిసిపోయింది. ఇక ఊరుకోలేకపోయాను. దాని గొంతు వినవస్తున్న దిశగా వెళ్లాను. అది పార్కు చేసిన కారుకి గోడకు మధ్య ఇరుక్కుపోయి ఉంది. తీవ్రంగా గాయపడింది. బయటకు తీయడానికి దగ్గరకు వెళ్తున్నా రానివ్వలేదు. నేను దానిని ఊరడిస్తూ ఉంటే మా వారు మరో వైపు నుంచి వెళ్లి దానిని బయటకు తీశారు. అయితే... కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా క్లినిక్‌లన్నీ మూసేసి ఉన్నాయి. ఇంటికి తీసుకువెళ్లి మాకు చేతనైన చికిత్స చేసి ఆ మరునాడు దానికి వైద్యం చేయించాం. ఆ కుక్కపిల్ల మామూలయ్యే వరకు మాతోనే ఉంది. ఆ తర్వాత కూడా మాతోనే ఉండిపోయింది. అలా మొదలైన సేవ ఇది.

ఓ రోజు... ఒక ఇండియన్ బ్రీడ్ కుక్క నాలుగు పిల్లలను పెట్టి అలసటతో ఉంది. ఆ దారిన ఓ వ్యక్తి లాబ్రిడార్‌ను వాకింగ్‌కు తీసుకు వెళ్తున్నాడు. వాళ్లను చూసి ఈ కుక్క అరవసాగింది. ఆ వ్యక్తికి కోపం ఎందుకు వచ్చిందో తెలియదు కానీ తన చేతిలో ఉన్న కర్ర ఎత్తాడు. అతడు ఆ కుక్క నడవలేనంత తీవ్రంగా గాయపరిచాడని ఆ మరునాడు తెలిసింది. అప్పుడు ఆ కుక్కను, పిల్లలను ఇంటికి తెచ్చాను. నేను మా వారు ఇద్దరమూ వాటికి ఆహారం పెట్టడం, గాయపడిన వాటికి వైద్యం చేయడం, ఫిజియోథెరపీ చేయడం అన్నీ నేర్చుకున్నాం. మాకు తెలిసిన అందరినీ ఒక వాట్సాప్ గ్రూప్‌లో చేర్చి 'కుక్కలు, కుక్క పిల్లలు గాయపడి నిరాశ్రయంగా ఉన్నట్లు మీ దృష్టికి వస్తే మాకు తెచ్చివ్వండి, లేదా సమాచారం ఇవ్వండి, మేము సంరక్షిస్తాం' అని మెసేజ్ పెట్టాం. మద్రాస్ యానిమల్ రెస్క్యూ సొసైటీ అలా ఏర్పడింది. ఇప్పుడు మా దగ్గర గాయపడినవి, చూపు కోల్పోయినవి, అనారోగ్యాలతో పుట్టినవి, ఆదరించే వాళ్లు లేక ఇక్కడే ఉండిపోయినవి అన్నీ కలిసి నాలుగు వందలకు పైగా ఉన్నాయి. మా సర్వీస్‌కి మెచ్చిన మా అమ్మ, అత్తమ్మ ఇద్దరూ తమ వంతుగా ఈ మూగజీవుల సంరక్షణకు అవసరమైన వస్తువులు, ఇతర అవసరాల కోసం డబ్బు ఇచ్చి అండగా నిలిచారు. ఇప్పుడు వాళ్లిద్దరూ లేరు. 'ఆశ్రయం కోసం వచ్చిన ఏ ప్రాణినీ నిర్లక్ష్యం చేయవద్దు' అని వారు మాకు చెప్పిన మాట మాతోనే ఉంది.


మేము స్థాపించిన మద్రాస్ యానిమల్ రెస్క్యూ సొసైటీ... తమిళనాడు యానిమల్ వెల్ఫేర్ బోర్డుతో కలిసి పని చేస్తోంది. ఈ మా ప్రయాణంలో ఇన్ని కుక్కలను సంరక్షించడానికి అవసరమైన విశాలమైన స్థలం పెద్ద సమస్య అయింది. చెన్నై నగర శివారు, మహాబలిపురం రూట్‌లో ఈస్ట్‌కోస్ట్‌రోడ్‌లో మా ఫ్రెండ్‌కి ఓ స్థలం ఖాళీగా ఉంది. దానిని అద్దెకు తీసుకుని కుక్క పిల్లలకు, గాయపడిన వాటికి, అనారోగ్యం పాలైన వాటికి వేరు వేరుగా కెన్నెల్స్ కట్టించి సంరక్షిస్తున్నాం. అవి మమ్మల్ని పేరెంట్స్‌గా ప్రేమిస్తాయి" అంటూ తనను ముద్దాడడానికి వచ్చిన పెట్‌ను ప్రేమగా చేతుల్లోకి తీసుకున్నారు సారా అయ్యర్. తన సంరక్షణలో ఉన్న కుక్కలన్నింటికీ పేర్లు పెట్టారామె. వాటికి రిజిస్టర్ నిర్వహిస్తూ వాటికి ఎప్పుడు ఏ మందులు వేశారు, ఇంకా ఎప్పుడు ఏ ఇంజక్షన్‌లు వేయించాలి... వంటి వివరాలను నమోదు చేస్తారామె.

మల్టీ టాలెంట్

విశ్రాంత సమయాన అవిశ్రాంత కృషి

'అపర్ణ మేడం పాఠం ఒక్కసారి వింటే ప్రతి చెట్టు, ప్రతి పువ్వుతో స్నేహం చేయాలనిపిస్తుంది'
'అపర్ణ స్వరపరిచిన పాటలు వింటే అద్భుతం అనిపిస్తుంది'
'అపర్ణ వినిపించే వీణ స్వరాలు అపురూపం'
'అపర్ణ రాసిన పుస్తకాలు శాస్త్రీయ విషయాలను సైతం చాలా సులభంగా అర్థమయ్యేలా చెబుతాయి'... ఇలాంటి కామెంట్స్ అపర్ణ గురించి తరచుగా వినిపిస్తుంటాయి.
ఒక్కమాటలో చెప్పాలంటే **డా. అపర్ణ బుజర్ బారువా** బహుముఖ ప్రజ్ఞాశాలి.
విశ్రాంత జీవితానికి కొత్త అర్థం ఇచ్చిన ప్రతిభావంతురాలు.
కోల్‌కతాలో జరిగిన ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆమె తీసిన 'దూలియ కల్చర్ ఆఫ్ వోల్డ్ కామ్‌రూప్' బెస్ట్ డాక్యుమెంటరీ అవార్డ్‌ను అందుకుంది...





సాంస్కృతిక వైభవానికి అద్దం పట్టే అస్సాంలోని తేజ్‌పూర్‌లో పుట్టిపెరిగింది అపర్ణ. గువహటిలోని కాటన్ కాలేజీలో బాటనీ లెక్చరర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని 1969లో ప్రారంభించిన అపర్ణ ఒక వైపు విద్యార్థులకు బాటనీ పాఠాలు బోధిస్తూనే మరోవైపు విద్యార్థిగా మ్యూజిక్ కాలేజీలో చేరి సంగీత పాఠాలు నేర్చుకునేది. సంగీత విద్యాపీఠ్ నుంచి సితార్‌లో విశారద్ డిగ్రీ పొందింది.

ఎంతోమంది కవుల పాటలకు స్వరాలు సమకూర్చింది. ఆ పాటలు ఆల్ ఇండియా రేడియోలో ప్రసారమై ఆదరణ పొందాయి. వందపాటలకు పైగా స్వరాలు అందించిన అపర్ణ ఏఐఆర్ గువహటి ఫస్ట్ ఉమెన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా అరుదైన ఘనతను దక్కించుకుంది.

2003లో హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ హోదాలో పదవీ విరమణ చేసిన అపర్ణ 'ఇది విశ్రాంతి సమయం' అనుకోలేదు. 'ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి చాలా సమయం దొరికింది' అనుకుంది. తన సాంస్కృతిక మూలాలను వెదుక్కుంటూ వెళ్లింది. కొత్త సంగీత ధోరణులను అధ్యయనం చేసింది. సంస్కృతి, సాహిత్యం, శాస్త్రీయ రంగాలకు సంబంధించి ఎన్నో పుస్తకాలు రాసింది.

గువహటిలోని గీతానగర్‌లో తన భర్త నాగేంద్రనాథ్ బుజర్ బారువా పేరు మీద చక్కటి లైబ్రరీ ఏర్పాటు చేసింది.

కాలంతో పాటు నడుస్తూ షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలు తీయడం నేర్చుకుంది.

26 నిమిషాల నిడివి ఉన్న 'దూలియ కల్చర్ ఆఫ్ వోల్డ్ కామ్‌రూప్' డాక్యుమెంటరీ అపర్ణకు అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చింది. 'దూలియ సంస్కృతి గత, వర్తమానాలకు అద్దం పట్టేలా ఈ డాక్యుమెంటరీని రూపొందించాను. దూలియా లాంటి ప్రత్యేక సంస్కృతిని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది' అంటుంది అపర్ణ.

> **నా వయసు జస్ట్ 78 ప్లస్**
>
> బెస్ట్ డాక్యుమెంటరీ అవార్డ్‌ను అందుకోవడానికి వేదికపైకి వచ్చినప్పుడు యాంకర్ నన్ను ఆశ్చర్యంగా చూసి 'మీ వయసు ఎంత?' అని అడిగారు. 78 ప్లస్ అని చెప్పగానే 'మీరు నిజంగా ఈ తరానికి స్ఫూర్తి' అన్నారు. ఇది విని ప్రేక్షకులు పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టారు. ఈ చప్పట్లను కూడా నాకు వచ్చిన అపురూపమైన అవార్డ్‌గానే భావిస్తున్నాను. మొదటి డాక్యుమెంటరీకే నాకు పెద్ద పేరు రావడం అదృష్టంగా భావిస్తున్నాను.
>
> – డా.అపర్ణ బుజర్ బారువా

దూలియ అనేది పురాతన కళారూపం. దూలియ సంస్కృతి వైభవం గాయకుల పాటల్లో, ఆటల్లో, తోలుబొమ్మలాటలో కనిపిస్తుంది. గానం, నటన, హాస్యప్రదర్శన, డప్పులు వాయించడం... ఎన్నో కళల సమాహారంగా దూలియ సంస్కృతి ఉండేది. ఈ పురాతన కళారూపం గురించి ఊరూవాడా తిరిగి లోతైన పరిశోధన చేసింది అపర్ణ. తాను తెలుసుకున్న విషయాలకు డాక్యుమెంటరీ రూపాన్ని ఇచ్చింది. దూలియ సంస్కృతికి తన జీవితాన్ని అంకితం చేసిన డ్రమ్మర్, నటుడు మోహన్ చంద్ బర్మన్ కృషిని ఈ డాక్యుమెంటరీ హైలెట్ చేస్తుంది.

దూలియ సంస్కృతిపై అపర్ణకు ఆసక్తి, అనురక్తి ఎలా పెరిగింది అనే విషయానికి వస్తే....

కొన్ని సంవత్సరాల క్రితం గువహటిలోని గీతానగర్ రాస్ ఫెస్టివల్‌లో కామ్‌రూపియా ప్రదర్శనను ప్రారంభించడానికి అపర్ణను ఆహ్వానించారు నిర్వాహకులు. ఈ ప్రదర్శను చూసి అపర్ణ మంత్రముగ్ధురాలైంది. ఈ ఆనందం ఒక కోణం అయితే కళాకారుల ఆర్థిక కష్టాలు తెలుసుకొని బాధ పడడం మరో కోణం. ఇక ఆరోజు నుంచి కామ్‌రూప్ కళాకారుల కోసం తన వంతుగా ఏదైనా చేయాలని తపించి పోయింది. ఈ గొప్ప కళారూపాన్ని ప్రపంచానికి తెలిసేలా చేస్తే, సహాయం చేసే ద్వారాలు తెరుచుకుంటాయని నిర్ణయించుకొని తన నిర్మాణ, దర్శకత్వంలో డాక్యుమెంటరీ ప్రారంభించింది.

ఏ లక్ష్యంతో అయితే ఈ డాక్యుమెంటరీ నిర్మాణానికి అపర్ణ పూనుకుందో అది నెరవేరే సమయం వేగవంతం అయింది. దూలియ సంస్కృతి గురించి ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ పురాతన కళారూపాన్ని తమ భుజాల మీద మోస్తున్న అరుదైన కళాకారులకు సహాయం అందడమే ఇక తరువాయి. ఏ పని మొదలుపెట్టినా 'అంతా మంచే జరుగుతుంది' అనుకోవడం అపర్ణ సెంటిమెంట్. కళాకారులకు సహాయం అందే విషయంలో కూడా ఆమె సెంటిమెంట్ నెరవేరాలని ఆశిద్దాం.

యంగ్

నవతరం ఆలోచనలు సృజనాత్మకంగానే కాదు
జనంతో మమేకం అయ్యే విషయాలపట్ల అవగాహనతోనూ
ఉంటున్నాయనడానికి ఉదాహరణ **గౌరీ మినోచా.**
ఢిల్లీ వాసి అయిన గౌరి ఆర్ట్ సైకోథెరపీతో
భవిష్యత్తును తీర్చుదిద్దుకుంటున్న వర్ధమాన కళాకారిణి.
అభిరుచితో నేర్చుకున్న పెయింటింగ్ ఆర్ట్, చదువుతో ఒంటపట్టించుకున్న
సైకాలజీ ఈ రెండింటి కాంబినేషన్‌తో రిలాక్సేషన్ టెక్నిక్స్ కనుక్కుంది.
ఈ శైలిలోనే వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ స్కూల్, కాలేజీ పిల్లల మానసిక ఒత్తిడులను
దూరం చేస్తుంది. ఆర్ట్ సైకోథెరపీతో ప్రజాదరణ పొందుతూ ఈ తరానికి
కొత్త స్ఫూర్తిని అందిస్తోంది. తను ఎంచుకున్న మార్గం గురించి ప్రస్తావిస్తూ...



ఆర్ట్ థెరపీ

"కళ-మనస్తత్వ శాస్త్రం రెండూ హృదయానికి దగ్గరగా ఉంటాయి. నేను ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజీలో సైకాలజీ బీఏ ఆనర్స్ ఫైనల్ సెమిస్టర్ చదువుతున్నాను. పన్నెండవ తరగతిలో 99 శాతం మార్కులు రావడంతో సైకాలజీని ఎంచుకున్నాను. ఢిల్లీలో ఆర్ట్ సైకోథెరపీ సెంటర్‌ను ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్నాను.

కళ – మనస్తత్వ శాస్త్రం రెండూ నాకు ఇష్టమైన సబ్జెక్ట్‌లు. ఆర్ట్ సైకోథెరపీలో... డిప్రెషన్, ఆందోళనతో బాధపడుతున్న వ్యక్తులు పెయింటింగ్స్ వేసి వారికి ఇస్తుంటాను. వారి చేత కూడా రంగులతో నచ్చిన అంశాన్ని ఎంచుకొని చిత్రించమని అడుగుతాను. వారికి ఏమీ రాకపోవచ్చు. కానీ ఈ విధానం ద్వారా వారిలో నిరాశ, ఆందోళన స్థాయిలను చెక్ చేస్తాను. ఇదొక రిలాక్సేషన్ టెక్నిక్. విదేశాలలో చాలా ప్రసిద్ధి చెందినప్పటికీ మన దేశంలో ఇప్పటికీ అంత ప్రజాదరణ పొందలేదు. దీనికి కొన్ని స్కూళ్లు, కాలేజీలను ఎంచుకొని ఉచితంగా వర్క్‌షాప్స్ కూడా నిర్వహిస్తుంటాను.

చిన్ననాటి నుంచి... మా అమ్మ ఆర్టిస్ట్. వ్యాపారవేత్త కూడా. ఒక ఆర్ట్ గ్యాలరీని కూడా నడుపుతోంది. ఇందులో అనేకమంది ప్రసిద్ధ కళాకారుల పెయింటింగ్ ప్రదర్శనలు జరుగుతాయి. ఆమె పిల్లలకు, పెద్దలకు పెయింటింగ్ క్లాసులు కూడా తీసుకుంటుంది. రంగులు, చిత్రాలు, కళాకారుల మధ్య నా బాల్యం గడిచింది. అలా నాకు చిత్ర కళ పట్ల అభిరుచి పెరిగింది. ఒకసారి ఎమ్‌ఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ జరిగినప్పుడు అతని గుర్రపు పెయింటింగ్‌ను కాపీ చేశాను. అమ్మ నాలో ఉన్న ఆర్టిస్ట్‌ను గుర్తించి, సహకరించింది. ఈ కళలో ఎన్నో అవార్డులు అందుకున్నాను. కళతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్నాను.

ఒత్తిడి లేకుండా చదువు... నేను క్లాస్‌రూమ్‌లో కంటే ఆర్ట్ రూమ్‌లో ఎక్కువ సమయం గడిపాను. కానీ, నా చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. కాలేజీ స్థాయికి వచ్చాక ఆర్ట్ నీ సీరియస్‌గా తీసుకోవడం మొదలుపెట్టాను. ఎందుకంటే జీవితంలో సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. ప్రతి స్టూడెంట్‌లాగే నేనూ నా కెరియర్ గురించి తీవ్రంగా ఆలోచించాను. గ్రాడ్యుయేషన్ ఆర్ట్స్‌లో చేయాలా, సైకాలజీలో ఏ సబ్జెక్ట్ చేయాలో అర్థం కాక కొన్నిరోజులు మథనపడ్డాను. కానీ, ఆర్ట్ నా అభిరుచి, కెరియర్ సైకాలజీ రెండింటిలో ప్రావీణ్యం సాధించాలనుకున్నాను. పగలు కాలేజీ, రాత్రి సమయంలో ఎంతసేపు వీలుంటే అంత టైమ్ పెయింటింగ్ చేస్తుంటాను.

వ్యాపారంలోనూ నైపుణ్యం... స్కూల్ ఏజ్ నుంచే నా పెయింటింగ్స్‌తో ఎగ్జిబిషన్‌ని ఏర్పాటు చేసే దాన్ని. మొదటి పెయింటింగ్‌కు ఐదు వేల రూపాయలు వచ్చాయి. మొదట్లో నా పెయింటింగ్స్‌ని బంధువులందరికీ పంపాను. తమ ఇంట్లో పెయింటింగ్స్ అలంకరించినప్పుడు వారి ఇళ్లకు వచ్చిన బంధువులు ఆ పెయింటింగ్స్ చూసి తమకూ పంపమని కాల్స్ చేయడం ప్రారంభించారు. విదేశాల్లో ఉన్న బంధువుల నుంచి నా పెయింటింగ్స్ అమెరికా, లండన్, ముంబై, ఢిల్లీ సహా అనేక ప్రాంతాలకు చేరాయి. ఈ రోజు ఢిల్లీని ఆర్ట్ హబ్‌లో నా 12 పెయింటింగ్స్‌లో 9 అమ్మకానికి ఉన్నాయి. ప్రతి కళాకారుడు తన సొంత మార్కెట్ విలువను సృష్టించుకోవడం, ప్రచారం కూడా ముఖ్యం. సృజనాత్మకతతోపాటు వ్యాపారంలో కూడా నైపుణ్యం సాధించాలి" అంటూ నవతరానికి బిజినెస్ టెక్నిక్స్ కూడా చెబుతుంది గౌరి మినోచా.

బ్యూటిప్స్

పాలతో చర్మ సౌందర్యం

చర్మం కాంతిమంతంగా మెరవాలంటే క్రీమ్‌లు లోషన్‌లకు బదులు ఇంట్లో ఉండే పాలతో ప్రయత్నించి చూడండి.

- పచ్చి పాలలో దూదిని ముంచి మెడ, గొంతు, ముఖాన్ని తుడిస్తే చర్మం మీద పట్టేసిన మురికి (సబ్బుతో శుభ్రం చేసినప్పటికీ వదలని మురికి) వదిలిపోతుంది.
- రెండు టీ స్పూన్‌ల పచ్చిపాలలో టీ స్పూన్ శనగపిండి, రెండు చుక్కల తేనె కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కొద్దిగా నీటిని చల్లి వలయాకారంగా మసాజ్ చేస్తూ శుభ్రం చేయాలి.



- ముఖం మీద సన్నని గీతలతో చిన్న వయసులోనే వార్ధక్యపు లక్షణాలు కనిపిస్తుంటే రోజూ మిల్క్ ప్యాక్ వేయాలి. ముఖాన్ని సబ్బుతో శుభ్రం చేసిన తర్వాత పచ్చి పాలలో దూదిని ముంచి ముఖం మీద అద్దాలి. పాలు ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేసి పెసరపిండి ప్యాక్ వేయాలి. రెండు టీ స్పూన్‌ల పెసర పిండిలో రెండుచుక్కల తేనె వేసి తగినంత నీటితో కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తుంటే చర్మం నిత్య యవ్వనంతో ఉంటుంది. వార్ధక్య లక్షణాలు దూరమవుతాయి.

ప్రజ్ఞానంద శుభారంభం... వైశాలి ఓటమి



భారత చెస్ సంచలనం ఆర్. ప్రజ్ఞానంద అంతర్జాతీయ వేదికపై తన జోరు కొనసాగిస్తున్నాడు. చెక్ రిపబ్లిక్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక ప్రేగ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో అతను విజయంతో మొదలు పెట్టాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్ పోరులో ప్రజ్ఞానంద 41 ఎత్తుల్లో జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమర్‌ను ఓడించాడు. ఇటాలియన్ ఓపెనింగ్‌తో మొదలు పెట్టిన భారత జీఎం అటాకింగ్ గేమ్ మొదలు కీమర్ డిఫెన్స్ పని చేయలేదు. ఈ మ్యాచ్ గెలిచే క్రమంలో ప్రజ్ఞానంద 'లైవ్ రేటింగ్'లో విశ్వనాథన్ ఆనంద్‌ను దాటి భారత్ తరఫున అత్యధిక రేటింగ్ నమోదు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇతర భారత ఆటగాళ్లలో రిచర్డ్ ర్యాపో (రొమానియా)తో జరిగిన గేమ్‌ను డి. గుకేశ్...డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన గేమ్‌ను విదిత్ గుజరాతీ 'డ్రా' చేసుకున్నారు. చాలెంజర్ విభాగంలో అన్‌టోన్ కొరొబొవ్ (ఉక్రెయిన్)తో జరిగిన పోరులో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి ఓటమిపాలైంది.

యశస్వికి 'డబుల్'... శ్రేయస్, కిషన్ అవుట్

వార్షిక కాంట్రాక్ట్‌లు ప్రకటించిన బీసీసీఐ • మొహమ్మద్ సిరాజ్‌కు ప్రమోషన్





ప్రతిభకు, మైదానంలో ప్రదర్శనకు బీసీసీఐ పట్టం కట్టింది...టెస్టుల్లో వరుస డబుల్ సెంచరీలతో చెలరేగిన యశస్వి జైస్వాల్‌ను 'డబుల్ ప్రమోషన్'తో గుర్తించిన బోర్డు నిలకడైన ఆటతో సత్తా చాటిన హైదరాబాదీ పేసర్ సిరాజ్‌ను ఒక మెట్టు పైకి ఎక్కించింది. అగ్రశ్రేణి ఆటగాళ్లు తమ స్థాయిని నిలబెట్టుకోగా...క్రమశిక్షణ తప్పితే శిక్ష తప్పదంటూ శ్రేయస్, కిషన్‌లను పక్కన పెట్టింది. 30 మందితో కూడిన బీసీసీఐ కొత్త కాంట్రాక్ట్ జాబితాలో విశేషాలివి.

న్యూఢిల్లీ: అక్టోబర్ 2023– సెప్టెంబర్ 2024 మధ్య కాలానికి సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వార్షిక కాంట్రాక్ట్‌లను ప్రకటించింది. సుదీర్ఘ కాలంగా భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా బీసీసీఐ కాంట్రాక్ట్‌ల జాబితాలో తమ 'ఎ ప్లస్' గ్రేడ్‌లను నిలబెట్టుకున్నారు. ఈ కేటగిరీలో గత ఏడాదితో పోలిస్తే ఎలాంటి మార్పు జరగలేదు. గ్రేడ్ 'ఎ'లో ఇప్పటికే ఉన్న అశ్విన్, షమీ, హార్దిక్ పాండ్యాలతో పాటు కొత్తగా సిరాజ్, రాహుల్, గిల్ చేరారు. గత ఏడాది కాలంగా వన్డే వరల్డ్ కప్ సహా పలు సిరీస్‌లలో కీలక ప్రదర్శనలతో టీమ్ మేనేజ్‌మెంట్ అంచనాలను అందుకోవడమే ఈ ముగ్గురి ప్రమోషన్‌కు కారణం. టి20ల్లో అద్భుత ప్రదర్శనలతో చెలరేగుతూ వన్డే జట్టులోనూ ఉన్న సూర్యకుమార్ యాదవ్ గ్రేడ్ 'బి'లో తన స్థానం నిలబెట్టుకోగా ఇందులో యశస్వి జైస్వాల్‌కు అవకాశం దక్కడం పెద్ద విశేషం. సాధారణంగా తొలి సారి కాంట్రాక్ట్ ఇస్తూ ఆటగాళ్లను 'సి'లో చేర్చి ఆపై ప్రదర్శనతో ప్రమోషన్‌లు ఇచ్చే బోర్డు యశస్వి అసాధారణ ఆటకు నేరుగా 'బి'లో అవకాశం కల్పించింది. 'సి' జాబితాలో ఉన్నవారిలో కొందరు అప్పుడప్పుడు వన్డేల్లో మెరిసినా...దాదాపు అందరూ టి20 స్పెషలిస్ట్‌లే కావడం విశేషం.

క్రమశిక్షణారాహిత్యంతో...

'వార్షిక కాంట్రాక్ట్‌లలో ఈ సారి శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌ల పేర్లను పరిశీలించడం లేదు' అని బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఇటీవలి పరిణామాలే అందుకు కారణం. వీరిద్దరు భారత్‌కు ఆడని సమయంలో రంజీ ట్రోఫీలో తమ రాష్ట్ర జట్ల తరఫున బరిలోకి దిగాలని బీసీసీఐ సూచించినా... దానిని పట్టించుకోలేదు. మానసిక ఆందోళన కారణంగా చూపి దక్షిణాఫ్రికా టూర్ మధ్యలోనే స్వదేశం వచ్చేసిన కిషన్ ఆ తర్వాత దుబాయ్‌లో పార్టీలో పాల్గొంటూ కనిపించాడు. తమ జట్టు జార్ఖండ్ ఒక వైపు రంజీ ఆడుతుంటే అతను నేరుగా ఐపీఎల్ టీమ్ ముంబై ఇండియన్స్ శిక్షణా శిబిరానికి హాజరయ్యాడు. మరో వైపు ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో చోటు కోల్పోయిన తర్వాత శ్రేయస్ వెన్ను గాయంతో ముంబై తరఫున రంజీ క్వార్టర్ ఫైనల్ ఆడలేనని చెప్పాడు. అతని గాయంలో నిజం లేదని ఎన్‌సీఏ డాక్టర్లు ధ్రువీకరించినట్లుగా బోర్డు అంతర్గత సమాచారం. ఈ విషయంలో కోచ్ ద్రవిడ్ నివేదిక ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వరల్డ్ కప్‌లో 530 పరుగులతో కీలక పాత్ర పోషించిన అయ్యర్ పట్ల తీవ్రంగా వ్యవహరించి...గాయం తర్వాత అక్టోబర్‌నుంచి ఇప్పటి వరకు అధికారిక టోర్నీ ఆడని హార్దిక్‌కు మాత్రం 'ఎ' గ్రేడ్ కాంట్రాక్ట్ కొనసాగించడం ఆసక్తికరం. జాతీయ జట్టుకు ఆడని సమయంలో కచ్చితంగా దేశవాళీ క్రికెట్ ఆడాలంటూ బీసీసీఐ ఇప్పుడు స్పష్టంగా పేర్కొనడం విశేషం.

కొత్తగా పేసర్లకు...

కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న రిషభ్ పంత్ గత ఏడాది కాలంలో ఎలాంటి క్రికెట్ ఆడకపోయినా...పూర్తిగా పక్కన పెట్టకుండా ఒక గ్రేడ్ తగ్గించి అతడిని కొనసాగించగా...పేలవ ప్రదర్శనతో అక్షర్ స్థాయి కూడా తగ్గింది. భారత్‌లో ఫాస్ట్ బౌలర్లను ప్రత్యేకంగా గుర్తించి ప్రోత్సహించే క్రమంలో ఐదుగురు బౌలర్లకు కొత్తగా 'ఫాస్ట్ బౌలింగ్ కాంట్రాక్ట్'లు ఇవ్వడం విశేషం. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు కాలాన్ని కాంట్రాక్ట్ కోసం పరిగణనలోకి తీసుకున్నారు. బోర్డు నిబంధనల ప్రకారం కనీసం 3 టెస్టులు లేదా 8 వన్డేలు, లేదా 10 టి20లు ఆడాలి. ఇంగ్లండ్‌తో రెండు టెస్టులు ఆడిన సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురేల్ తర్వాతి మ్యాచ్ ఆడితే వారు నేరుగా 'సి' గ్రేడ్‌లోకి వచ్చేస్తారు. జట్టులో స్థానం కోల్పోయిన పుజారా, ఉమేశ్, శిఖర్, చహల్, హుడా సహజంగానే జాబితానుంచి దూరమయ్యారు.



బీసీసీఐ వార్షిక కాంట్రాక్ట్‌ల జాబితా (2023-24)

గ్రేడ్ 'ఎ' ప్లస్ (రూ.7 కోట్లు): రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా

గ్రేడ్ 'ఎ' (రూ. 5 కోట్లు): అశ్విన్, మొహమ్మద్ షమీ, మొహమ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్, శుబ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యా

గ్రేడ్ 'బి' (రూ. 3 కోట్లు): సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, యశస్వి జైస్వాల్

గ్రేడ్ 'సి'(రూ.1 కోటి): రింకూసింగ్, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, శార్దుల్ ఠాకూర్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, జితేశ్ శర్మ, సుందర్, ముకేశ్ కుమార్, సంజు సామ్సన్, అర్ష్‌దీప్, కేఎస్ భరత్, ప్రసిధ్ కృష్ణ, అవేశ్ ఖాన్, రజత్ పటిదార్ (వీరందరికీ మొదటిసారి కాంట్రాక్ట్ దక్కింది).

కాంట్రాక్ట్‌లు కోల్పోయినవారు: అయ్యర్, ఇషాన్ కిషన్, పుజారా, ఉమేశ్ యాదవ్, శిఖర్ ధావన్, దీపక్ హుడా, యజువేంద్ర చహల్.

↑ సిరాజ్, రాహుల్, గిల్ ('బి' నుంచి 'ఎ'కి)
↑ కుల్దీప్ 'సి' నుంచి 'బి'కి
↓ పంత్, అక్షర్ ('ఎ' నుంచి 'బి' కి)
↑↑ యశస్వికి నేరుగా 'బి' గ్రేడ్

ఫాస్ట్ బౌలింగ్ కాంట్రాక్ట్‌లు: ఆకాశ్ దీప్ (బెంగాల్), ఉమ్రాన్ మలిక్ (జమ్మూ కశ్మీర్), యశ్ దయాళ్ (యూపీ), విద్వత్ కావేరప్ప, విజయ్ కుమార్ వైశాక్ (కర్ణాటక).



పుణేరి-పట్నా మ్యాచ్ దృశ్యం



హరియాణా - జైపూర్ మ్యాచ్ దృశ్యం

టైటిల్ పోరుకు పుణేరి, హరియాణా

- సెమీస్‌లో పట్నా, జైపూర్ ఓటమి
- రేపు ప్రొ కబడ్డీ లీగ్ ఫైనల్

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్‌లో కొత్త చాంపియన్ ఖాయమైంది. నిరుటి రన్నరప్ పుణేరి పల్టన్‌తో అమీతుమీకి తొలిసారి ఫైనల్‌కు చేరిన హరియాణా స్టీలర్స్ సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య శుక్రవారం హైదరాబాద్‌లోనే ఫైనల్ పోరు జరుగనుంది. సెమీఫైనల్స్‌లో 'హ్యాట్రిక్' టైటిళ్ల విజేత పట్నా పైరేట్స్, రెండు సార్లు చాంపియన్‌గా నిలిచిన జైపూర్ పింక్‌పాంథర్స్ ప్రత్యర్థుల చేతుల్లో పరాజయం చవిచూశాయి. తొలి సెమీస్‌లో పుణేరి పల్టన్ ధాటికి 37–21తో టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన పట్నా పైరేట్స్ నిలువలేకపోయింది. పుణేరి తరఫున కెప్టెన్, ఆల్‌రౌండర్ అస్లామ్ ముస్తఫా (7పాయింట్లు), రెయిడర్ పంకజ్ మోహితే (7) అదరగొట్టారు. మిగతా వారిలో మొహమ్మద్ రెజా చియనె 5, మోహిత్ గోయత్ 4, సంకేత్, అభినేశ్ చెరో 3 పాయింట్లు చేసి జట్టు విజయంలో భాగమయ్యారు. పట్నా జట్టులో రెయిడర్ సచిన్ చేసిన 5 పాయింట్లే అత్యధిక స్కోరు! మిగిలిన వారిలో మన్‌జీత్, సుధాకర్ చెరో 4 పాయింట్లు చేశారు. అనంతరం హోరాహోరీగా జరిగిన రెండో సెమీ ఫైనల్లో హరియాణా స్టీలర్స్ 31–27తో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్‌పాంథర్స్‌ను కంగు తినిపించింది. స్టీలర్స్ రెయిడర్ వినయ్ 20 సార్లు కూతకు వెళ్లి 11 పాయింట్లు తెచ్చిపెట్టాడు. శివమ్ పతారే (7) కూడా అదరగొట్టాడు. మిగతావారిలో ఆల్‌రౌండర్ ఆశిష్ 4, డిఫెండర్లు రాహుల్ సేథ్‌పాల్ 3, మోహిత్ 2 పాయింట్లు సాధించారు. జైపూర్ తరఫున రెయిడర్ అర్జున్ దేశ్వాల్ (14) ఒంటరి పోరాటం చేశాడు. డిఫెండర్ రెజా మిర్బగెరి 4, భవానీ రాజ్‌పుత్ 3 పాయింట్లు చేశారు.

ముంబైకి వారియర్స్ చెక్!

- 7 వికెట్లతో యూపీ గెలుపు
- కిరణ్ నవ్‌గిరే ధనాధన్ ఫిఫ్టీ



కిరణ్ నవ్‌గిరే

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను యూపీ వారియర్స్ నిలువరించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ ఓపెనర్ కిరణ్ నవ్‌గిరే (31 బంతుల్లో 57; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్ని ఒంటిచేత్తో మార్చేసింది. దీంతో 7 వికెట్లతో గెలిచిన వారియర్స్ ఈ సీజన్‌లో బోణీకొట్టింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. ఓపెనర్ హేలీ మాథ్యూస్ (47 బంతుల్లో 55; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించింది. మరో ఓపెనర్ యస్తిక భాటియా (22 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించింది. కెప్టెన్ నట్‌సీవర్ బ్రంట్ (19; 2 ఫోర్లు), అమెలియా కెర్ (23; 1 ఫోర్, 1 సిక్స్) పెద్దగా మెరిపించలేకపోయారు. అనంతరం యూపీ వారియర్స్ 16.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. ఓపెనర్లు కిరణ్ నవ్‌గిరే, కెప్టెన్ అలిసా హీలీ (29 బంతుల్లో 33; 5 ఫోర్లు) చెలరేగారు. ఇద్దరు తొలి వికెట్‌కు 9 ఓవర్లలోనే 94 పరుగులు జోడించి గెలిచేందుకు అవసరమైన పునాదిని మెరుపు వేగంతో వేశారు. అయితే స్వల్ప వ్యవధిలో కిరణ్‌తో పాటు తాహ్లియా మెక్‌గ్రాత్ (1), కెప్టెన్ హీలీ నిష్క్రమించారు. కానీ తర్వాత వచ్చిన గ్రేస్ హారిస్ (17 బంతుల్లో 38 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), దీప్తిశర్మ (20 బంతుల్లో 27 నాటౌట్; 4 ఫోర్లు) ధాటిగా ఆడి మ్యాచ్‌ను ముగించారు.

ప్రిక్వార్టర్స్‌లో సహజ



న్యూఢిల్లీ: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టెన్నిస్ టోర్నమెంట్‌లో తెలుగు ప్లేయర్లు సహజ యామలపల్లి, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన తొలి రౌండ్లో ఐదో సీడ్ సహజ 6–4, 6–2తో జపాన్‌కు చెందిన కొషిషి అయుమిపై గెలుపొందగా, శ్రీవల్లి రష్మిక 6–1, 6–2తో క్వాలిఫయర్ యమజకి ఐకుమి (జపాన్)పై అలవోక విజయం సాధించింది. డబుల్స్ బరిలోనూ దిగిన రష్మిక క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్స్‌లో రష్మిక–వైదేహి చౌదరి జోడీ 6–0, 6–1తో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ పొందిన భారత జంట కశిష్ భాటియా–సాహిర సింగ్‌పై గెలిచింది. టాప్‌సీడ్ అంకిత రైనా (భారత్)– కులంబయెవా జిబెక్ (కజకిస్తాన్) జంట 2–6, 6–3, 11–9తో జీల్ దేశాయ్ (భారత్)–ఒకువకి రినాన్ (జపాన్) ద్వయంపై గెలిచింది. మిగతా సింగిల్స్ పోటీల్లో రియా భాటియా 7–6 (7/5), 6–4తో భారత క్వాలిఫయర్ అంజలిని ఓడించింది. హుమేరా బహర్మస్ 1–6, 0–6తో కులంబయెవా జిబెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడింది.

సినిమా

విదేశాల్లో శిక్షణ



ఇంటర్‌నేషనల్ ట్రైనింగ్‌కు రెడీ అవుతున్నారు కియారా అద్వానీ. బాలీవుడ్ 'డాన్' ఫ్రాంచైజీలో వస్తున్న లేటెస్ట్ ఫిల్మ్ 'డాన్ 3'. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించనున్నారు. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం వహించనున్న 'డాన్ 3'లో కియారా అద్వానీ హీరోయిన్. ఈ చిత్రంలో రణ్‌వీర్, కియారా.. ఇద్దరికీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయట. దీంతో అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్స్ పర్యవేక్షణలో ఇద్దరూ స్టంట్స్ నేర్చుకోనున్నారని బాలీవుడ్ టాక్. విదేశాల్లో ఈ శిక్షణ జరుగుతుందని సమాచారం. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది సెప్టెంబరులో ప్రారంభం కానుందని తెలిసింది.

• కియారా అద్వానీ

మార్చి 2న వ్యూహం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ జీవితంలో జరిగిన కొన్ని ఘటనల నేపథ్యంగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'వ్యూహం'. ఈ సినిమాకు కొనసాగింపుగా 'శపథం' ఉంటుంది. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాలను రామధూత క్రియేషన్స్‌పై దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. 'వ్యూహం' మార్చి 2న విడుదల కానుంది. 'పట్టు వదలని విక్రమార్కుణ్ణి.. 'వ్యూహం' మార్చి 2న థియేటర్స్‌లో విడుదలవుతోంది'' అంటూ 'వ్యూహం' సినిమా సెన్సార్ సర్టిఫికెట్ ఉన్న ఫోటోను 'ఎక్స్'లో షేర్ చేశారు రామ్ గోపాల్ వర్మ. ''వ్యూహం', 'శపథం' సినిమాల రిలీజ్‌ల విషయంలో దేవుడు మాకు అన్నీ కలిసొచ్చేలా చేశాడు. ఈ రెండు సినిమాలను తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 500 థియేటర్స్‌లో రిలీజ్ చేయబోతున్నాం. మా 'వ్యూహం' గ్యారెంటీగా సక్సెస్ అవుతుంది.



• రామ్‌గోపాల్ వర్మ, అమితాబ్ బచ్చన్, దాసరి కిరణ్

ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన మా సినిమా విడుదలకు సెన్సార్ బోర్డ్ అనుమతి ఇచ్చింది. వారికి ధన్యవాదాలు'' అన్నారు దాసరి కిరణ్ కుమార్.

ఆర్‌జీవీ డెన్‌లో అమితాబ్ బచ్చన్

బాలీవుడ్ స్టార్ అమితాబ్‌బచ్చన్ – రామ్ గోపాల్ వర్మ కాంబినేషన్‌లో 2005లో వచ్చిన 'సర్కార్' చిత్రం బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా అమితాబ్‌బచ్చన్–రామ్‌గోపాల్ వర్మ కాంబినేషన్‌లోనే 'సర్కార్ రాజ్' (2008), 'సర్కార్ 3' (2017) సినిమాలు వచ్చాయి. అయితే తాజాగా వీరిద్దరూ హైదరాబాద్‌లో కలుసుకున్నారు. రజనీకాంత్ 'వేట్టయాన్', ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' సినిమా చిత్రీకరణల కోసం అమితాబ్ బచ్చన్ హైదరాబాద్ వచ్చారని తెలిసింది. దీంతో అమితాబ్‌ను హైదరాబాద్‌లోని తన డెన్‌లోకి ఆహ్వానించారు వర్మ. ఆ సందర్భంగా అమితాబ్, దాసరి కిరణ్‌లతో కలిసి దిగిన ఫోటోలను 'ఎక్స్'లో షేర్ చేశారు వర్మ.

సెకండ్ షెడ్యూల్ షురూ



• మంచు విష్ణు

విష్ణు మంచు కలల ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' చిత్రం రెండో షెడ్యూల్ న్యూజిల్యాండ్‌లో ప్రారంభమైంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్ లాల్, ప్రభాస్ వంటి వారు నటిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. రెండో షెడ్యూల్ చిత్రీకరణ కోసం చిత్ర యూనిట్ న్యూజిల్యాండ్ వెళ్లింది. ఈ మేరకు విష్ణు మంచు ఓ వీడియోను షేర్ చేశారు. ఇందులో మోహన్‌బాబు, విష్ణు మంచు కనిపిస్తున్నారు. ''కన్నప్ప' చిత్రం కోసం ఇప్పటికే న్యూజిల్యాండ్‌లో 90 రోజుల పాటు నిర్విరామంగా ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఆ తర్వాత ఇండియా వచ్చి, కాస్త గ్యాప్ తీసుకున్నాం. తాజాగా రెండో షెడ్యూల్‌ను కూడా న్యూజిల్యాండ్‌లోనే ప్రారంభించాం. ఈ షెడ్యూల్‌లో ఒళ్లు గగుర్పొడిచే సన్నివేశాలు చిత్రీకరించనున్నాం. హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ షెల్డన్ చౌ 'కన్నప్ప'కి విజువల్స్ అందిస్తున్నారు'' అన్నారు మేకర్స్.

మూడు వెబ్ సిరీస్‌లకు శ్రీకారం



• ఎస్. శంకర్

'ఎన్‌కౌంటర్, శ్రీరాములయ్య, జయం మనదేరా, ఆయుధం, భద్రాచలం, జై బోలో తెలంగాణ' వంటి హిట్ చిత్రాల దర్శకుడు ఎన్. శంకర్ చారిత్రాత్మక కథాంశాలతో మూడు వెబ్ సిరీస్‌లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్. శంకర్ టీవీ అండ్ ఫిల్మ్ స్టూడియో బ్యానర్‌లో ఆయన నిర్మాతగా, దర్శకత్వ పర్యవేక్షణలో ఈ వెబ్ సిరీస్‌లు రూపొందనున్నాయి. ఈ సందర్భంగా ఎన్. శంకర్ మాట్లాడుతూ– ''తెలంగాణ సాయిధ పోరాటం నుండి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు మొదటి వెబ్ సిరీస్ నిర్మించనున్నాను. అక్టోబర్‌లో చిత్రీకరణ మొదలవుతుంది. అలాగే మహాత్మ జ్యోతీరావు పూలేగారి స్ఫూర్తితో రెండో వెబ్ సిరీస్ నిర్మిస్తాను. అయితే ఇది ఆయన బయోగ్రఫీ కాదు. జ్యోతీరావు పూలేగారి అనుభవాలు, ఆయన జీవితంలో జరిగిన సంఘటనలు, సంఘర్షణలు వంటివి ఈ వెబ్ సిరీస్‌లో ఉంటాయి. అదే విధంగా బాబా సాహెబ్ అంబేద్కర్‌గారిపై మూడో వెబ్ సిరీస్ ఉంటుంది. అయితే ఇది ఆయన బయోగ్రఫీ కాదు. అంబేద్కర్‌గారు ఇచ్చిన గొప్ప రాజ్యాంగ స్ఫూర్తిని, వ్యక్తి నుండి వ్యవస్థగా మారడానికి మధ్య జరిగిన సంఘర్షణల ఇతివృత్తంగా ఈ సిరీస్ సాగుతుంది. ఈ మూడు వెబ్ సిరీస్‌లను తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తాం. పూర్తి వివరాలు త్వరలో చెబుతాను'' అన్నారు.

మంచి సినిమా చేశాం



• సిద్ధు ముద్ద, నందకుమార్ అబ్బినేని

''వరుణ్ తేజ్, నేను డిఫరెంట్ సినిమాలు చేయాలని అనుకుంటుంటాం. అలా చేసిందే ఈ 'ఆపరేషన్ వాలెంటైన్'' అన్నారు నిర్మాత సిద్ధు ముద్ద. వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఎయిర్‌ఫోర్స్ యాక్షన్ డ్రామా 'ఆపరేషన్ వాలెంటైన్'. ఈ చిత్రంలో మానుషీ చిల్లర్ హీరోయిన్. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్‌నేషనల్ ప్రొడక్షన్స్, సిద్ధు ముద్ద రినైసన్స్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో రేపు విడుదలవుతోంది. బుధవారం విలేకర్ల సమావేశంలో సిద్ధు ముద్ద మాట్లాడుతూ– ''శక్తి ప్రతాప్ చేసిన ఓ షార్ట్ ఫిల్మ్ వరుణ్‌తేజ్‌కు, నాకు నచ్చింది. ఆ షార్ట్ ఫిల్మ్‌నే శక్తి ఫుల్ లెంగ్త్ సినిమా చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నాడని తెలిసి, పూర్తి కథ విన్నాం. మాకు నచ్చడంతో సినిమా చేయాలనుకున్నాం. ఏరియల్ యాక్షన్ నేపథ్యంలో 'ఫైటర్' తర్వాత వస్తోన్న చిత్రం మాదే అనుకుంటున్నా. భారత డిఫెన్స్ విభాగం నుంచి అనుమతులు వచ్చాకే ఈ సినిమా షూటింగ్ ఆరంభించాం. ప్రతి ఇండియన్ చూడాల్సిన చిత్రమిది'' అన్నారు. ''ఆపరేషన్ వాలెంటైన్' ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు సహ–నిర్మాతల్లో ఒకరైన నందకుమార్ అబ్బినేని.

వెబ్ సిరీస్‌గా పీవీ నరసింహారావు బయోపిక్

భారతదేశ దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు జీవితంతో వెబ్ సిరీస్ రూపొందనుంది. ఆహా స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలిసి 'హాఫ్ లయన్' పేరుతో ఈ వెబ్ సిరీస్ నిర్మించనున్నట్లు ప్రకటించాయి. ప్రముఖ రచయిత వినయ్ సీతాపతి రచించిన 'హాఫ్ లయన్' పుస్తకం ఆధారంగా జాతీయ అవార్డు గ్రహీత ప్రకాశ్ ఝా ఈ సిరీస్‌కి దర్శకత్వం వహించ నున్నారు. ''1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు అందించిన విశేష సేవలకుగానూ భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఈ సిరీస్‌ను రూపొందిస్తాం'' అని మేకర్స్ అన్నారు.

థ్రిల్లింగ్ డైరీస్



• ఆకృతి, డా. యోగేష్

డా. యోగేష్, ఆకృతి అగర్వాల్ జంటగా సన్నీ లియోన్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'డాక్టర్ యోగి డైరీస్'. రాజేశ్–ప్రసాద్‌ల దర్శకత్వంలో హర్షవర్ధన్, శ్రీదేవి మద్దాలి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవంలో తొలి సీన్‌కి దర్శకుడు వీరశంకర్ క్లాప్ ఇవ్వగా, దర్శకుడు వీఎన్ ఆదిత్య కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు మహేశ్ గౌరవ దర్శకత్వం వహించారు. ''ఈ ఏడాది ప్రేక్షకులు ఓ మంచి పారానార్మల్ థ్రిల్లర్‌ను చూస్తారు'' అన్నారు డా. యోగేష్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
790	247
72,305	21,951

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,950	▽	86
డోజోన్స్	38,888	▽	92
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,625	▽	58
డాక్స్	17,601	△	45
హాంకాంగ్	2,958	▽	58
నికాయ్	39,208	▽	31

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
62,135	▽	136
బంగారం (99.5 స్వచ్ఛత)		
61,866	▽	136
వెండి (కేజీ)		
69,343	▽	559

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.46	83.49
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.94	106.51
€	యూరో	ఎస్‌బీఐ	88.89	91.24
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.53	55.76
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.26	55.17
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.38	64.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.09	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.46
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.47

డిస్నీ, రిలయన్స్ మెగా డీల్

మీడియా కార్యకలాపాల విలీనానికి ఒప్పందం • రూ. 70,000 కోట్ల దిగ్గజంగా జాయింట్ వెంచర్ • రిలయన్స్‌కు 63.16 శాతం వాటా • జేవీలో రూ. 11,500 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: దిగ్గజ సంస్థలు వాల్ట్ డిస్నీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశీ మీడియా రంగంలో భారీ డీల్‌కు తెరతీశాయి. భారత్‌లో తమ మీడియా కార్యకలాపాలను విలీనం చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీంతో రూ. 70,352 కోట్లు (దాదాపు 8.5 బిలియన్ డాలర్లు) విలువ చేసే భారీ మీడియా దిగ్గజం ఆవిర్భవించనుంది. ఇందులో రిలయన్స్, దాని అనుబంధ సంస్థలకు 63.16 శాతం, డిస్నీకి 36.84 శాతం వాటాలు ఉంటాయని ఇరు సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి. నెట్‌ఫ్లిక్స్, సోనీ వంటి దిగ్గజాలకు దీటుగా పోటీనిచ్చేందుకు జాయింట్ వెంచర్‌లో రిలయన్స్ దాదాపు రూ. 11,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. జేవీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ సారథ్యం వహించనుండగా, డిస్నీ మాజీ టాప్ ఎగ్జిక్యూటివ్ ఉదయ్‌శంకర్ వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఈ ఏడాది ఆఖరు త్రైమాసికంలో లేదా 2025 తొలి త్రైమాసికంలో డీల్ పూర్తి కాగలదని అంచనా.



కీలక ఒప్పందం ..

'వయాకామ్18, స్టార్ ఇండియా వ్యాపారాలను విలీనం చేయడం ద్వారా జాయింట్ వెంచర్ నెలకొల్పేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ (దాని అనుబంధ సంస్థ) వయాకామ్ 18 మీడియా, వాల్ట్ డిస్నీ కంపెనీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. కోర్టు ఆమోదిత ప్రణాళికకు అనుగుణంగా స్టార్ ఇండియా (ఎస్ఐపీఎల్)లో వయాకామ్18 విలీనమవుతుంది' అని ఇరు సంస్థలు తెలిపాయి. భారతీయ వినోద పరిశ్రమలో ఇదొక మైలురాయిలాంటి ఒప్పందమని ముకేశ్ అంబానీ వ్యాఖ్యానించారు. 'అంతర్జాతీయంగా అత్యుత్తమ మీడియా గ్రూప్‌గా డిస్నీ అంటే మాకెంతో గౌరవం. డిస్నీతో జట్టు కట్టడం ద్వారా దేశవ్యాప్తంగా వీక్షకులకు అందుబాటు ధరల్లో అపరిమిత కంటెంట్‌ను అందించేందుకు వీలవుతుంది. రిలయన్స్ గ్రూప్‌లోకి డిస్నీకి స్వాగతం' అని పేర్కొన్నారు. మరోవైపు, 'ఈ జేవీతో కంపెనీకి దీర్ఘకాలంలో మరింత విలువ చేకూరుతుంది. వినియోగదారులకు విస్తృతమైన డిజిటల్ సర్వీసులు, వినోదం, స్పోర్ట్స్ కంటెంట్‌ను అందించగలుగుతాం' అని వాల్ట్ డిస్నీ సీఈవో బాబ్ ఐగర్ తెలిపారు.


మరిన్ని విశేషాలు..

- విలీన సంస్థకు అత్యధిక సంఖ్యలో ఓటీటీ సబ్‌స్క్రయిబర్స్, రెండు స్ట్రీమింగ్ సర్వీసులు, 120 పైచిలుకు టీవీ చానళ్లు (కలర్స్, స్టార్‌ప్లస్, స్టార్ గోల్డ్ లాంటివి) ఉంటాయి.
- జేవీకి 75 కోట్ల మంది వీక్షకులు ఉండనున్నారు. 30,000 పైచిలుకు డిస్నీ కంటెంట్ అసెట్స్‌కి లైసెన్సు లభిస్తుంది. అలాగే, భారత్‌లో డిస్నీ సినిమాల పంపిణీకి ప్రత్యేక హక్కులు లభిస్తాయి.
- ట్వెంటీఫస్ట్ సెంచరీ ఫాక్స్ అసెట్స్ కొనుగోలు ద్వారా 2020లో దేశీయంగా డిస్నీప్లస్‌హాట్‌స్టార్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తొలినాళ్లలో పెయిడ్ యూజర్ల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందినప్పటికీ ఆ తర్వాత జోరు తగ్గింది. కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో విస్తరించకపోవడంతో, సంక్లిష్టంగా మారిన తమ భారత విభాగాన్ని వీలైతే పూర్తిగా విక్రయించేందుకు లేదా ఇతర సంస్థలతో జట్టు కట్టి జేవీ ఏర్పాటు చేసేందుకు డిస్నీ కొన్నాళ్లుగా కసరత్తు చేస్తోంది.
- రిలయన్స్ మీడియా సంస్థ నెట్‌వర్క్ 18కి పలు న్యూస్, వినోద, స్పోర్ట్స్ చానల్స్ ఉన్నాయి. అలాగే మనీకంట్రోల్‌డాట్‌కామ్, బుక్‌మైషోలో వాటాలు ఉన్నాయి. రిలయన్స్‌కి జియో స్టూడియోస్ అనే సినీ నిర్మాణ సంస్థ ఉంది.

మార్కెట్ క్రాష్

- సెన్సెక్స్ 790 పాయింట్లు పతనం
- 22,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- అన్ని రంగాల్లోనూ అమ్మకాలు
- ఒకే రోజులో రూ.6 లక్షల కోట్ల నష్టం

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో బుధవారం బేర్ ప్రతాపం చూపింది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ (2%), బ్యాంకింగ్ రంగ షేర్ల పతనంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాలు ఇందుకు కారణమయ్యాయి. ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు, భారత జీడీపీ వృద్ధి డేటా వెల్లడి(గురువారం)కి ముందు ట్రేడర్లు అప్రమత్తత వహించారు.



అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించవచ్చనే అంచనాలతో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా ఆందోళనలు కొనసాగాయి. ఫలితంగా నిఫ్టీ కీలకమైన 22,000 స్థాయిని, సెన్సెక్స్ 73,000 స్థాయిలను కోల్పోయాయి. సెన్సెక్స్ ఒక శాతానికి పైగా నష్టపోవడంతో బీఎస్ఈలో రూ. 6 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.386 లక్షల కోట్లకు పడింది. ఫ్లాట్‌గా మొదలైన మార్కెట్, ఒకానొక దశలో సెన్సెక్స్ 873 పాయింట్లు క్షీణించి 72,222 వద్ద, నిఫ్టీ 282 పాయింట్లు దిగివచ్చి 21,916 వద్ద ఇంట్రాడే కనిష్టాలను దిగివచ్చాయి. చివరికి సెన్సెక్స్ 790 పాయింట్లు నష్టపోయి 72,305 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 247 పాయింట్ల నష్టంతో 21,951 వద్ద స్థిరపడ్డాయి.

జునిపర్ హోటల్స్ లిస్టింగ్ సక్సెస్

జునిపర్ హోటల్స్ ఇష్యూ ధర(రూ.360)తో పోలిస్తే బీఎస్ఈలో 0.33% ప్రీమియంతో రూ.361 వద్ద లిస్టయ్యింది. 10.36% ఎగసి రూ.397 స్థాయిని తాకి అప్పర్ సర్క్యూట్ వద్ద లాకైంది. మార్కెట్ విలువ రూ.8,840 కోట్లుగా నమోదైంది.

ఆర్‌కే స్వామి @ రూ. 270–288

మార్కెటింగ్ కమ్యూనికేషన్స్ కంపెనీ ఆర్‌కే స్వామి లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 270-288 ధరల శ్రేణిని ప్రకటించింది. మార్చి 4న ప్రారంభంకానుంది. తద్వారా దాదాపు రూ. 424 కోట్లు సమీకరించాలని భావిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
29-2-2024	
విశాఖ	500–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	460–00
విజయవాడ	460–00
రిటైల్ ధర (డజను)	72.00
28-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	460–00
వరంగల్	462–00
రిటైల్ ధర	5.20

సంపన్నుల సంఖ్య పైపైకి..



- 6 శాతం వృద్ధితో 13,263కు చేరిక
- 2028 నాటికి 20,000కు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా అంచనా

న్యూఢిల్లీ: దేశంలో సంపన్నులు మరింతగా విస్తరిస్తున్నారు. గతేడాది (2023) అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ/) సంఖ్య 6 శాతం పెరిగి 13,263కు చేరుకుంది. అంతేకాదు, 2028 నాటికి వీరి సంఖ్య 20,000కు పెరుగుతుందని నైట్‌ఫ్రాంక్ ఇండియా అంచనా వేసింది. 30 మిలియన్ డాలర్లు (రూ.250 కోట్లు), అంతకంటే ఎక్కువ నికర విలువ కలిగిన వ్యక్తులను యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ కింద నైట్‌ఫ్రాంక్ పరిగణనలోకి తీసుకుంది. 'ద వెల్త్ రిపోర్ట్ 2024' పేరుతో ఓ నివేదికను విడుదల చేసింది. 2022 చివరికి దేశంలో సంపన్నుల సంఖ్య 12,495గా ఉన్నట్టు తెలిపింది. 2028 నాటికి 19,908కి వీరి సంఖ్య పెరుగుతుందని అంచనా వేసింది. ''అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై భారత్ సంపద సృష్టి, అవకాశాలకు వేదికగా నిలుస్తోంది. సంపన్నుల జనాభా గణనీయంగా పెరగడం, వచ్చే ఐదేళ్లలో వీరి సంఖ్య మరో 50 శాతం వృద్ధి చెందడం దీనికి సూచిక''అని నైట్‌ఫ్రాంక్ ఇండియా చైర్మన్, ఎండీ శిశిర్ బైజాల్ పేర్కొన్నారు.

2024 సానుకూలం..

తమ సంపద 2024లో వృద్ధి చెందుతుందని 90 శాతం మంది సంపన్నులు అంచనా వేస్తున్నట్టు నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. మొత్తం మీద 63 శాతం మంది అయితే, తమ సంపద 10 శాతానికి పైగా పెరుగుతుందని భావిస్తున్నారు.

భారత్‌లో బిల్ గేట్స్..

- హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఐడీసీ సందర్శన

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ (ఐడీసీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజనీర్లను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కృత్రిమ మేధ సాంకేతికత విషయంలో భారత్‌కి గల అవకాశాలపై ఆయన అత్యంత ఆశాభావం వ్యక్తం చేసినట్లు మైక్రోసాఫ్ట్ ఐడీసీ ఎండీ రాజీవ్ కుమార్ తెలిపారు. గేట్స్ తాను 1998లో ఆకాంక్షించిన సెంటర్ ఆఫ్ ఇన్నోవేషన్‌ను ప్రస్తుతం సందర్శించడం ఎంతో ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొన్నారు. పరిశోధనలు, ఇంజనీరింగ్, డెవలప్‌మెంట్ కార్యకలాపాలకు సంబంధించి ఐడీసీ.. 25 ఏళ్లు పూర్తి చేసుకుంది.



బిల్ గేట్స్, రాజీవ్ కుమార్

మల్టీప్లెక్స్‌ల ఆదాయం వీక్

2024–25లో వృద్ధి 15 శాతమే: క్రిసిల్



ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25)లో వినోద రంగం(మల్టీప్లెక్స్) వృద్ధి మందగించవచ్చని రేటింగ్ దిగ్గజం క్రిసిల్ పేర్కొంది. వెరసి ఈ ఏడాది (2023–24)తో పోలిస్తే మల్టీప్లెక్స్‌ల ఆదాయం 10–15% మాత్రమే పురోగమిస్తుందని అంచనా వేసింది. లాభాల మార్జిన్లు మాత్రం నామమాత్రంగా బలపడే వీలున్నట్లు తెలియజేసింది. అయితే కరోనా ముందు స్థాయితో పోలిస్తే ఇవి తక్కువగానే నమోదుకానున్నట్లు తెలియజేసింది. ఇందుకు అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, డిస్నీహాట్‌స్టార్ తదితర ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ కారణంకానున్నట్లు వెల్లడించింది. వచ్చే ఏడాది మల్టీప్లెక్స్ రంగం ఆదాయం 10–15% పుంజుకుని రూ. 7,300 కోట్లకు చేరవచ్చని ఊహిస్తోంది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం రసాయన శాస్త్రం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 50 క్రెడిట్ అనలిస్ట్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. రెగ్యులర్ ప్రాతిపదికన క్రెడిట్ అనలిస్ట్(మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్3) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
- » **అర్హత:** డిగ్రీ, ఎంబీఏ(ఫైనాన్స్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/ఎంఎంఎస్(ఫైనాన్స్)/సీఏ/సీఎఫ్ఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.63,840 నుంచి రూ.78,230
- » **ఎంపిక విధానం:** దరఖాస్తు షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.03.2024.
- » **వెబ్‌సైట్:** www.sbi.co.in

ఇండియన్ నేవీలో 254 షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టులు

ఇండియన్ నేవీ ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2025 జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సుల వారీగా ఖాళీలు:** జనరల్ సర్వీస్–50, పైలట్–20, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్ –18, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్–08, లాజిస్టిక్స్ –30, నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టర్ కేడర్(ఎన్ఏఐసీ)–10, ఎడ్యుకేషన్–18, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)–30, ఎలక్ట్రికల్ బ్రాంచ్ (జనరల్ సర్వీస్)–50, నావల్ కన్‌స్ట్రక్టర్–20.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ,పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100+ ఇతర అలవెన్సులు.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.03.2024.
- » **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in.

తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలు

తెలంగాణ సోషల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక పాఠశాల(బాలురు), రుక్మాపూర్, కరీంనగర్ జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన బాలుర నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం సీట్ల సంఖ్య:** 80
- » **అర్హత:** 2023–24 విద్యా సంవత్సరంలో ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ఐదో తరగతిలో పరీక్షకు హాజరైన/ఉత్తీర్ణులైన బాలురు మాత్రమే అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000(పట్టణ ప్రాంతం), రూ.1,50,000 (గ్రామీణ ప్రాంతం) మించకూడదు. తెలుగు/ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు అర్హులు. విద్యార్థులు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » **వయసు:** 01.04.2004 నాటికి 11 ఏళ్లు మించకూడదు. 01.04.2013 నుంచి 31.03.2015 మధ్య జన్మించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** మూడంచెల్లో ఉంటుంది. స్టేజ్ -1(స్టేట్ లెవల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్–100 మార్కులు), స్టేజ్–2(స్క్రీనింగ్ టెస్ట్‌లు–150 మార్కులు). ఇందులో ఫిజికల్, సైనిక్ స్కూల్ ఆప్టిట్యూడ్(రాత–డిస్క్రిప్టివ్), కమ్యూనికేషన్ స్కిల్ టెస్ట్‌లు ఉంటాయి. వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.03.2024.
- » **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ తేది:** 06.03.2024.
- » **ప్రవేశ పరీక్ష తేది:** 10.03.2024.
- » **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ తేదీలు:** 22.03.2024, 23.03.2024, 26.03.2024, 27.03.2024, 28.03.2024.
- » **వెబ్‌సైట్:** www.tswrsplschools.cgg.gov.in

ఏపీఎండీసీ, విజయవాడలో వివిధ పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ).. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ(సర్వే)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
- » **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(సర్వే) (మెటాలిఫరస్)–03, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సర్వే) (కోల్)–03.
- » **అర్హత:** డిగ్రీ/డిప్లొమా(మైనింగ్/మైన్ సర్వే) లేదా డిగ్రీ(సైన్స్), మైన్ సర్వేయర్స్ సర్టిఫికేట్ ఆఫ్ కాంపిటెన్సీ కలిగి ఉండాలి.
- » **వయసు:** 31.01.2024 నాటికి 18 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **పే స్కేల్:** రూ.40,970 నుంచి రూ.1,24,380.
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.03.2024.
- » **వెబ్‌సైట్:** www.apmdc.ap.gov.in.

రివిజన్‌తోనే.. నీట్‌లో జయం!

» నీట్–2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» మే 5న దేశ వ్యాప్తంగా పరీక్ష నిర్వహణ
» సిలబస్‌లో పలు మార్పులు

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-యూజీ.. సంక్షిప్తంగా నీట్-యూజీ! దేశంలో ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య కోర్సుల్లో చేరాలని కలలు కనే విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసే పరీక్ష!! నీట్ యూజీకి ప్రిపరేషన్ సాగిస్తున్న అభ్యర్థులు..తమ సన్నద్ధతకు మరింత పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. నీట్ యూజీ 2024 నోటిఫికేషన్ వెలువడటమే! ఈ నేపథ్యంలో.. నీట్ యూజీ-2024 పరీక్ష వివరాలు, సిలబస్ మార్పులు, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..



నీట్ యూజీ-2024

ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో కొత్త సిలబస్

నీట్ యూజీ కొత్త సిలబస్‌ను ఎన్‌టీఏ, నేషనల్ మెడికల్ కమిషన్ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచారు. తాజా సిలబస్‌ను పరిశీలిస్తే.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీల నుంచి మొత్తం 18 చాప్టర్లను తొలగించారు. అదే విధంగా.. కొన్ని అంశాలను జోడించారు. విద్యార్థులు ఈ మార్పులను గుర్తించి.. మారిన సిలబస్‌కు అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ర్యాంకుల నిర్ధారణలోనూ మార్పులు

ఎన్‌టీఏ.. నీట్–యూజీ ర్యాంకుల నిర్ధారణ విధానంలోనూ ఈ ఏడాది మార్పులు చేసింది. ముఖ్యంగా ఇద్దరు అభ్యర్థులకు ఒకే స్కోర్ వచ్చిన సందర్భంలో ఆ ఇద్దరిలో టాపర్‌ను గుర్తించడానికి అనుసరించే ఫార్ములాలో మార్పులు చేసింది. మొదట బయాలజీలో ఎక్కువ మార్కులు పొందిన వారిని టాపర్‌గా గుర్తిస్తారు. ఇక్కడ కూడా టై ఏర్పడితే.. తర్వాత వరుసగా కెమిస్ట్రీలో, అనంతరం ఫిజిక్స్‌లో ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థిని గుర్తించి.. ఇద్దరిలో ఒకరికి టాప్ స్కోర్ ఇస్తారు.

మే 5న పరీక్ష

నీట్ యూజీ పరీక్షను మే 5న నిర్వహించనున్నారు. అంటే..ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాక.. నీట్ పరీక్ష తేదీకి నెల రోజులకు పైగా సమయం అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో విద్యార్థులు పూర్తిగా నీట్ ప్రిపరేషన్‌కు కేటాయించాలి. ఈ ఏడాది నీట్ నిర్వహణకు పరీక్ష కేంద్రాలను కూడా పెంచారు. గత ఏడాది 499 సెంటర్లలోనే పరీక్ష నిర్వహించగా.. ఈ సంవత్సరం ఆ సంఖ్యను 554కు పెంచారు. దీనివల్ల విద్యార్థులకు సమీప ప్రాంతాల్లోనే పరీక్ష కేంద్రాల కేటాయింపునకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

పరీక్ష స్వరూపం

నీట్–యూజీ పరీక్షను నాలుగు సబ్జెక్ట్‌లలో మొత్తం 720 మార్కులకు నిర్వహిస్తారు. ఫిజిక్స్‌లో.. సెక్షన్ ఏ 35 ప్రశ్నలు–140 మార్కులు, సెక్షన్ బీ 15 ప్రశ్నలు–40 మార్కులు; కెమిస్ట్రీలో.. సెక్షన్ ఏ 35 ప్రశ్నలు–140 మార్కులు, సెక్షన్ బీ 15 ప్రశ్నలు–40 మార్కులు; బోటనీలో.. సెక్షన్ ఏ 35 ప్రశ్నలు–140 మార్కులు, సెక్షన్ బీ 15 ప్రశ్నలు–40 మార్కులు; జువాలజీలో.. సెక్షన్ ఏ 35 ప్రశ్నలు –140 మార్కులు, సెక్షన్ బీ 15 ప్రశ్నలు–40 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. పెన్ పేపర్ విధానంలో ఓఎంఆర్ షీట్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ప్రతి సబ్జెక్ట్‌లోనూ సెక్షన్–బిలోని 15 ప్రశ్నలకు గాను పది ప్రశ్నలకు సమాధానాలిస్తే సరిపోతుంది. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం మూడు గంటల ఇరవై నిమిషాలు.

ప్రతి సబ్జెక్ట్‌లో 130 టార్గెట్

నీట్‌లో మంచి స్కోర్ సాధించి.. మెడికల్ సీటు సొంతం చేసుకునేందుకు విద్యార్థులు.. ప్రతి సబ్జెక్ట్‌లోనూ 180 మార్కులకు గాను కనీసం 130 మార్కులు సాధించేలా కృషి చేయాలి. మొత్తంగా 720 మార్కులకు గాను 450 మార్కుల నుంచి 500 మార్కులు స్కోర్ చేసేలా ప్రిపరేషన్ సాగిస్తే..డాక్టర్ కల సాకారం చేసుకోవచ్చు.

రివిజన్‌కు ప్రాధాన్యం

నీట్‌కు ప్రిపరేషన్ సాగిస్తున్న అభ్యర్థులు రివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంటర్మీడియెట్ బోర్డ్ పరీక్షలు పూర్తయిన తర్వాత వీలైనంత మేరకు రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి. ప్రతి సబ్జెక్టుకూ సమానంగా సమయం కేటాయించుకోవాలి. ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి.

షార్ట్ నోట్స్ కీలకం

ప్రిపరేషన్ సమయంలోనే విద్యార్థులు షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ఈ షార్ట్ నోట్స్‌లో.. కీలక భావనలు, కాన్సెప్ట్‌లు, ఫార్ములాలు ఉండేలా చూసుకుంటే.. వేగంగా పునశ్చరణ చేసుకోవడానికి వీలవుతుంది. అదేవిధంగా ఆయా అంశాలకు సంబంధించి ప్రశ్నలు చదువుతున్నప్పుడు వెంటనే రెడీ రెకనర్‌గా షార్ట్ నోట్స్‌ను వినియోగించుకోవచ్చు.

మాక్ టెస్ట్‌లు

అభ్యర్థులకు ఉపకరించే మరో వ్యూహం..మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం. ప్రతి రోజు మోడల్ టెస్ట్‌లు రాయడం, అదే విధంగా వారానికి ఒక మాక్ టెస్ట్‌కు హాజరు కావడం వంటి వ్యూహాలు అనుసరించాలి. ఫలితంగా.. డైరెక్ట్ కొశ్చన్స్ ఎక్కువగా అడుగుతున్న నీట్‌లో మంచి స్కోర్ సాధించే ఆస్కారం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మార్చి 9
- నీట్ తేదీ: 2024, మే 5 (మధ్యాహ్నం 2 గంటల నుంచి 5:20 వరకు)
- ఫలితాల వెల్లడి: 2024, జూన్ 14
- వెబ్‌సైట్: https://neet.ntaonline.in/, https://exams.nta.ac.in/NEET

సబ్జెక్ట్ వారీగా ప్రిపరేషన్ ఇలా

ప్రాక్టీస్‌తో ఫిజిక్స్‌లో స్కోర్

నీట్ అభ్యర్థులు ఫిజిక్స్ విషయంలో ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అధ్యాయానికి చివర ఇచ్చిన ప్రశ్నలను సాధించాలి. అవకలనం, సమాకలనం అనువర్తనాలపై పట్టు సాధించాలి. ఇంటర్ రెండేళ్ల పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. రొటేషనల్ డైనమిక్స్, సిగ్మా పార్టికల్స్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి. అదేవిధంగా ఎలక్ట్రోమ్యాగ్నటిజం, ఇండక్షన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ వంటి చాప్టర్లను చదవడంతోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

కెమిస్ట్రీ.. కాన్సెప్ట్స్, రివిజన్

నీట్‌లో విద్యార్థులు సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఇందులో స్కోర్ కోసం.. కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయోమాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేస్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీలకు కొంత వెయిటేజీ ఎక్కువగా ఉంటుంది. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలను మర్చిపోతుంటారు. కాబట్టి నిరంతరం పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి.

బోటనీ

బోటనీకి సంబంధించి ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్, సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్‌లను ముఖ్య చాప్టర్లుగా భావించి చదవాలి. అన్ని అంశాలకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాప్యులేషన్, ఎకోసిస్టమ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్ పాఠ్యాంశాలపై ఫోకస్ చేయడం లాభిస్తుంది. ప్లాంట్ ఫిజియాలజీలో ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోనులు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్‌లో కణ విభజన (సమవిభజన, క్షయకరణ విభజన)లోని వివిధ దశల్లో జరిగే మార్పులు, కణ చక్రం తదితరాలను అధ్యయనం చేయాలి. బయోమాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీ ప్రొడక్షన్ నుంచి దాదాపు 10 ప్రశ్నల వరకు అడుగుతున్నారు. మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటన్స్‌లో రెప్లికేషన్, ట్రాన్స్‌క్రిప్షన్, ట్రాన్స్‌లేషన్, రెగ్యులేషన్‌లపై దృష్టిపెట్టాలి.

జువాలజీ

జువాలజీ సబ్జెక్ట్‌లో రాణించేందుకు విద్యార్థులు హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, జెనెటిక్స్, ఎవల్యూషన్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీతో పాటు ఇంటర్ పుస్తకాల నుంచీ ప్రశ్నలు అడుగుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రశ్న పత్రాలను, ఇంటర్‌లో ఆయా చాప్టర్స్ చివరలో అడిగే ప్రశ్నలను సాధన చేయాలి. అదేవిధంగా.. ఎన్‌సీఈఆర్‌టీ, ఇంటర్ పుస్తకాలను క్షుణ్నంగా చదివితే ఉపయుక్తంగా ఉంటుంది.

క్లుప్తంగా...

పలువురు ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న రాహుల్‌రాజ్‌ను మెదక్ జిల్లా కలెక్టర్‌గా, మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవ్ రావ్‌ను జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా నియమించారు. ఆ స్థానంలో ఉన్న స్నేహా శబరీష్‌ను ఆసిఫాబాద్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. నల్లగొండ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) హేమంత కేశవ్‌పాటిల్‌ను హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

40 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 40 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల (ఎస్‌జీడీసీ)ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేయడంతోపాటు మరో 24 మందికి రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవో)గా నియమించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఆరుగురు అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న పర్సా రాంబాబును జగిత్యాల అదనపు కలెక్టర్‌గా, సూర్యాపేట అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డిని హన్మకొండ అదనపు కలెక్టర్‌గా, జగిత్యాల అదనపు కలెక్టర్ బి.ఎస్.లతను సూర్యాపేట అదనపు కలెక్టర్‌గా, హన్మకొండ అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీని ములుగు అదనపు కలెక్టర్‌గా, యాదాద్రి అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డిని హెచ్‌ఎండీఎంకు బదిలీ చేశారు. ములుగు అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమించారు.

నేడు 'హార్టికల్చర్' అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: ఉద్యానవనశాఖ పరిధిలో హార్టికల్చర్ ఆఫీసర్(హెచ్‌ఓ) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితా టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఆయా అభ్యర్థులకు ఈ నెల 29న (గురువారం) టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఉంటుందని వెల్లడించింది. ప్రాథమిక జాబితాకు ఎంపికైన అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ నుంచి చెక్‌లిస్టును డౌన్‌లోడ్ చేసుకుని అందులో పేర్కొన్న ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్సు ప్రతులతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని కమిషన్ సూచించింది.

రాజారెడ్డి, రాధా రెడ్డిలకు 'అకాడమీ రత్న' అవార్డు

- శ్వేతాప్రసాద్‌కు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం


రాజారెడ్డి, రాధారెడ్డి


శ్వేతాప్రసాద్

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కూచిపూడి కళాకారులు రాజా, రాధారెడ్డి దంపతులకు నాటక రంగంలో ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ రత్న'పురస్కారం ప్రకటించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ సంగీత నాటక అకాడమీ బుధవారం ఈ అవార్డులను ప్రకటించింది. రాజా, రాధారెడ్డితోపాటు వినాయక్ ఖేడేకర్, ఆర్.విశ్వేశ్వరన్, సునయన హజారీలాల్, దులాల్ రాయ్, డీపీ సిన్హాలకు అకాడమీ రత్న అవార్డులు వరించాయి. 2022, 2023 సంవత్సరాలకు మరో 92 మందికి 'అకాడమీ పురస్కార్', 80 మంది యువ కళాకారులకు 'ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్'లను ప్రకటించారు. తెలంగాణకు చెందిన ప్రముఖ సంగీత కళాకారిణి శ్వేతా ప్రసాద్‌కు ప్రతిష్టాత్మకమైన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం లభించింది. ప్రముఖ దివంగత సినీ నటుడు 'రక్తకన్నీరు' నాగభూషణం మనవరాలైన శ్వేతాప్రసాద్ నాలుగేళ్ల ప్రాయం నుంచి సంగీతాన్ని సాధన చేశారు. ఆమె ప్రపంచవ్యాప్తంగా మూడు దశాబ్దాలుగా రెండు వేలకుపైగా గాత్ర ప్రదర్శలను నిర్వ హించారు. అకాడమీ రత్న అవార్డు గ్రహీతలకు రూ.3 లక్షలతోపాటు తామ్రపత్రం, అంగవస్త్రాన్ని అందజేస్తారు.

'హజ్‌యాత్ర' రెండో విడత డబ్బులు జమచేయండి

సాక్షి,హైదరాబాద్: తెలంగాణ నుంచి 2024 హజ్ యాత్రకు ఎంపికై న వారు ప్రయాణ ఖర్చుల నిమిత్తం చెల్లించే రెండవ విడత డబ్బుల్ని మార్చి 10వ తేదీ నాటికి చెల్లించాలని రాష్ట్ర హజ్ కమిటీ సూచించింది. రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి షేక్ లియాకత్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ..హజ్ యాత్రకు ఎంపికై న వారు ఇప్పటికే తొలివిడతగా రూ.82,800 చెల్లించారని, రెండవ విడతగా రూ.లక్షా 70 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇక మిగతా ఖర్చులు ఎప్పుడు చెల్లించాలనేది కేంద్ర హజ్ కమిటీ ప్రకటిస్తుందన్నారు.

చందాదారుల ఆస్తులు కొల్లగొడుతున్న

గజదొంగ రామోజీ

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ బందిపోటు సంస్థ

- పేదలు, మధ్యతరగతి వర్గాలను వేధిస్తోంది
- కాల్‌మనీ రాకెట్‌లా ఇళ్లపైకి దాడులు చేస్తోంది
- చిట్టీల ఉచ్చులో బిగించి ఆస్తులు గుంజుకుంటోంది
- ప్రైజ్‌మనీ ఇవ్వకుండా రశీదు డిపాజిట్లుగా అట్టిపెట్టుకుంటోంది
- గట్టిగా అడిగితే లక్షల్లో చిట్టీలు కడితే వందలు చేతిలో పెడుతోంది
- రామోజీ అక్రమాలకు వ్యతిరేకంగా సమష్టి పోరాటం
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం స్పష్టీకరణ
- విజయవాడలో బాధితుల సమావేశం.. పెద్ద ఎత్తున తరలివచ్చిన చందాదారులు
- తామెలా మోసపోయామో వివరించిన బాధితులు


విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మార్గదర్శి బాధితులతో కలిసి వారి సమస్యలను తెలియజేస్తున్న అడ్వొకేట్ శ్రీనివాస్

సాక్షి, అమరావతి: 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ బందిపోటు సంస్థ. పేదలు, మధ్య తరగతివర్గాల ఆస్తులు కొల్లగొడుతున్న గజదొంగ రామోజీరావు' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం ధ్వజమెత్తింది. 'ష్యూరిటీలు ఇచ్చినా కొర్రీలు వేస్తోంది. చిట్టీల ఉచ్చులో బిగించి మా ఆస్తులు కొల్లగొడుతోంది. ప్రైజ్‌మనీ ఇవ్వకుండా మా అనుమతి లేకుండానే రశీదు డిపాజిట్లుగా అట్టిపెట్టుకుంటోంది. గట్టిగా అడిగితే లక్షల్లో చిట్టీలు కడితే వందలు చేతిలో పెడుతోంది' అని దుయ్యబట్టింది. 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను ఇక సహించేది లేదు. సంఘటితంగా పోరాడతాం. సీఐడీ దర్యాప్తునకు సహకరిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటాం. రామోజీరావు అక్రమాలపై ఉమ్మడిగా న్యాయ పోరాటం చేస్తాం' అని స్పష్టం చేసింది.

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలకు వ్యతిరేకంగా బాధితులు బుధవారం విజయవాడలో సంఘటితమయ్యారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో చందాదారులు తరలివచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చిట్టీ కట్టి మోసపోయిన విధానం, తాము పడుతున్న ఇబ్బందులు, పోగొట్టుకున్న ఆస్తులను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ 'పేదలు, మధ్యతరగతివర్గాల ఆదాయ వనరులను పరిగణనలోకి తీసుకోకుండా తలకు మించి చిట్టీలు కట్టిస్తూ రామోజీరావు వారిని చిట్టీల ఊబిలోకి నెట్టివేసి, వారి ఆస్తులు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం ష్యూరిటీలు సమర్పించినవారికి కూడా చిట్టీ ప్రైజ్‌మనీ ఇవ్వకుండా అక్రమ డిపాజిట్లుగా మళ్లిస్తున్నారన్నారు. రామోజీరావు అక్రమాలతో సామాన్యులు ఆస్తులు కూడా అమ్ముకుంటున్నారని, అయినా అప్పులు తీరక మానసిక క్షోభ అనుభవిస్తున్నారని తెలిపారు. విజయవాడలో ఓ ట్యాక్సీ డ్రైవర్‌తో రూ.20 లక్షల చిట్టీ కట్టించి వేధిస్తున్నారన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ గూండాలు ఇంటిపైకి వచ్చి వేధింపులకు గురిచేయడంతో కర్నూలులో ఒకరు తీవ్ర మానసిక క్షోభతో పక్షవాతం బారిన పడ్డారని తెలిపారు. రామోజీరావు ఉద్దేశపూర్వకంగానే పేద, మధ్య తరగతి వర్గాల వారిని ఒక చిట్టీతో మొదలుపెట్టి అయిదు..., పది..., ఇరవై వరకు చిట్టీల్లో సభ్యులుగా చేర్పించి వారు అప్పులు, వాయిదాల ఉచ్చు నుంచి బయటకు రాలేని దుస్థితి కల్పిస్తున్నారని వివరించారు. ఒక చిట్టీ ప్రైజ్‌మనీని మరో చిట్టీలోకి సర్దుబాటు చేస్తూ చందాదారులకు చేతికి మాత్రం చిల్లిగవ్వ ఇవ్వడంలేదని తెలిపారు.

'మార్గదర్శి'పై కఠిన చర్యలు తీసుకోండి

హోం శాఖ, సీఐడీకి బాధితుల విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: చందాదారులను మోసగిస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ సంస్థ మోసాలకు అడ్డుకట్ట వేసి చందాదారులకు న్యాయం చేయాలని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల ప్రైజ్‌మనీని, ఆస్తులను కొల్లగొడుతున్న రామోజీరావుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వి.సాంబశివరావు, కార్యదర్శి వి.అన్నపూర్ణమ్మ, ఇతర ప్రతినిధులు హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా, సీఐడీ అదనపు డీజీ సంజయ్‌కు బుధవారం విడివిడిగా వినతిపత్రాలు సమర్పించారు. ష్యూరిటీలు సమర్పించినా చందాదారులను ఇబ్బంది పెడుతున్నారని, ఇళ్లపై పడి దాడులు చేస్తున్నారని వారు వివరించారు. చందాదారుల సొమ్మును రామోజీరావు సొంత వ్యాపారాల్లో పెట్టుబడులుగా మళ్లిస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టంలోని సెక్షన్లు 22, 64 ప్రకారం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కఠిన చర్యలు తీసుకుని చందాదారులకు అండగా నిలవాలని కోరారు.

చందాదారులందరినీ సంఘటితం చేసేందుకే ఈ సంఘం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు కొన్ని వేల మంది ఉన్నారని, వారందరినీ సంఘటితం చేసేందుకు ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామని శ్రీనివాస్ చెప్పారు. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టంలోని సెక్షన్ 22, 66 ప్రకారం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాధితులకు న్యాయం చేసేందుకు సమష్టిగా పోరాడతామన్నారు. అందుకు సీఐడీ, రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తున్నాయని చెప్పారు.

రాష్ట్రంలో పెరిగిన ఉష్ణోగ్రతలు

- ఖమ్మంలో అధికంగా 36.4 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రత నమోదు
- వాతావరణ శాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. వారం రోజులుగా సాధారణం కంటే తక్కువగా నమోదైన ఉష్ణోగ్రతలు ఇప్పుడు 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదవుతున్నాయి. బుధవారం గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 36.4 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత హకీంపేట్‌లో 18.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. చాలాచోట్ల గరిష్ట కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఖమ్మంలో సాధారణం కంటే 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు కాగా...ఆదిలాబాద్‌లో 2 డిగ్రీల సెల్సియస్, మిగతాచోట్ల ఒక డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదయ్యాయి. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. వాతావరణంలో నెలకొంటున్న మార్పులతో ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఉంటుందని, తేమ శాతం తగ్గడంతో ఉక్కపోత కూడా పెరుగుతుందని వాతావరణ శాఖ వివరించింది.

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	36.4	21.8
ఆదిలాబాద్	36.3	19.2
భద్రాచలం	36.2	21.5
నిజామాబాద్	36.2	21.6
రామగుండం	36.0	20.4
మహబూబ్‌నగర్	35.6	22.1
మెదక్	34.8	18.8
హనుమకొండ	34.5	20.5
నల్లగొండ	34.5	23.4
హైదరాబాద్	33.6	21.4
దుండిగల్	33.3	20.3
హకీంపేట్	33.2	18.3

51 ఏళ్ల అర్హతను పరిశీలించండి

గ్రూప్–1 గరిష్ట వయోపరిమితి సడలింపుపై హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పోస్టుల రిక్రూట్‌మెంట్ కోసం గరిష్ట వయోపరిమితిని 46 ఏళ్ల నుంచి 51 ఏళ్లకు సడలించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని హైకోర్టు ఆదేశించింది. చాలా ఏళ్ల తర్వాత భర్తీ చేస్తున్న గ్రూప్–1 పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం 46 ఏళ్లను అర్హతగా పేర్కొందని, దీనిని 51 ఏళ్ల వరకు పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన నిరుద్యోగి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అంశంపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదని, దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించామని చెప్పారు. గరిష్ట వయసు సడలింపు ఇస్తూ నోటిఫికేషన్‌లో మార్పు చేసేలా టీఎస్‌పీఎస్సీని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఫణిభూషణ్ వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నోటిఫికేషన్ల జారీలో చాలా జాప్యం జరిగిందన్నారు. దీంతో అనేక మంది గ్రూప్–1 పరీక్షలకు అర్హత కోల్పోయారని వివరించారు. ఈ దృష్ట్యా గరిష్ట వయోపరిమితిని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ అంశంలో మెరిట్ జోలికి వెళ్లడంలేదని, ఫిబ్రవరి 2న పిటిషనర్లు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. 4 వారాల్లో దీనిపై నిర్ణయాన్ని తెలియజేయాలని స్పష్టం చేశారు.

ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90% రాయితీ

ఆస్తి పన్ను చెల్లింపునకు మరో నెలరోజులే గడువు

- 2022–23 ఏడాదికి ఆస్తిపన్ను పూర్తిగా చెల్లించే వారికి మాత్రమే వర్తింపు
- పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సహా అన్ని మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఆస్తిపన్ను బకాయిలపై విధించే వడ్డీపై 90% రాయితీ కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆర్థిక ఏడాదికి ఆస్తిపన్ను చెల్లింపునకు మరో నెలరోజులు మాత్రమే వ్యవధి ఉన్న నేపథ్యంలో ప్రజలకు వెసులుబాటు కలిస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022–23 సంవత్సరం వరకు ఆస్తిపన్ను పూర్తిగా చెల్లించే వారికి మాత్రమే ఈ వడ్డీ రాయితీ అమలు అవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాత బకాయిలపై కేవలం పది శాతం వడ్డీ ఒకేసారి చెల్లించేలా వన్ టైమ్ స్కీమ్(ఓటీఎస్) తీసుకొచ్చినట్లు తెలిపారు. 2023 మార్చి నాటికి ఆస్తిపన్ను, వడ్డీ, జరిమానాలు చెల్లించిన వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని, వారు చెల్లించిన 90 శాతం వడ్డీ మొత్తాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నులో రాయితీ కల్పించనున్నట్లు వివరించారు.

హెచ్‌ఎండీఏ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

భవన నిర్మాణ అనుమతుల్లో అవకతవకల గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పరిధిలోని భవన నిర్మాణాల అనుమతుల్లో అవకతవకలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టి పెట్టింది. వందల కోట్లు అక్ర మంగా ఆర్జించిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ (ప్రణాళిక) ఏసీబీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూ లం నేపథ్యంలోనే విజిలెన్స్ అధికారులు బుధ వారం అమీర్‌పేట్‌లోని మైత్రీవనంలో ఉన్న హెచ్ ఎండీఏ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఈ సోదాలు కొనసాగించారు. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో అనేక అనుమతులు మంజూరు చేసినట్లు, అలాంటి అనుమతులకు సంబంధించిన ఫైళ్లు మాయం అయినట్లు ప్రభుత్వానికి అందిన సమాచారం మేరకు విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలోనే ఈ సోదాలు జరిపి నట్లు సమాచారం. ప్రధానంగా రికార్డ్ సెక్షన్‌లో మ్యాన్యువల్ ఫైల్స్ కోసం తనిఖీలు చేశారు. గత ప్రభుత్వ కాలంలో అనుమతులు పొందిన బహుళ అంతస్తుల భవనాలు, రియల్ ఎస్టేట్ వెంచర్స్ గు రించి ఆరా తీశారు. డైరెక్టర్‌గా శివబాలకృష్ణ అను మతులు ఇచ్చిన ప్రాజెక్టులకు సంబంధించిన రికా ర్డులను తనిఖీ చేశారు. భూ వినియోగ మార్పిడి ఫైళ్లను విజిలెన్స్ అధికారులు సేకరించారు. డైరెక్ట ర్లు, ప్లానింగ్ అధికారులు కలిసి నిబంధనలకు విరు ద్ధంగా అనుమతులు ఇచ్చినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాలు విడుదల

- టీఆర్‌ఈఐఆర్‌బీ వెబ్‌సైట్లో ఎంపికైన అభ్యర్థుల జాబితా
- నేడు జూనియర్ లెక్చరర్ ఫలితాలు కూడా!

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లో డిగ్రీ లెక్చరర్(డీఎల్) ఉద్యోగాల భర్తీకి సంబంధించి తుది ఫలితాలను తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) విడుదల చేసింది. 22 సబ్జెక్టులకు 700 ఉద్యోగాలకు ఎంపికై న అభ్యర్థుల జాబితాను టీఆర్‌ఈఐఆర్‌బీ బుధవారం రాత్రి బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఎంపికైన అభ్యర్థులకు సమాచారం అందించేలా బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక జూనియర్ కాలేజీల్లో 1,924 ఉద్యోగాలకు సంబంధించిన ఎంపిక ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చింది. గురువారం సాయంత్రానికల్లా జేఎల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను బోర్డు విడుదల చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కాగా, మెడికల్ బోర్డు నుంచి అభ్యర్థులు డిజేబిలిటీ ధ్రువీకరణకు అంశం పెండింగ్‌లో ఉండటంతో పర్సన్ విత్ డిజేబుల్ కేటగిరీలో కొన్ని ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థులను ఇంకా ఖరారు చేయనట్లు సమాచారం.

మాతృభాష మన సంస్కృతిని కాపాడుతుంది

- గవర్నర్ తమిళి సై

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): మాతృభాష మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చెప్పారు. రవీంద్రభారతిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగు మాట్లాడే ప్రజలు దేశ, విదేశాలలో మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారని ప్రశంసించారు. తెలుగు భాష సంస్కృతి అందరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు. మాతృభాష సోదర భావాన్ని పెంపొందించేలా.. చిన్న చిన్న పుస్తకాలను ముద్రించాలని విశ్వవిద్యాలయం అధికారులకు సూచించారు. అనంతరం 1189 మందికి డిగ్రీలు, 78 మందికి ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలను, 30 మంది విద్యార్థులకు స్వర్ణ పతకాలను అందజేశారు. 31 మంది సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. శిల్పం–చిత్రలేఖనం శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుపు వెంకటేశానికి గవర్నర్ తమిళిసై పీహెచ్‌డీ పట్టా అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత కళాకృష్ణ, వైస్ చాన్స్‌లర్ ఆచార్య టి.కిషన్‌రావు, రిజిస్ట్రార్ బట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై

చర్చిల ఆస్తులకు రక్షణ కల్పిస్తాం: రేవంత్


సీఎంను సత్కరిస్తున్న క్రైస్తవ సంఘ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చర్చిల ఆస్తులకు రక్షణ కల్పిస్తామని, కొత్త చర్చిల నిర్మాణానికి అనుమతులు సులభతరం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం సచివాలయంలో మెదక్ డయాసిస్ బిషప్ పద్మారావు, రెవరెండ్ జాన్ జార్జ్, డా. ఏఎంజే కుమార్, శ్యామ్ అబ్రహం, అనిల్ థామస్‌తో పాటు వివిధ చర్చిలకు చెందిన క్రైస్తవ సంఘాలు, స్వతంత్ర ఇండిపెండెంట్ చర్చిల ప్రతినిధులు సీఎంను కలిశారు. మెదక్ చర్చిని సందర్శించాలని చర్చి ప్రతినిధులు కోరగా అందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశా రు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల కిందట కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడ్డాక భయానక పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆరోపించారు. గతంలో అల్లర్లు, ఘర్షణలు జరిగితే పాలకులు అణిచివేసే వారని, కానీ పాలకులే ఘర్షణలకు కారణమవుతున్నారని మణిపూర్, గుజరాత్ ఘటనలను ఆయన ఉదహరించారు. రాహుల్ గాంధీ కావాలనుకుంటే ప్రధానమంత్రి అయ్యేవారని, కానీ ఏనాడూ ఆయన పదవిని ప్రేమించలేదని రేవంత్ స్పష్టం చేశారు.

పక్కా నిఘా..పటిష్ట బందోబస్తు

- తొలి రోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం
- ద్వితీయ భాష పేపర్–1 రాసిన 4,88,113 మంది
- మూడుచోట్ల మాల్ ప్రాక్టీస్ కేసులు



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 5,07,754 మంది విద్యార్థులు పరీక్ష కోసం దరఖాస్తు చేశారు. వీరిలో 4,88,113 మంది హాజరయ్యారు. 19,641 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. మూడుచోట్ల మాల్ ప్రాక్టీసింగ్ జరిగినట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది. కరీంనగర్, నిజామాబాద్, జనగాం జిల్లాల్లో ఈ మేరకు కేసులు నమోదైనట్లు తెలిపింది. తొలి రోజు ద్వితీయ భాష పేపర్–1 పరీక్ష నిర్వహించారు. మూడు సెట్ల ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు పంపి అందులో 'ఎ'సెట్‌ను ఎంపిక చేశారు.

ప్రైవేటుపై ప్రత్యేక నిఘా

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని 1,521 పరీక్షా కేంద్రాల్లో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశా రు. 880 ప్రైవేటు కాలేజీల్లో కట్టుదిట్టమైన నిఘా ఉంచారు. కార్పొరేట్ కాలేజీల జోక్యంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈసారి మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ విధించారు. పేపర్ లీకేజీలకు ఆస్కారం లేకుండా, అసాంఘిక శక్తుల ప్రవేశాన్ని నిరోధించేందుకు ఈసారి పోలీసు బందోబస్తు పెంచారు. 75 ఫ్లయింగ్ స్క్వాడ్లు సుడిగాలి తనిఖీలు చేపట్టాయి. 200 సిట్టింగ్ స్క్వాడ్స్ సమస్యాత్మక కేంద్రాల్లో సజావుగా పరీక్షలు జరిగేందుకు తోడ్పడ్డాయి.

టెన్షన్... టెన్షన్...

తొలి రోజు పరీక్ష కావడంతో పలు ప్రాంతాల్లో విద్యార్థుల్లో టెన్షన్ వాతావరణం కన్పించింది. హైదరాబాద్, రంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరీక్షకు గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవడం కన్పించింది. పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేసినప్పటికీ మారుమూల ప్రాంతాల్లో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిబంధనల్లో స్వల్పంగా సడలింపు ఇచ్చినట్టు జిల్లాల అధికారులు తెలిపారు. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు ప్రకటించినప్పటికీ, అవి సకాలంలో అందుబాటులో లేకుండా పోయాయనే విమర్శలు విన్పించాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కొందరు విద్యార్థులు సొంత రవాణా ఏర్పాట్లు చేసుకున్నారు.


బకెట్‌లో పెరుగుతున్న బీర తీగ

బకెట్‌లో బీర...ఏకకాలంలో టమాటా, సోంపు, జామ, నిమ్మ సాగు

పంటల సాగులో కొత్త పుంతలు

వ్యవసాయాన్ని కొందరు రైతులు కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఆధునిక సాగు పద్ధతులు అవలంబిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన రైతు జయప్రకాశ్ ఇదే కోవకు చెందుతారు. ఆయన గుత్ప శివారులో ఎకరం భూమిలో ఏక కాలంలో టమాటా, సోంపు, జామ, నిమ్మ, బీర సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. బీర విత్తనాలను భూమిలో కాకుండా బకెట్లలో విత్తి, కర్రలకు వేలాడ దీసి సాగు చేస్తున్నారు. ఆధునిక పద్ధతులు అవలంబిస్తూనే సేంద్రియ ఎరువులను వాడుతూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఎకరం పొలంలో 300 బకెట్‌లను ఏర్పాటు చేసి బీరసాగు చేస్తున్నట్లు జయప్రకాశ్ తెలిపారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.